www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 8-6-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 70 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి ఉ.7.18 తదుపరి త్రయోదశి; నక్షత్రం: స్వాతి మ.12.42 తదుపరి విశాఖ; వర్జ్యం: రా.6.57-8.44; దుర్ముహూర్తం: సా.5.00-5.52; అమృతఘడియలు: ఉ.5.43-7.34; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.43; సూర్యాస్తమయం: 6.44 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



భారీగా తగ్గిన
'తీవ్ర పేదరికం'

దేశంలో 27.1% నుంచి 5.3 శాతానికి

26 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి

దశాబ్ద కాలంలో రికార్డు స్థాయి మార్పు

ప్రపంచబ్యాంకు గణాంకాలపై కేంద్రం

న్యూఢిల్లీ, జూన్ 7: పేదరిక నిర్మూలనలో భారత్ రికార్డు స్థాయిలో దూసుకెళుతోంది. దేశంలో సుమారు దశాబ్దకాలంలో తీవ్ర పేదరికం రేటు భారీగా తగ్గింది. ప్రపంచ బ్యాంకు గణాంకాలను పేర్కొంటూ... కేంద్రం దీనిపై ఒక ప్రకటన విడుదల చేసింది. 2011-12 సంవత్సరంలో దేశంలో 27.1 శాతంగా ఉన్న తీవ్ర పేదరికం రేటు 2022-23 నాటికి 5.3 శాతానికి తగ్గిపోయిందని పేర్కొంది. 2011-12లో 34.4 కోట్ల మంది తీవ్ర పేదరికంలో ఉండగా.. 2022-23 నాటికి ఆ సంఖ్య 7.5 కోట్లకు తగ్గిందని చెప్పింది. ఆ 11 ఏళ్ల కాలంలో సుమారు 26.9 కోట్ల మంది తీవ్ర పేదరికం నుంచి బయట పడ్డారని స్పష్టం చేసింది. 2011-12లో దేశంలోని అత్యంత పేదల్లో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్‌లోనే 65 శాతం మంది ఉండేవారు. ఇప్పుడు తగ్గిన సంఖ్యలో కూడా వారు మూడింట రెండు వంతులు ఉన్నారు. 2021 మారకం ప్రకారం రోజుకు 3 డాలర్లు ఖర్చు చేసే స్థోమత.. అనే అంతర్జాతీయ పేదరిక రేఖను ఆధారంగా చేసుకుని ప్రపంచ బ్యాంకు మన దేశంలో పేదరికాన్ని మదింపు చేసింది. దీనిలో పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా పేదరికం బాగా తగ్గినట్లు తేలిందని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో 18.4 శాతం

మిగతా 11వ పేజీలో...

నేడే విస్తరణ

మధ్యాహ్నం 12.19కు రాజ్‌భవన్‌లో ప్రమాణం

ఆరు ఖాళీల్లో.. మూడు మాత్రమే భర్తీచేసే అవకాశం

బీసీ, ఎస్సీ వర్గాలకే మంత్రివర్గ విస్తరణ పరిమితం!

బీసీల నుంచి వాకిటి శ్రీహరికి క్యాబినెట్ బెర్తు పక్కా

ఎస్సీల్లో మాల, మాదిగలకు ఒక్కొక్కరి చొప్పున..

మాల సామాజికవర్గం నుంచి జి.వివేక్‌కు చాన్స్

మాదిగల్లో కవ్వంపల్లి, అడ్లూరి లక్ష్మణ్‌లలో ఒకరికి!

ఎస్టీల నుంచి ఒకరికి ఇవ్వాలంటున్న సీఎం రేవంత్

ఓసీల నుంచి సుదర్శన్‌రెడ్డి పేరూ ప్రతిపాదన


విస్తరణకు కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా..

తుది జాబితాలో ఎవరెవరు ఉంటారన్న ఉత్కంఠ

అందుబాటులో ఉండండి: సీఎం

మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వేముల వీరేశం, కాలె యాదయ్య, మందుల సామేలు శనివారం రాత్రి సీఎం రేవంత్‌ను కలిశారు. విస్తరణలో తమ సామాజికవర్గానికి స్థానం కల్పించాలని కోరారు. 'ఆదివారం అందుబాటులో ఉండండి. మీలో ఒకరికి మంత్రి పదవి వస్తుంది. ఎవరికి వచ్చినా.. ఇప్పుడు కలిసివచ్చినట్లే కలిసి ఉండాలి, కలిసి రావాలి' అని వారితో సీఎం అన్నట్లు సమాచారం. కాగా, ఈ ఐదుగురిలో కవ్వంపల్లి పేరు తొలి ప్రాధాన్యంగా ఉండగా.. అడ్లూరి లక్ష్మణ్ పేరూ పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది.

హైదరాబాద్, జూన్ 7, (ఆంధ్రజ్యోతి): ఎన్నాళ్లో వేచిన మంత్రివర్గ విస్తరణ.. చివరికి ఇన్నాళ్లకు జరగబోతోంది. ఆశావహులు, సామాజిక సమీకరణలు వంటి అంశాలతో ఎన్నేసార్లు వాయిదా పడుతూ వచ్చిన రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఆదివారం మధ్యాహ్నం 12.19 గంటలకు రాజ్‌భవన్‌లో కొత్త మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనుంది. మంత్రివర్గంలో ఆరు ఖాళీలు ఉండగా.. అన్నీ కాకుండా ప్రస్తుతానికి పాక్షికంగా మాత్రమే భర్తీ చేయనున్నారు. ఈ దఫాలో కేవలం ముగ్గురినే తీసుకోవాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. అది కూడా బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలకే చోటు దక్కనుంది. బీసీల నుంచి నారాయణపేట జిల్లా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి అవకాశం లభించనుంది. ముదిరాజ్ సామాజికవర్గానికి మంత్రివర్గంలో స్థానం కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి గతంలోనే ప్రకటించారు. ఆ వర్గం నుంచి ఉన్న ఏకైక ఎమ్మెల్యే శ్రీహరే కావడంతో ఈయనకు బెర్త్ ఖాయమైంది. ఇక ఎస్సీల నుంచి మాల సామాజికవర్గానికి చెందిన మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే జి.వివేక్‌కు అవకాశం దక్కనుంది. మరో బెర్తును కూడా ఎస్సీల నుంచే భర్తీ చేయనున్నారు. ఈ అవకాశం మాదిగ సామాజికవర్గానికి చెందిన కరీంనగర్ జిల్లా మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు గానీ, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు గానీ లభించనుంది. ఇలా ఎస్సీల నుంచి మాల, మాదిగలకు ఒక్కొక్కరికి చొప్పున ఇద్దరు ఎమ్మెల్యేలకు చోటు కల్పించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి.



వాకిటి శ్రీహరి



గడ్డం వివేక్



కవ్వంపల్లి సత్యనారాయణ



అడ్లూరి లక్ష్మణ్ కుమార్

3 బెర్తులూ కొత్త ఎమ్మెల్యేలకే..

క్యాబినెట్‌లో భర్తీ చేయబోయే మూడు స్థానాలకూ తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన వారినే తీసుకుంటుండడం గమనార్హం. వీరిలో జి.వివేక్ 2009-2014 మధ్య ఓసారి ఎంపీగా పనిచేసినా.. ఎమ్మెల్యేగా ఎన్నికయింది మాత్రం తొలిసారే. వాకిటి శ్రీహరి, కవ్వంపల్లి సత్యనారాయణ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కూడా తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన వారే. అయితే ఇదే తుది జాబితా కాదన్న అభిప్రాయాలూ ఉన్నాయి. బీసీ, ఎస్సీలతోపాటు ఒక ఎస్టీకి, అదే సమయంలో ఓసీల నుంచి సీనియర్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికీ అవకాశం ఇవ్వాలని స్వయంగా సీఎం రేవంత్ పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. ఎస్టీల నుంచి లంబాడ సామాజికవర్గానికి చెందిన నల్లగొండ జిల్లా దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌తోపాటు మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్ పేర్లు

మిగతా 14వ పేజీలో...

కాళేశ్వరం మంటలు



కాళేశ్వరంపై హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజంటేషన్

మేడిగడ్డ కుంగుబాటుపై కాళేశ్వరం కమిషన్ ముందు మాజీ మంత్రి ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రధాన పార్టీల నేతల మధ్య మాటల మంటలు రాజేశాయి! కాళేశ్వరం ప్రాజెక్టును అప్పటి క్యాబినెట్ ఆమోదించిందని ఈటల అంటే.. తాజాగా మాజీ మంత్రి హరీశ్ రావు కూడా అదే మాట చెప్పారు! అయితే, అందుకు క్యాబినెట్ ఆమోదం లేదని, అసలు ఆ విషయం క్యాబినెట్ ముందుకే రాలేదని అప్పటి, ఇప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఇక, మేడిగడ్డపై ఏర్పాటు చేసిన సబ్ కమిటీలో తాను, ఈటల, తుమ్మల ఉన్నామని హరీశ్ స్పష్టం చేశారు. విచారణ అనంతరం ఇదే విషయాన్ని ఈటల కూడా చెప్పారు. కానీ, అది అసలు మేడిగడ్డపై ఏర్పాటు చేసిన సబ్ కమిటీ కానే కాదని తాజాగా తుమ్మల ఖండించారు. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీ నివేదిక ఇచ్చిందని హరీశ్ అంటే.. అసలు అలా ఎప్పుడూ చెప్పలేదని మంత్రి ఉత్తమ్ తెలిపారు. మరోవైపు, ఈ అంశం ఇప్పుడు బీజేపీలోనూ కాకరేపింది. ఆ పార్టీ అగ్రనేతల ఆరోపణలకు విరుద్ధంగా ఈటల వ్యాఖ్యలు ఉన్నాయంటూ విమర్శలు చెలరేగాయి. దీనిపై బీజేపీ అధిష్ఠానానికి నివేదిక వెళ్లినట్లు సమాచారం!! 13

మేడిగడ్డ.. మంత్రివర్గ నిర్ణయమే

వ్యాప్కోస్ నివేదిక, లైడార్ సర్వేలతోనే ఆ ప్రాంతం ఎంపిక.. ఉప సంఘంలో సభ్యులుగా ఈటల, తుమ్మల

ప్రాజెక్టు ద్వారా 20.33 లక్షల ఎకరాలకు నీరు.. 17లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ.. కాంగ్రెస్‌ది దుష్ప్రచారం

2 పిల్లర్లు కుంగితే ప్రాజెక్టే కూలినట్టుగా చిత్రీకరణ.. బీజేపీకి జేబు సంస్థగా నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ

మేడిగడ్డ కుంగుబాటుపై నా వద్ద కీలక డాక్యుమెంట్.. కాళేశ్వరంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో హరీశ్

క్యాబినెట్ ఆమోదం లేదు



కాళేశ్వరం విషయం క్యాబినెట్ ముందుకు రానేలేదు

మూడేళ్ల తర్వాత అంచనాల మార్పు ఫైలు వచ్చింది

ఈ విషయాన్ని నిరూపించేందుకు నేను సిద్ధం

విచారణ కమిషన్ ముందు ఈటల రాజేందర్..

లేని విషయాలను ఎందుకు చెప్పారో స్పష్టతనివ్వాలి

అసత్యాలు మాట్లాడితే.. అబద్ధాల హరీశ్ అవుతారు

అన్ని వివరాలు విచారణ కమిషన్‌కు ఇస్తా: తుమ్మల



తుమ్మిడిహెట్టి వద్ద నీరు లేదని
సీడబ్ల్యూసీ ఎప్పుడూ చెప్పలేదు

కాళేశ్వరం వైఫల్యానికి కేసీఆర్, హరీశే కారకులు

బీఆర్ఎస్ కక్కుర్తితో రాష్ట్రంపై శాశ్వత ఆర్థిక భారం

ప్రజలు రూ.16 వేల కోట్ల వడ్డీలు కడుతున్నారు: ఉత్తమ్

దొంగలకు సద్దులు మోసినట్లుగా ఈటల తీరు: ఆది శ్రీనివాస్

ఈటల.. మళ్లీ బీఆర్ఎస్‌లోకి పోవాలని చూస్తున్నారు: మేడిపల్లి సత్యం

కమలంలో ఈటల ఇరకాటం!

కమిషన్ ముందు కేసీఆర్‌పై విమర్శ లేకపోవడంతో ఇబ్బంది

బీజేపీ అధిష్ఠానానికి రాష్ట్ర ముఖ్యుల అంతర్గత నివేదిక?

అది ఈటల స్టాండ్.. బీజేపీది కాదు: కిషన్‌రెడ్డి

జగన్.. నేరం.. రాజకీయం!



కొత్త పలుకు

తన కోపమే తన శత్రువు అని పెద్దలు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏడాది క్రితం జరిగిన ఎన్నికల్లో అధికారం కోల్పోయిన జగన్మోహన్ రెడ్డి ఇటు ప్రజల పైన, అటు రాజకీయ ప్రత్యర్థులపైన పట్టరాని కోపంతో రగిలిపోతున్నారు.

రాజకీయాలను మరో లెవల్‌కు తీసుకువెళ్లే పనిలో జగన్ బిజీగా ఉంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా తెనాలిలో పేరు మోసిన ముగ్గురు నేరస్తులను పోలీసులు ఇటీవల నడిరోడ్డుపై చితకబాదారు. ఆ ముగ్గురూ దళితులు కావడంతో దొరకునా ఇటువంటి మహదావకాశం అన్నట్టుగా జగన్ రెడ్డి ఆ ముగ్గురి కుటుంబాల పరామర్శకు వెళ్లారు.

నేర చరిత్ర ఉన్న వారిని గుర్తించి రాజకీయం ముసుగులోనో, నవిన్మన వాళ్లకు అండగా ఉంటాడనే ముసుగులోనో వాళ్లను చేరదీయడం, పెంచి పోషించడం, తన చేతికి మట్టి అంటకుండా వారిని వాడుకోవడం వైఎస్ కుటుంబానికి వెన్నతో పెట్టిన విద్య. అధికారం కోల్పోయినప్పుడు శాంతిభద్రతల సమస్యలు సృష్టిస్తారు. కులాల మధ్య కుంపట్లు రగిలిస్తారు. రాజశేఖర రెడ్డికి అధికారం అందే వరకు కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు కూడా ఈ కుటుంబం కుతంత్రాలను తట్టుకోలేకపోయారు.

కుల, మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టగలిగితే అభివృద్ధి, సంక్షేమాలకు అతీతంగా ఎన్నికల ఫలితాలు ఉంటాయని జగన్ రెడ్డి నమ్ముతున్నారు. అందుకే కొన్ని కులాలను ఇతర కులాలకు శత్రువుగా చిత్రీకరించే పని చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు కమ్మ, కాపు కులాలను టార్గెట్ చేసుకున్నారు. తమ రాజకీయ అధికారానికి అడ్డు వచ్చే వాళ్లు దళితులైనా, క్రైస్తవులైనా, రెడ్లైనా, ముస్లింలైనా ఆ కుటుంబం క్షమించదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తోంది. ఎన్నికలకు ఇంకా నాలుగేళ్ల వ్యవధి ఉంది. అయినా 'మేం అధికారంలోకి వచ్చాక మీకు ఉంటుందిరా!' అని వైసీపీలోని కింది స్థాయి వాళ్లు కూడా తొడ గొడుతున్నారంటే కేసులు - జైళ్లు అంటే వారికి భయం లేకపోవడమే కారణం.

శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు విభజిత ఆంధ్రప్రదేశ్‌లో అసాంఘిక శక్తులకు బలం చేకూరిందంటే అందుకు జగన్ రెడ్డి కారణం. అందరిదీ ఒకటే స్కూల్- ఒకటే సిలబస్! తాము ఆరాధించే నాయకుడి కోసం నేరాలు చేయడం! అవసరమైతే జైలుకు వెళ్లడం తమకు లభించిన అదృష్టంగా ఈ అసాంఘిక శక్తులు భావించే పరిస్థితి ప్రస్తుతం ఉంది. అందుకే ఇప్పుడు జైలుకు వెళ్లిన వారిలో కనీస పశ్చాత్తాపం కనిపించడం లేదు. 4

కాలక్రమంలో నేరస్థులకు, రాజకీయ నాయకులకు మధ్య తేడా అంతరించిపోతూ వస్తోంది. నేరస్థులకు అధికారం అందడంతో నిజాయితీగా పనిచేసిన పోలీసు అధికారులు కూడా తమ స్వభావాన్ని మార్చుకొని వారితో జత కట్టారు. ఈ మార్పు కారణంగానే పీఎస్ఆర్ ఆంజనేయులు ఇప్పుడు జైలు జీవితం గడపాల్సి వస్తోంది. ఒకప్పుడు నేరస్థుల భుజంపై చేయి వేయాలంటే రాజకీయ నాయకులు భయపడేవారు. ఇప్పుడు వారి చుట్టూ నేరస్థులే ఉంటున్నారు.



ఓఆర్ఆర్ లోపల 65 వేల ఆటోలకు అనుమతి 14

విద్యుత్, ఎల్పీజీ, సీఎన్‌జీ ఆటోలకు మాత్రమే

65 వేల కుటుంబాలకు ఉపాధి: పొన్నం

స్వగృహ ఫ్లాట్లు.. హౌసింగ్ ప్లాట్ల వేలానికి
సర్కారు పచ్చజెండా

ఈ నెల 20 నాటికి నోటిఫికేషన్లు 9

సరదాగా స్నానానికి వెళ్లి.. గోదావరిలో

ఆరుగురు గల్లంతు


అంతా 18 ఏళ్ల లోపువారే..

మేడిగడ్డ బ్యారేజీ వద్ద దారుణ ఘటన

తండ్రి కళ్ల ముందే కొట్టుకుపోయిన ఇద్దరు కుమారులు

విస్తృతంగా గాలింపు చేపట్టిన పోలీసు, సింగరేణి రెస్క్యూ బృందాలు

భద్రాచలంలో గోదావరిలో మునిగి ఎనిమిదేళ్ల బాలుడి మృతి 3



బీజేపీ 'మహా' రిగ్గింగ్

మహారాష్ట్రలో మ్యాచ్ ఫిక్సింగ్‌తో గెలుపు

ప్రజాస్వామ్య రిగ్గింగ్‌కు అది బ్లూప్రింట్

రేపు బిహార్‌లోనూ జరిగేది ఇదే: రాహుల్

తప్పుడు కథనాలకు బ్లూప్రింట్ రాహుల్ వ్యాఖ్యలు: నడ్డా 11

కాంగ్రెస్ నేత వ్యాఖ్యలను ఖండించిన ఈసీ

ఖరీఫ్‌కు యూరియా కొరత!

సీజన్ కోసం 9.8 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం

అందుబాటులో 3.78 లక్షల మెట్రిక్ టన్నులే 9

సరిపడా ఇవ్వాలని కేంద్రానికి తుమ్మల లేఖలు


కొవిడ్‌పై సర్కారు సన్నద్ధత

10 లక్షల టెస్టింగ్ కిట్ల కొనుగోలుకు టెండర్లు

మాస్కులు, శానిటైజర్ల కోసం కూడా 3

నేడు బండారు దత్తాత్రేయ ఆత్మకథ ఆవిష్కరణ 3

హైదరాబాద్ చేరుకున్న రామ్‌నాథ్ కోవింద్



బండారు దత్తాత్రేయ ఆత్మకథ ఆవిష్కరణ నేడు

- హైదరాబాద్ చేరుకున్న మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్
- ఎంపీ ఈటల నివాసంలో కోవింద్‌కు తేనీటి విందు

హైదరాబాద్, మూడుచింతలపల్లి, శంషాబాద్ రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): హరియణ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆత్మకథ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఉదయం 11 గంటలకు శిల్పకళావేదికలో జరగనుంది. తెలంగాణ ప్రజల కథే నా ఆత్మకథ పేరుతో రాసిన ఈ పుస్తకం మొదటి కాపీని, సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మలకు అందచేయనున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యానాయుడు, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, శ్రీనివాసవర్మ, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, త్రిపుర గవర్నర్లు అబ్దుల్ నజీర్, కంభంపాటి హరిబాబు, ఎన్ ఇంద్రసేనారెడ్డి కూడా హాజరుకానున్నారని అలయ్‌బలయ్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి తెలిపారు.

మాజీ రాష్ట్రపతికి ఘనస్వాగతం

రెండు రోజుల పర్యటన నిమిత్తం హైదరాబాద్ వచ్చిన రామ్‌నాథ్ కోవింద్‌కు శంషాబాద్ విమానాశ్రయంలో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయన షాద్‌నగర్ మండల పరిధిలోని నందిగామలో ఉన్న కన్హా ఆశ్రమానికి వెళ్లారు. అనంతరం రాజ్‌భవన్‌లో రామ్‌నాథ్ కోవింద్‌కు బండారు దత్తాత్రేయ స్వాగతం పలికారు. ఆ తర్వాత కోవింద్ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ నివాసంలో తేనీటి విందుకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మావోయిస్టులను కోర్టులో హాజరుపరచాలి

- ఆపరేషన్ కగార్‌పై న్యాయ విచారణ జరిపించాలి
- పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్

నల్లకుంట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ ఏరియాలోని పర్సఘడ్ గ్రామంలో ఈ నెల 5న ఆ రాష్ట్ర పోలీసులు అదుపులోకి తీసుకున్న మావోయిస్టులను వెంటనే కోర్టులో హాజరుపరచాలని పౌరహక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో జరుగుతున్న హత్యాకాండపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత న్యాయ విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పౌర హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నారాయణరావు, నగర ప్రధాన కార్యదర్శి రాజారాం, కార్యవర్గ సభ్యులు పి.ఎం.రాజు, ఉపాధ్యక్షులు పి.సుదర్శన్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు సుధాకర్, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు మైలారం ఆడేళు అలియాస్ భాస్కర్, ఒంటి ప్రకాష్, నేషనల్ పార్కు కార్యదర్శి దిలీప్, ఏరియా కార్యదర్శి సీటు రామన్న, డీసీ సభ్యుడు మున్నా, సునీత, మహేష్‌తో పాటు పదిమంది మావోయిస్టులను ఛత్తీస్‌గఢ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని పేర్కొన్నారు. అయితే వారిని అరెస్టు చూపకుండా అదే రోజు సుధాకర్‌ను కాల్చి చంపారని, ఈ నెల 6న మైలారం ఆడేళును కాల్చి చంపారని, మిగతా వారిని తక్షణమే కోర్టులో హాజరుపరచాలని డిమాండ్ చేశారు. పర్సఘడ్‌లో అరెస్టు అయిన వారిని చిత్రహింసలకు గురిచేస్తూ ఎన్‌కౌంటర్ల పేరుతో కాల్చి చంపుతున్నారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ హత్యలను ప్రజలు, ప్రజాస్వామికవాదులు ప్రశ్నించాలని ఆయన కోరారు.

కాల్చిచంపి ఎన్‌కౌంటర్ అంటున్నారు

- వామపక్షాల ఆగ్రహం

హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు అగ్రనాయకులను అత్యంత అమానుషంగా హత్య చేస్తున్నారని, పోలీసు కస్టడీలో ఉన్న నాయకులను ఒక్కొక్కరిని కాల్చి చంపి ఎన్‌కౌంటర్ అంటున్నారని వామపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. కస్టడీలో ఉన్న అందరినీ ఇదే రీతిలో కాల్చి చంపి ఎన్‌కౌంటర్‌గా ప్రకటించే అవకాశం కనిపిస్తోందన్నాయి. సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో శనివారం వామపక్షాలన్నీ సమావేశమై ఆందోళన వ్యక్తం చేశాయి. బీజాపూర్ పోలీసు కస్టడీలో ఉన్న వారిని వెంటనే కోర్టుకు అప్పగించాలని డిమాండ్ చేశాయి. ఆపరేషన్ కగార్ నిలిపేసి, శాంతి చర్చలు జరపాలని కోరాయి. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు నక్సల్స్ మృతి

చర్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఇంద్రావతి నేషనల్ పార్క్ అడవుల్లో శనివారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో ఇద్దరు మహిళలున్నారు. చనిపోయిన మావోయిస్టులను ఇంకా గుర్తించాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలంలో 5 తుపాకులు ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మూడ్రోజుల క్రితం నేషనల్‌పార్క్ అడవుల్లో మావోయిస్టు పార్టీ ముఖ్య నేతలున్నట్లు సమాచారం రావడంతో బీజాపూర్‌కు చెందిన డీఆర్‌జీ, ఎస్టీఎఫ్ బలగాలు కూబింగ్ ప్రారంభిచాయి. గురువారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్, శుక్రవారం మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు భాస్కర్ మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే.. నేషనల్ పార్క్ అడవుల్లోని ఓ గ్రామంలో మావోయిస్టులను అదుపులోకి తీసుకున్న పోలీసు లు.. రోజుకు కొందరి చొప్పున మట్టుబెడుతూ.. ఎన్‌కౌంటర్ల పేరుతో బుకాయిస్తున్నారని పౌరహక్కుల సంఘం నేతలు ఆరోపిస్తున్నారు. కాగా.. నేషనల్ పార్క్ అడవుల్లో కూంబింగ్ సందర్భంగా బలగాలపై తేనెటీగలు దాడి చేశాయని, ఒకరిద్దరు జవాన్లు తేలుకాటుకు గురయ్యారని తెలుస్తోంది. దీనిపై బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ స్పందిస్తూ.. బలగాలు క్షేమంగా ఉన్నాయని చెప్పారు.

మిస్ ఇంగ్లండ్ ఆరోపణలపై పోస్టులు

- బీఆర్ఎస్ నేత క్రిశాంక్‌ను విచారించిన పోలీసులు

రాజేంద్రనగర్, జూన్7(ఆంధ్రజ్యోతి): ప్రపంచ సుందరి పోటీలపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అందిన ఫిర్యాదుపై దర్యాప్తులో భాగంగా శనివారం రాజేంద్రనగర్ పోలీసులు బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ క్రిశాంక్‌ను విచారించారు. ఆయనను పోలీసు స్టేషన్‌కు పిలిపించి పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబెట్టారు. ఆయనపై తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ (టీఎంఆర్ఈఐఎస్) వైస్ చైర్మన్ మహ్మద్ ఫహీమ్ ఖురేషీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే కేసులో ఇద్దరు రిపోర్టర్లను విచారించిన పోలీసులు తాజాగా క్రిశాంక్‌కు నోటీసులు ఇచ్చి విచారణ జరిపారు. విచారణ అనంతరం క్రిశాంక్ మీడియాతో మాట్లాడారు. మిస్‌ఇంగ్లండ్ సొంత దేశానికి వెళ్లి పోటీల నిర్వహణపై ఆరోపణలు చేశారని చెప్పారు. అందుకు సంబంధించిన న్యూస్‌పేపర్ కటింగ్‌లను తాను పోస్టు చేశానని తెలిపారు. దీనికే తనకు నోటీసులు ఇచ్చి విచారణకు పిలిపించడం బాధాకరమని అన్నారు. దేశానికి వచ్చిన అతిథులకు జరిగిన అవమానాన్ని ఆమె మీడియా ముఖంగా వెల్లడించగా, ఆ కటింగ్స్‌ను సోషల్ మీడియాలో పెట్టినవారిపై ప్రభుత్వం విచారణ చేయిస్తోందని తెలిపారు. అదేవిధంగా మిస్ ఇంగ్లండ్ చేసిన ఆరోపణలపై కూడా విచారణ చేస్తే బాగుండేదని వ్యాఖ్యానించారు.

సరదాగా స్నానానికి వెళ్లి..

గోదావరిలో ఆరుగురి గల్లంతు

- అంతా 18 ఏళ్లు, ఆలోపు వారే..
- శనివారం సాయంత్రం మేడిగడ్డ బ్యారేజీ వద్ద ఘటన
- విస్తృతంగా గాలింపు చేపట్టిన పోలీసు, సింగరేణి రెస్క్యూ బృందాలు
- భద్రాచలంలో గోదావరిలో మునిగి ఎనిమిదేళ్ల బాలుడి మృతి


పట్టి శివమనోజ్, రాంచరణ్, రాహుల్, సాగర్(ఫైల్)

మహదేవపూర్ రూరల్/భద్రాచలం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సరదాగా స్నానానికని గోదావరి నదికి వెళ్లి ఆరుగురు గల్లంతయ్యారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ వద్ద శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. అంతా 18 ఏళ్లు, ఆలోపు వయసువారే. అందులోనూ తండ్రి కళ్ల ముందే ఇద్దరు కుమారులు కూడా నీళ్లలో కొట్టుకుపోవడం విషాదకరం. మహదేవపూర్ మండలం అంబట్‌పల్లి గ్రామానికి చెందిన పట్టి వెంకటస్వామి కుమారులు పట్టి మధుసూదన్ (18), పట్టి శివమనోజ్ (15), వారి బంధువు తొగరి రక్షిత్ (13), మహాముత్తారం మండలం కొర్లకుంటకు బొల్లెడ్ల రాంచరణ్ అలియాస్ పండు (17), స్తంభంపల్లి (పీపీ) గ్రామానికి చెందిన పసుల రాహుల్ (18) కలసి శనివారం అంబట్‌పల్లిలో ఓ పెళ్లికి వెళ్లారు. వారికి స్థానికులైన కర్నాల సాగర్ (16), శివమణికంఠ జత కలిశారు. అందరూ మేడిగడ్డ వద్ద గోదావరిలో సరదాగా స్నానం చేసేందుకు వెంకటస్వామి ఆటో తీసుకుని బయలుదేరేందుకు సిద్ధమయ్యారు. అయితే వెంకటస్వామి వారించి, తానే ఆటోను నడుపుకొంటూ గోదావరి వద్దకు తీసుకువచ్చారు. వెంకటస్వామి, శివమణికంఠ ఒడ్డునఉండగా.. మిగతా వారు సాయంత్రం నదిలోకి దిగారు. లోతు ఎక్కువ, ప్రవాహం వేగంగా ఉండటంతో మధుసూదన్, శివమనోజ్, రక్షిత్, సాగర్, రాంచరణ్, రాహుల్ కొట్టుకుపోవడం మొదలుపెట్టారు. వారిని కాపాడేందుకు శివమణికంఠ, వెంకటస్వామి ప్రయత్నించారు. కానీ బ్యారేజీ వద్ద 5 వేల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతుండటంతో సాధ్యపడలేదు. దీనిపై పోలీసులకు, గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. సింగరేణి, అగ్నిమాపక, పోలీసు రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టాయి. అప్పటికీ చీకటిపడటంతో గాలింపు ఆలస్యమవుతోంది.


రక్షిత్, మధుసూదన్(ఫైల్)

భద్రాచలం వద్ద ఘటనలో..

భద్రాచలం వద్ద గోదావరిలో మునిగి ఎనిమిదేళ్ల బాలుడు మృతి చెందాడు. హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు చెందిన ధనుంజయ్, స్వప్న దంపతులు తమ కుమారుడు అఖిల్‌గౌడ్(8), మరో 13 మందితో కలసి శనివారం భద్రాచలం వచ్చారు. వారంతా గోదావరిలో స్నానం చేస్తుండగా.. అఖిల్ నది లోతును అంచనా వేయలేక నీటిలో మునిగి చనిపోయాడు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు.. ఇద్దరి మృతి

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వారాంతపు సెలవులను సరదాగా గడిపేందుకు నగర శివారులోని ఓ ఫామ్‌హౌస్‌కు వెళ్లిన ఐటీ ఉద్యోగులు వారు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి స్తంభాన్ని ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లో జరిగింది. ప్రమాదంలో హయత్‌నగర్ పరిధిలోని కుంట్లూర్‌కు చెందిన భార్గవ్ యాదవ్ (23), సైనిక్‌పురికి చెందిన వర్షిత్ (22)లు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. ఆ సమయంలో కారు నడుపుతున్న అల్వాల్‌కు చెందిన ప్రవీణ్ (30)కు తీవ్ర గాయాలయ్యాయి.

‘కన్నప్ప’లో బ్రాహ్మణులను కించపరిచారు

- గుంటూరులో బ్రాహ్మణ చైతన్య వేదిక నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీ బ్రాహ్మణ చైతన్య వేదిక, అర్చకసేవా సంఘం ప్రతినిధులు

గుంటూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మంచు విష్ణు నటించిన కన్నప్ప సినిమాలో పిలక, గిలక అనే పాత్రలు పెట్టి బ్రాహ్మణ సంప్రదాయాన్ని అవమానించారని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ, అర్చక సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంధ్యాల రామలింగేశ్వర శాస్త్రి మండిపడ్డారు. ఇందుకు నిరసనగా శనివారం గుంటూరు శంకర్ విలాస్ సెంటర్లో 'శివయ్యకు అపచారం-తిన్నడుకు అన్యాయం' పేరుతో శివలింగాన్ని ఏర్పాటు చేసి ఏకరుద్రాభిషేకాలు చేశారు. సనాతన ధర్మ పరిరక్షణ జేఏసీ, అర్చక పురోహిత బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో శాంతియుత నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీధర్ శర్మ మాట్లాడుతూ కన్నప్ప సినిమాలో హాస్య పాత్రల కోసం, బ్రాహ్మణులను, పిలకను వాడుకోవడం క్షమించరానిదన్నారు. ఈ పాత్రల విషయమై గత నవంబర్లో ఏపీ హైకోర్టులో తాము రిట్ పిటిషన్ దాఖలు చేశామని, కేసు పెండింగ్‌లో ఉండగా కన్నప్ప సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఎలా చేస్తారని ప్రశ్నించారు. సెన్సార్ బోర్డు రీజనల్ అధికారి ఈ సినిమాపై చర్యలు తీసుకోకపోతే భారతీయ చలనచిత్ర చట్టం ప్రకారం ఆ అధికారిపై క్రిమినల్ కేసులు బనాయిస్తామని శ్రీధర్ హెచ్చరించారు.


యాదగిరిగుట్ట కొండపై క్యూకాంప్లెక్స్‌లో రద్దీ

యాదగిరి క్షేత్రంలో వారాంతపు రద్దీ

50వేల మంది భక్తులు.. అర కోటి ఆదాయం.. ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక పెట్టెలు

యాదగిరిగుట్ట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో శనివారం భక్తుల వారాంతపు రద్దీ నెలకొంది. ధర్మదర్శనం చేసుకునేందుకు 3 గంటలు, వీఐపీ టికెట్(రూ.150) దర్శనానికి గంట సమయం పట్టినట్టు భక్తులు తెలిపారు. సుమారు 50వేల మంది భక్తులు క్షేత్రాన్ని సందర్శించగా, వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 58,19,135 ఆదాయం సమకూరిందని ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. ప్రధాన కార్యాలయం, ఆలయం, ప్రోటోకాల్ కార్యాలయం, ప్రసాద విక్రయశాల వద్ద భక్తుల సలహాలు, సూచనలు, ఫిర్యాదులు స్వీకరించేందుకు ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేశారు.

తొక్కిసలాటలో కుట్రకోణం?

- ఎన్ఐఏ దర్యాప్తు చేసే అవకాశం
- కొనసాగుతున్న మెజిస్టీరియల్, సీఐడీ దర్యాప్తు
- కేఎస్‌సీఏ కార్యదర్శి, కోశాధికారి రాజీనామా

బెంగళూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట ఘటనలో కుట్ర కోణం ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై ఇప్పటికే జిల్లా అధికారి జగదీశ్ నేతృత్వంలో మెజిస్టీరియల్ విచారణ కొనసాగుతోంది. సీఐడీ ఎస్పీ శుభన్విత నేతృత్వంలో దర్యాప్తు జరుగుతోంది. రిటైర్డు న్యాయమూర్తి మైఖేల్ డి కున్హా నేతృత్వంలో న్యాయ విచారణకు సైతం ఆదేశించారు. మరోవైపు ఎన్ఐఏ కూడా సుమోటోగా కేసు నమోదు చేసే అవకాశం ఉంది. తొక్కిసలాట ఆకస్మికంగా జరిగిందా..? ఇతరత్రా సంఘాలు, సంస్థల ప్రమేయం ఉందా? విధాన సౌధ వద్ద జరిగిన విజయోత్సవంలో ఓ మంత్రి కుమారుడు ఎందుకు పాల్గొన్నారు? దీని వెనుక కుట్ర కోణం ఏమైనా ఉందా? అనే కోణంలో వచ్చేవారం నుంచి ఎన్ఐఏ విచారణ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. తొక్కిసలాటలో 11 మంది మృతి చెందడానికి నైతిక బాధ్యత వహిస్తూ కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్(కేఎస్‌సీఏ) కార్యదర్శి ఎ.శంకర్, కోశాధికారి ఈఎస్ జయరాం తమ పదవులకు రాజీనామా చేశారు. స్టేడియం గేట్ల నిర్వహణ, జనసందోహం పర్యవేక్షణతో క్రికెట్ అసోసియేషన్‌కు సంబంధం లేదని పేర్కొంటూ కేఎస్‌సీఏ అధ్యక్షుడు, కోశాధికారి, కార్యదర్శి శుక్రవారం హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలు చేశారు. ఇంతలోనే శనివారం ఇద్దరూ రాజీనామా చేశారు.

మ్యాచ్ గెలవక ముందే ఎలా..?

ఆర్‌సీబీ, పంజాబ్ జట్ల మధ్య ఈ నెల 3న రాత్రి 7.30 గంటలకు అహ్మదాబాద్‌లో ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ ప్రారంభమైంది. అయితే విజయోత్సవాలకు అనుమతి కోరుతూ కబ్బన్ పార్క్ పోలీసులకు అదే రోజు సాయంత్రం 6 గంటలకే ఆర్‌సీబీ వినతిపత్రం ఇచ్చింది. చిన్నస్వామి స్టేడియంలో కార్యక్రమం నిర్వహిస్తామని అందులో పేర్కొన్నారు. మ్యాచ్ గెలవడానికి ముందే విజయోత్సవాలకు అనుమతి కోరడంపై కేంద్రమంత్రి కుమారస్వామి అనుమానం వ్యక్తం చేశారు. బెంగళూరులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. విధానసౌధ ఎదుట కార్యక్రమం నిర్వహిస్తామని డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ రిలేషన్స్(డీపీఆర్)కు కూడా వినతిపత్రం ఇచ్చారని తెలిపారు. తొక్కిసలాటలో 11మంది మృతి చెందడానికి సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, హోంమంత్రి పరమేశ్వర్ కారణమని కబ్బన్‌పార్క్ పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ బృందం ఫిర్యాదు చేసింది. మరోవైపు ఆర్‌సీబీ విజయోత్సవాల్లో తొక్కిసలాట ఘటనలో క్రికెటర్ విరాట్ కోహ్లీపై కేసు నమోదు చేయాలని నైజ హోరాటగారర సంఘం(నైతిక పోరాట సంఘం) ముఖ్యులు హెచ్ఎం వెంకటేశ్ కబ్బన్‌పార్క్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సుమోటోగా స్వీకరించిన ఎస్‌హెచ్‌ఆర్‌సీ

తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసింది. కమిషన్ చైర్మన్ శ్యామ్ భట్, సభ్యుడు సురేశ్ శుక్రవారం చిన్నస్వామి స్టేడియంను సందర్శించారు. పోలీస్ కమిషనర్, క్రికెట్ అసోసియేషన్, వైద్య ఆరోగ్యశాఖ కమిషర్‌కు నోటీసులు చేశారు.

కొవిడ్‌పై సన్నద్ధత

- 10 లక్షల టెస్టింగ్ కిట్ల కొనుగోలుకు టెండర్లు
- మాస్కులు, శానిటైజర్ల కోసం కూడా
- ఇప్పటికే 5 వేల ఆర్టీపీసీఆర్ కిట్లకు పీవోలు
- 7.5 కోట్ల పారాసిటమాల్ మాత్రలు సిద్ధం
- రాష్ట్రంలో పెరుగుతున్న కొవిడ్ కేసులు
- దేశవ్యాప్తంగా 5,755 కేసుల నమోదు

హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): దేశంలో కొవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కరోనా వ్యాప్తిని ఎదుర్కొనేందుకు సన్నద్ధమైంది. ఈ క్రమంలో టెస్టింగ్ కిట్లు, మాస్కులు, శానిటైజర్లు, ఔషధాలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల జరిగిన ఓ సమీక్షలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ఆ మేరకు రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకుడి విభాగం తాజాగా తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాలభివృద్ధి సంస్థ(టీజీఎంఎస్ఐడీసీ)కి ఇండెంట్ పెట్టింది. దీంతో.. టీజీఎంఎస్ఐడీసీ రంగంలోకి దిగింది. బోధనాస్పత్రుల్లో కొవిడ్ చికిత్సకు అవసరమైన ఔషధాల అవసరం ఏ మేర ఉందనే అంశంపైనా దృష్టిసారించింది.


10 లక్షల ర్యాపిడ్ కిట్లు

కొవిడ్ నిర్ధారణకు ఆర్టీపీసీఆర్, ర్యాపిడ్ యాంటీ-జెన్ కిట్లను వినియోగిస్తారు. ఐదు వేల ఆర్టీపీసీఆర్, 10 లక్షల ర్యాపిడ్ కిట్ల కోసం టెండర్లకు టీజీఎంఎస్ఐడీసీ ఆహ్వానించింది. ఈ నెల 9తో టెండర్ల ప్రక్రియ ముగుస్తుందని అధికారులు తెలిపారు. దీంతోపాటు.. ఎన్-95 మాస్కులు 7.35 లక్షల మేర అందుబాటులో ఉండగా.. 10.32 లక్షల సాధారణ(సర్జికల్) మాస్కులు, శానిటైజర్ల కోసం టెండర్లను ఆహ్వానించారు. 7.5 కోట్ల పారాసిటమాల్ మాత్రలు, 35.6 లక్షల అజిత్రోమైసిన్, 1.43 కోట్ల అమోక్సిలిన్(యాంటీబయాటిక్స్), 6.5 కోట్ల విటమిన్ బీ/జింక్, 1.06 కోట్ల విటమిన్ సీ, 37.3 లక్షల లివోసిట్రాజిన్ ట్యాబ్లెట్లు, 16.27 లక్షల యాంబ్రోక్సెల్ సిరప్ సీసాలు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు.

రాష్ట్రంలో 10 కేసులు

తెలంగాణలో ఇప్పటి వరకు 10 కొత్త కేసులు నమోదైనట్లు వైద్యఆరోగ్యశాఖ గణాంకాలు చెబుతున్నాయి. నిజామాబాద్‌లోనూ తొలి కొవిడ్ కేసు నమోదైంది. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి కొవిడ్ పాజిటివ్‌గా తేలినట్లు అధికారులు తెలిపారు. మన దగ్గర పూర్తిస్థాయిలో కొవిడ్ టెస్టులు జరగడం లేదని.. కిట్లు అందుబాటులోకి వస్తే పరీక్షలు పెరుగుతాయని పీహెచ్‌సీల్లో పనిచేసే వైద్యులు చెబుతున్నారు. కాగా.. దేశంలో 5,755 యాక్టివ్ కేసులున్నాయి.

అందుబాటులో ఔషధాలు



కొవిడ్ చికిత్సకు అవసరమయ్యే అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉన్నాయి. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉన్నాం. టెండర్లు ఆహ్వానించిన ర్యాపిడ్ టెస్టింగ్ కిట్లు, శానిటైజర్లు, సర్జికల్ మాస్కులు త్వరలో అందుబాటులోకి వస్తాయి.

- జి.ఫణీంద్రారెడ్డి, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

• ఆర్కే RK

జగన్... నేరం... రాజకీయం!

రాష్ట్రంలో ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో తెలుగుదేశం, వైసీపీలకు చెరో 40 శాతం ఓట్లు ఉన్నాయి. 2019కి పూర్వం చంద్రబాబు ప్రభుత్వంపై ఎంతగా విష ప్రచారం చేసినా, ఎన్ని కులాలను దూరం చేసినా తెలుగుదేశం పార్టీకి 40 శాతం ఓట్లు వచ్చాయి. జగన్‌రెడ్డి పాలన ఎంత అరాచకంగా సాగినా 2024లో ఆయనకు కూడా 40 శాతం ఓట్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో కూటమిలో మనస్పర్థలు సృష్టించే ప్రయత్నాలను కూడా జగన్‌రెడ్డి చేస్తున్నారు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే పరిస్థితులు ఎంత దారుణంగా ఉంటాయో తెలుసు కనుకే ఎవరు ఎన్ని కుట్రలకు పాల్పడినా కూటమి భాగస్వామ్య పక్షాలు అపోహలకు తావు లేకుండా జాగరూకతతో వ్యవహరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను అభినందించాలి. కింది స్థాయిలో కూటమి కార్యకర్తల మధ్య విభేదాలు ఉన్న మాట వాస్తవం. అయితే అవి రాష్ట్ర స్థాయిలో లేకపోవడం శుభ పరిణామం.

తన కోపమే తన శత్రువు అని పెద్దలు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏడాది క్రితం జరిగిన ఎన్నికల్లో అధికారం కోల్పోయిన జగన్మోహన్‌రెడ్డి ఇటు ప్రజల పైన, అటు రాజకీయ ప్రత్యర్థులపైన పట్టరాని కోపంతో రగిలిపోతున్నారు. ఆగ్రహావేశాలతో తాను ఏమి చేస్తున్నానో కూడా ఆయన మరచిపోతున్నారు. 'జగనన్న ఉండగా నేరస్తులు అందరికీ పండగే' అన్న పథకాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళుతున్నట్టుగా ఉంది. అలా అని అతడిని తెలివి తక్కువవాడిగా భావించడానికి కూడా లేదు. రాష్ట్రంలో రాజకీయాలను మరో లెవల్‌కు తీసుకువెళ్లే పనిలో జగన్ బిజీగా ఉంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా తెనాలిలో పేరు మోసిన ముగ్గురు నేరస్తులను పోలీసులు ఇటీవల నడిరోడ్డుపై చితకబాదారు. ఆ ముగ్గురూ దళితులు కావడంతో దొరకునా ఇటువంటి మహదావకాశం అన్నట్టుగా జగన్‌రెడ్డి ఆ ముగ్గురి కుటుంబాల పరామర్శకు వెళ్లారు. దీనిపై సామాన్య ప్రజల్లో ఆయనపై వ్యతిరేకత ఏర్పడింది. బాధితులు కరుడుగట్టిన నేరస్తులని తెలిసి కూడా పరామర్శకు పూనుకున్నారంటే... అందుకు జగన్‌రెడ్డి ఆలోచనలు, రాజకీయ ఎత్తుగడలు వేరే లెవల్లో ఉండటమే కారణం. సదరు నేరస్తులను పోలీసులు బహిరంగంగానే ప్రజల సమక్షంలో కొట్టడం చట్టరీత్యా నేరమే! ప్రజా కంటకులుగా మారిన నేరస్తులను బహిరంగంగా శిక్షించాలని గతంలో ప్రజలు కోరుకొనేవారు. అలా నేరస్తులను శిక్షించిన అధికారులకు బ్రహ్మరథం పట్టేవారు. ఈ కారణంగానే పలువురు పోలీసు అధికారులు నేరస్తుల పాలిట సింహస్వప్నంగా మారారు. అలాంటి అధికారుల ప్రేరణతో నిర్మించిన సినిమాలను కూడా ప్రజలు ఆదరించేవారు. ఒకప్పుడు హైదరాబాద్‌లో కొత్త దాస్ అనే రౌడీ ఉండేవాడు. అతని ఆగడాలు మితిమీరడంతో పోలీసులు ఎన్‌కౌంటర్ పేరిట కాల్చి చంపారు. రెండు మూడు కేసులలో ప్రస్తుతం జైల్లో ఉన్న ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులును ఒకప్పుడు ఎన్‌కౌంటర్ స్పెషలిస్టుగా పిలిచేవారు. కరుడుగట్టిన నేరస్తులను కాల్చి చంపిన చరిత్ర ఆయనది. ప్రస్తుతం వైసీపీ ప్రధాన నాయకులలో ఒకరిగా చలామణి అవుతున్న లేళ్ల అప్పిరెడ్డిని గుంటూరు జిల్లా ఎస్పీగా ఉన్నప్పుడు ఆయన జిల్లా బహిష్కరణ చేశారు. ఒకప్పుడు ఇలాంటి అధికారులను హీరోలుగా ప్రజలు అభిమానించేవారు. ఇప్పుడు రోజులు మారాయి. ప్రజల్లో హక్కుల పట్ల చైతన్యం వచ్చింది. ఇది గుర్తించినందునే జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎంపీ రఘురామ కృష్ణరాజును అర్ధరాత్రి పోలీసు కస్టడీలో అరికాళ్లు పగిలేలా కొట్టారు. ఇప్పుడు కాల క్రమంలో నేరస్తులకు, రాజకీయ నాయకులకు మధ్య తేడా అంతరించిపోతూ వస్తోంది. నేరస్తులకు అధికారం అందడంతో నిజాయితీగా పనిచేసిన పోలీసు అధికారులు కూడా తమ స్వభావాన్ని మార్చుకొని వారితో జత కట్టారు. ఈ మార్పు కారణంగానే పీఎస్ఆర్ ఆంజనేయులు ఇప్పుడు జైలు జీవితం గడపాల్సి వస్తోంది. ఒకప్పుడు నేరస్తుల భుజంపై చేయి వేయాలంటే రాజకీయ నాయకులు భయపడేవారు. ఇప్పుడు వారి చుట్టూ నేరస్తులే ఉంటున్నారు. జగన్‌రెడ్డి తెనాలి పర్యటనను ఈ నేపథ్యంలోనే చూడాలి. తన ఓటు బ్యాంకును స్థిరీకరించుకొనే పనిలో భాగంగా నేరస్తుల కుటుంబాల పరామర్శకు జగన్‌రెడ్డి బయలుదేరారు. అయితే అంతిమంగా అది మంచి చేస్తుందా?, చెడుచేస్తుందా? అంటే ఇప్పుడే చెప్పలేం.

క్రిమినల్ పాలిటిక్స్...

పులివెందుల మార్క్ రాజకీయాలు రాష్ట్రంలోకి ప్రవేశించిన తర్వాత సంఘ విద్రోహ శక్తులకు, నేరస్తులకు రాజకీయాల్లోకి ఎంట్రీ లభించింది. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మొదలైన ఈ సంస్కృతి ఇప్పుడు స్వైర విహారం చేస్తోంది. ఒకప్పుడు వైఎస్ రాజారెడ్డి పులివెందులలో చిన్నా చితకా నేరస్తులను చేరదీసి తన బలం పెంచుకున్నారు. క్రమంగా కడప జిల్లాపై కూడా అంతో ఇంతో పట్టు సాధించారు. ఈ క్రమంలో ఆయన కుమారుడు రాజశేఖరరెడ్డి రాష్ట్ర రాజకీయాలలోకి ప్రవేశించారు. కాంగ్రెస్ పార్టీలో తనకంటూ ఒక బలమైన వర్గాన్ని తయారు చేసుకునేందుకు దౌర్జన్యాలకు పాల్పడే వారిని, హత్యా నేరాలకు పాల్పడే వారిని చేరదీశారు. రాజారెడ్డి ముఠా నాయకుడిగా జిల్లా స్థాయిలో విస్తరించగా, రాజశేఖరరెడ్డి రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్ నాయకుడిగా ఎదిగారు. 'కడప పాలెగాళ్లు' పేరిట పౌర హక్కుల సంఘం వాళ్లు ప్రచురించిన పుస్తకంలో వైఎస్ కుటుంబం గురించి వివరించారు. రాజశేఖరరెడ్డి 1984లో పీసీసీ అధ్యక్షుడైన తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో వివిధ జిల్లాలలో రౌడీ నేపథ్యం ఉన్న వారిని చేరదీసి 'కాంగ్రెస్ నాయకుడు' అనే హోదా ఇప్పించారు. అలాంటి వారందరికీ రాజశేఖరరెడ్డి ఆరాధ్య దైవం అయ్యారు. తనను నమ్మిన వాళ్ల కోసం రాజశేఖరరెడ్డి ఎంత దూరమైనా వెళతారు, మాట తప్పరు–మడమ తిప్పరు అని ప్రచారం చేయించుకున్నారు. ఈ ప్రచారం పతాక స్థాయికి చేరడంతో పులివెందుల మార్క్ రాజకీయం వల్ల దీర్ఘకాలంలో రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని ప్రజలు గ్రహించలేకపోయారు. రాజశేఖరరెడ్డి పట్ల అభిమానాన్ని పెంచుకున్నారు. రాజశేఖరరెడ్డి పెంచి పోషించిన రౌడీలు, ఫ్యాక్షనిస్టులు ఇప్పుడు వైసీపీలో ప్రముఖులుగా ఎదిగారు. ఒక హత్య కేసులో శిక్ష పడి జైలుకు వెళ్లి వచ్చిన గౌరు వెంకటరెడ్డిని తన పాదయాత్ర సందర్భంగా రాజశేఖరరెడ్డి పరామర్శించారు. అప్పట్లో ఇదొక సంచలనం. ఇప్పుడు నాయకుడంటే అలాగే ఉండాలని అనుకుంటున్నారు. చంద్రబాబు అలా ఉండటం లేదని విమర్శిస్తున్నారు. 2004లో అధికారంలోకి వచ్చిన రాజశేఖరరెడ్డి... గౌరు వెంకటరెడ్డికి శిక్ష తగ్గింపచేసి జైలు నుంచి విడుదల చేయించారు. ఈ మోడల్‌ను ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డి మరింత వికృత రూపంలో అమలు చేస్తున్నారు. డాక్టర్ చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌లో జరిగిన మత ఘర్షణల వెనుక రాజశేఖరరెడ్డి ఉన్నారని అప్పట్లోనే ముఖ్యమంత్రి మద్దతుదారులు ఆరోపించారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వంగవీటి రంగా హత్య జరిగింది. దీంతో కోస్తా జిల్లాల రాజకీయాల్లోకి రాజశేఖరరెడ్డి ప్రవేశించారు. రెండు కుటుంబాల మధ్య జరిగిన గొడవలను రెండు కులాల మధ్య అంతరం సృష్టించడానికి వాడుకున్నారు. హత్యకు గురైన రంగా విగ్రహాలను అప్పట్లో పలు జిల్లాల్లో ఏర్పాటు చేయించారు. దీంతో ఆ సామాజికవర్గంలో తన పరపతి, పట్టు పెంచుకున్నారు. కాపు, కమ్మ కులాల మధ్య అప్పుడు రగిలించిన విద్వేషపు చిచ్చు ఇప్పటికీ ఆరిపోలేదు. ఈ క్రమంలో రాజకీయాలలో పెద్ద మనుషులుగా చలామణి అయిన వారు తెర మరుగై, నేర నేపథ్యం ఉన్నవాళ్లు ఆ స్థానాల్లోకి చేరుకున్నారు.

విగ్రహ రాజకీయం...

రాజశేఖరరెడ్డి మరణానంతరం జగన్మోహన్‌రెడ్డి కూడా తండ్రి విగ్రహాలను ఊరూ వాడా ఏర్పాటు చేయించారు. రాజశేఖరరెడ్డిని మహానేతగా శ్లాఘింపజేశారు. రాజశేఖరరెడ్డి నాటిన విష బీజాల వల్ల కొన్ని వర్గాలవారు వైసీపీకి అండగా నిలిచారు. తండ్రి వేసిన బాటను తనయుడు జగన్‌రెడ్డి విస్తరించారు. అధికారంలో ఉన్నప్పుడు నేర నేపథ్యం ఉన్న వాళ్లను అందలం ఎక్కించారు. జగన్ మనస్తత్వం గుర్తించిన ఇతరులు కూడా అదే దారి ఎంచుకున్నారు. ఫాక్షన్ గొడవలకు పేరు మోసిన పల్నాడు ప్రాంతంలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వంటి వారిని చేరదీశారు. శ్రీకాకుళం లాంటి జిల్లాలో సీదిరి అప్పలరాజు, దువ్వాడ శ్రీనివాస్‌లాంటి వారిని రాజకీయాల్లో ఎప్పుడైనా చూశామా? మండలి వెంకటకృష్ణారావు, కేఎల్ రావు, పిన్నమనేని కోటేశ్వరరావు వంటి వారు ప్రాతినిధ్యం వహించిన కృష్ణా జిల్లాలో వల్లభనేని వంశీ, కొడాలి నాని వంటి వారిని ప్రోత్సహించారు. అమరావతి ప్రాంతంలో నందిగం సురేశ్ వంటి వారు పుట్టుకొచ్చారు. బోరుగడ్డ అనిల్ వంటి వారు గతంలో రాజకీయాల్లో ఉండేవారా? అలాంటి వాళ్లను నాయకులు ఎప్పుడైనా ప్రోత్సహించారా? జగన్‌రెడ్డి మాత్రమే ఆ పని చేయగలిగారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు విభజిత ఆంధ్రప్రదేశ్‌లో అసాంఘిక శక్తులకు బలం చేకూరిందంటే అందుకు జగన్‌రెడ్డి కారణం. అందరిదీ ఒకటే స్కూల్– ఒకటే సిలబస్! తాము ఆరాధించే నాయకుడి కోసం నేరాలు చేయడం! అవసరమైతే జైలుకు వెళ్లడం తమకు లభించిన అదృష్టంగా ఈ అసాంఘిక శక్తులు భావించే పరిస్థితి ప్రస్తుతం ఉంది. అందుకే ఇప్పుడు జైలుకు వెళ్లిన వారిలో కనీస పశ్చాత్తాపం కనిపించడం లేదు.

మారిన రోజులు...

గాంధేయవాదిగా పేరు తెచ్చుకున్న మండలి వెంకట కృష్ణారావు... సొంత సామాజికవర్గానికి చెందిన రంగాను దూరం పెట్టారు. ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్న వారిలో పేర్ని కృష్ణమూర్తి ఒకరు. ఆయన తనయుడు పేర్ని నాని ఇలా వ్యవహరిస్తారని, ఇలా మాట్లాడతారని ఎవరైనా ఊహించారా? ఒకప్పుడు రాయలసీమలోని కొన్ని ప్రాంతాలకే పరిమితమైన పాలెగాళ్ల సంస్కృతి ఇప్పుడు రాష్ట్రమంతా విస్తరించింది. బొడ్డేపల్లి రాజగోపాల్ నాయుడు, సర్దార్ గౌతు లచ్చన్న వంటి వాళ్లు ఉండిన శ్రీకాకుళం జిల్లాలో కూడా ఇప్పుడు పాలెగాళ్ల సంస్కృతి ప్రవేశించిందంటే, అందుకు వైఎస్ కుటుంబం కారణం కాదా? సామాజిక సమీకరణాల పేరిట దళితులు, ఇతర బడుగు వర్గాలలోని అసాంఘిక శక్తులను గుర్తించి, ప్రోత్సహించడంలో ఇప్పటికీ జగన్‌రెడ్డిని మించినవారు లేరు. గోరంట్ల మాధవ్ పోలీసు ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నప్పుడు ఒక ప్రభుత్వ ఉద్యోగిని లాఠీతో బహిరంగంగా కొట్టుకుంటూ తీసుకెళ్లారు. అలాంటి వ్యక్తిని గుర్తించిన జగన్ ఎంపీ సీటు ఇచ్చి ప్రోత్సహించడం దేనికి సంకేతం? జగన్ చుట్టూ ఇప్పుడు ఇలాంటి వారే. అందుకే జైలుకు వెళ్లి వచ్చినా వారిలో మార్పు రావడం లేదు, వెరపు ఉండటం లేదు. రాష్ట్రంలో నేర చరిత్ర ఉన్న వారిని గుర్తించి రాజకీయం ముసుగులోనో, నమ్మిన వాళ్లకు అండగా ఉంటాడనే ముసుగులోనో వాళ్లను చేరదీయడం, పెంచి పోషించడం, తన చేతికి మట్టి అంటకుండా వారిని వాడుకోవడం వైఎస్ కుటుంబానికి వెన్నతో పెట్టిన విద్య. అధికారం కోల్పోయినప్పుడు శాంతిభద్రతల సమస్యలు సృష్టిస్తారు. కులాల మధ్య కుంపట్లు రగిలిస్తారు. రాజశేఖరరెడ్డికి అధికారం అందే వరకు కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు కూడా ఈ కుటుంబం కుతంత్రాలను తట్టుకోలేకపోయారు. ఇప్పుడు జగన్‌రెడ్డి అధికారాన్ని కోల్పోయారు. ఎటువంటి కుతంత్రాలకు తెరలేపుతారో చూడాలి. అధికారంలో ఉన్నప్పుడు డాక్టర్ సుధాకర్‌ను మానసికంగా వేధించి ఆత్మహత్య చేసుకొనే వరకు వేటాడారు. డ్రైవర్ సుబ్రమణ్యాన్ని హత్య చేసి డోర్ డెలివరీ చేశారు. వరప్రసాద్‌కు శిరోముండనం చేశారు. వీరంతా దళితులే. డ్రైవర్ సుబ్రమణ్యాన్ని హత్య చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ అనంతబాబును జగన్‌రెడ్డి దూరం పెట్టకపోవడం గమనార్హం. తెనాలిలో నేర నేపథ్యం ఉన్న వారిని పోలీసులు బహిరంగంగా శిక్షించడంపై గుండెలు బాదుకుంటున్న జగన్‌రెడ్డి, డాక్టర్ సుధాకర్‌కు ఏ నేర నేపథ్యం ఉందో చెబుతారా? డ్రైవర్ సుబ్రమణ్యం చేసిన పాపం ఏమిటి? వారు కూడా దళితులే కదా? అని అప్పుడెందుకు అనిపించలేదు? జగన్ తెనాలి పర్యటన వల్ల తటస్థ ఓటర్లలో తన పట్ల వ్యతిరేకత ఏర్పడే అవకాశం ఉందని జగన్‌కు తెలియదని అనుకోగలమా? ఓటు బ్యాంకును భద్రపరుచుకొనే పనిలోనే ఇలాంటి ఎత్తుగడలకు ఆయన పాల్పడుతుంటారు. జగన్ పాలనలో ఎంతో మంది దళితులపై దాడులు జరిగాయి. అయినా మెజారిటీ దళితులు, క్రైస్తవులు ఆయన వెంటే ఎందుకు నిలబడ్డారు? అంటే, జగన్ ఆడుతున్న జగన్నాటకం వల్లనే. తెనాలిలో రౌడీ షీటర్లకు మద్దతుగా అధిక శాతం దళితులు నిలబడ్డారు. డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రమణ్యం వంటి మంచివాళ్ల కోసం అదే దళితులు ఎందుకు నిలబడలేదు? ఈ సైకాలజీని ఒడిసిపట్టుకున్న జగన్‌రెడ్డి వారిని కవచంలా వాడుకుంటున్నారు. జీసస్ తర్వాత తమ దైవం జగన్‌రెడ్డి అని క్రైస్తవులు భావించే పరిస్థితి కల్పించారు. వారిని అలా మార్చడంలో కూడా జగన్‌రెడ్డి వ్యూహం దాగి ఉంది. దళితులు కూడా జగన్ మనవాడు అని భావిస్తున్నారు. అందుకే జగన్ అధ్వానపు పరిపాలనను ఈ రెండు వర్గాల వారు పట్టించుకోలేదు. రెడ్లు, ముస్లింలు వివిధ కారణాల వల్ల జగన్‌కు మద్దతుగా ఉంటున్నారు. ఈ వర్గాల్లో ఇప్పుడిప్పుడే మార్పు వస్తోంది. కుల, మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టగలిగితే అభివృద్ధి, సంక్షేమాలకు అతీతంగా ఎన్నికల ఫలితాలు ఉంటాయని జగన్‌రెడ్డి నమ్ముతున్నారు. అందుకే కొన్ని కులాలను ఇతర కులాలకు శత్రువుగా చిత్రీకరించే పని చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు కమ్మ, కాపు కులాలను టార్గెట్ చేసుకున్నారు. తమ రాజకీయ అధికారానికి అడ్డు వచ్చే వాళ్లు దళితులైనా, క్రైస్తవులైనా, రెడ్లైనా, ముస్లింలైనా ఆ కుటుంబం క్షమించదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తోంది. ఎన్నికలకు ఇంకా నాలుగేళ్ల వ్యవధి ఉంది. అయినా 'మేం అధికారంలోకి వచ్చాక మీకు ఉంటుందిరా!' అని వైసీపీలోని కింది స్థాయి వాళ్లు కూడా తొడ గొడుతున్నారంటే కేసులు – జైళ్లు అంటే వారికి భయం లేకపోవడమే కారణం.

నేరస్తుల్లో భయం ఉండాలి...

కేసులు ఉన్నవారు ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులు. అలాగే... రౌడీషీటర్లు, గంజాయి వ్యాపారం చేసేవాళ్లు, ఇతర నేరాలకు పాల్పడినవాళ్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అనర్హులని కూటమి ప్రభుత్వం ఎందుకు ప్రకటించకూడదు? ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఒక్క రాజకీయ పార్టీ కూడా వ్యతిరేకించలేదు. రాష్ట్రంలో కూడా ఈ విధానాన్ని అమలు చేస్తే జగన్‌రెడ్డి వ్యతిరేకించగలరా? నేరస్తులకు అండగా నిలబడగలరా? ఇలాంటి చర్యల తర్వాత నేర స్వభావం ఉన్న వారి సంఖ్య తగ్గుముఖం పట్టదా? జగన్‌రెడ్డి పరిస్థితి కుడితిలో పడిన ఎలుకలా తయారవ్వదా? జగన్‌రెడ్డి మోడల్ రాజకీయాల నుంచి రాష్ట్రాన్ని బయటపడెయ్యడంతో పాటు యువతను సన్మార్గం వైపు నడిపించగల విప్లవాత్మక నిర్ణయాలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టాలి. కేసులలో ఇరుక్కుంటే తమ పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాలు లభించవు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవు అన్న భయం కల్పించగలిగితే అందరూ దారిలోకి వస్తారు. లేని పక్షంలో జగన్‌రెడ్డి వంటి వారి అండ చూసుకొని ఇంటికో రౌడీ తయారవుతాడు. అదే జరిగితే రాష్ట్రం ఏమవుతుందో ఊహించగలమా?

అధికారమే ఆయన లక్ష్యం..

రాష్ట్రం పట్ల, సమాజం పట్ల జగన్‌రెడ్డికి ఏ బాధ్యతా ఉండదు. ఆయనకు కావాల్సింది అధికారం మాత్రమే. అధికారం అండతో రాష్ట్ర సంపదను దోచుకొని పొరుగున ఉన్న బెంగళూరు, చెన్నైతో పాటు దుబాయ్‌లో ఆస్తులు సమకూర్చుకోవడమే వారికి కావాల్సింది. ఇందుకోసం ఎంతకైనా తెగిస్తారు. రాష్ట్రంలో ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో తెలుగుదేశం, వైసీపీలకు చెరో 40 శాతం ఓట్లు ఉన్నాయి. 2019కి పూర్వం చంద్రబాబు ప్రభుత్వంపై ఎంతగా విష ప్రచారం చేసినా, ఎన్ని కులాలను దూరం చేసినా తెలుగుదేశం పార్టీకి 40 శాతం ఓట్లు వచ్చాయి. జగన్‌రెడ్డి పాలన ఎంత అరాచకంగా సాగినా 2024లో ఆయనకు కూడా 40 శాతం ఓట్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో కూటమిలో మనస్పర్థలు సృష్టించే ప్రయత్నాలను కూడా జగన్‌రెడ్డి చేస్తున్నారు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే పరిస్థితులు ఎంత దారుణంగా ఉంటాయో తెలుసు కనుకే ఎవరు ఎన్ని కుట్రలకు పాల్పడినా కూటమి భాగస్వామ్య పక్షాలు అపోహలకు తావు లేకుండా జాగరూకతతో వ్యవహరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను అభినందించాలి. కింది స్థాయిలో కూటమి కార్యకర్తల మధ్య విభేదాలు ఉన్న మాట వాస్తవం. అయితే అవి రాష్ట్ర స్థాయిలో లేకపోవడం శుభ పరిణామం. మళ్లీ అధికారంలోకి వస్తే తన పరిపాలన ఎలా ఉంటుందో జగన్‌రెడ్డి చెబుతూనే ఉన్నారు. దీంతో సామాన్య ప్రజలతోపాటు కూటమి నాయకులు కూడా వణికిపోతున్నారు. వయసులో ఉన్నప్పుడు తెలిసో తెలియకో తప్పులు చేస్తారని జగన్‌రెడ్డి చెప్పడం ఆయన నైజానికి నిదర్శనం. ఆయన పిల్లలు కూడా చిన్న వయసులోనే ఉన్నారు. అలా అని వారు తప్పు చేస్తే జగన్‌రెడ్డి సహిస్తారా? దళితుల అవసరం తనకు ఉంది కనుక వారు మాత్రమే నేరాలు చేయాలి, శాశ్వతంగా తనపై ఆధారపడాలని జగన్‌రెడ్డి కోరుకుంటున్నారు. అందుకే రాష్ట్రంలో కుల, మతోన్మాదుల సంఖ్య పెరగాలని ఆయన కోరుకుంటున్నారు. ఇందుకోసం ఏం చేయడానికైనా, ఎంతకైనా తెగిస్తారు. జగన్‌రెడ్డి రాజకీయాన్ని విజ్ఞత ఉన్నవాళ్లు సమర్థించరు.

ఓట్ల కోసం...

గత ఎన్నికల్లో కూటమికి, వైసీపీకి మధ్య ఓట్ల తేడా 16 శాతం ఉండింది. కూటమి అధికారంలో ఉన్నందున ఈ తేడా క్రమంగా తగ్గే అవకాశం ఉంది. జగన్‌రెడ్డి నమ్మకం కూడా అదే. ఏడెనిమిది శాతం ఓట్లు పెంచుకోగలిగితే 2029లో అధికారం తమదేనని వైసీపీ నాయకులు ధీమాగా ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో, ఆ తర్వాత కూడా పులివెందుల రాజకీయాల వల్ల పలుమార్లు శాంతిభద్రతలకు విఘాతం కలిగింది. అందుకు కారణమెవరని తెలుసుకొనే తీరిక, ఓపిక ప్రజలకు ఉండవు. అధికారంలో ఉన్న వారినే నిందిస్తారు. ఇప్పుడు మళ్లీ రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే కుట్రలకు తెర లేపే అవకాశం లేకపోలేదు. కుల విద్వేషాలను రగిలించడం వల్ల రాష్ట్రం వల్లకాడు అవుతుంది. అయినా రాష్ట్రం గురించి, పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించలేని స్థితికి ప్రజలను తీసుకువెళ్లడమే 'పులివెందుల మోడల్!' జగన్ హయాంలో లిక్కర్ అమ్మకాల్లో ఎంత గోల్‌మాల్ జరిగిందో, అందులో భాగస్వాములైన వారికే కాకుండా ప్రజలందరికీ తెలుసు. ఇప్పుడు ఈ కేసులో సిట్ అధికారులు పలువురిని జైలుకు పంపారు. అయినా, జగన్‌కు వ్యతిరేకంగా వాంగ్మూలం ఇవ్వడానికి ఎవరికి వారు భయపడుతున్నారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి నుంచి ప్రాణహాని ఉంటుందని నిందితులు భయపడటం ఎక్కడైనా విన్నామా? కన్నామా? దటీజ్ జగన్‌రెడ్డి! హత్యలు చేయించడం, ఆ హత్యలు చేసిన వారిని ఆ తర్వాత తుదముట్టించడంలో ఆ కుటుంబం ఆరితేరింది. గతంలో ఏం జరిగిందో తెలుసు కనుకే జగన్‌కు వ్యతిరేకంగా ఒక్కరు కూడా నోరు విప్పలేకపోతున్నారు. వైసీపీ నాయకులలో కూడా ఈ భయం ఉంది. అందుకే ఎవరినైనా పక్కనబెట్టినా జగన్‌కు వ్యతిరేకంగా నోరు విప్పి విమర్శలు చేయలేక పోతున్నారు. ఈ వింత పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే సొంతం. గతంలో అనేక మంది తమ నాయకులతో విభేదించే వారు. ఇలా భయపడిన సంఘటనలు మాత్రం లేవు. నిందితులను మాత్రమే కాకుండా సొంత పార్టీ నాయకులను, చివరకు ప్రజలను కూడా భయపెట్టగలుగుతున్న జగన్‌రెడ్డిని ఎలా అర్థం చేసుకోవాలి? నేరస్తులకు రాజకీయాల్లో చోటు ఉండదని ఒకప్పుడు అనేవాళ్లు. ఇప్పుడు నేరస్తులే రాజకీయాలను శాసిస్తున్నారు. ఇదొక విషాదం!



> **ఇప్పుడు మళ్లీ రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే కుట్రలకు తెర లేపే అవకాశం లేకపోలేదు. కుల విద్వేషాలను రగిలించడం వల్ల రాష్ట్రం వల్లకాడు అవుతుంది. అయినా రాష్ట్రం గురించి, పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించలేని స్థితికి ప్రజలను తీసుకువెళ్లడమే 'పులివెందుల మోడల్!'**

> **కేసులు ఉన్నవారు ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులు. అలాగే... రౌడీషీటర్లు, గంజాయి వ్యాపారం చేసేవాళ్లు, ఇతర నేరాలకు పాల్పడినవాళ్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అనర్హులని కూటమి ప్రభుత్వం ఎందుకు ప్రకటించకూడదు? ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఒక్క రాజకీయ పార్టీ కూడా వ్యతిరేకించలేదు. రాష్ట్రంలో కూడా ఈ విధానాన్ని అమలు చేస్తే జగన్‌రెడ్డి వ్యతిరేకించగలరా? నేరస్తులకు అండగా నిలబడగలరా? ఇలాంటి చర్యల తర్వాత నేర స్వభావం ఉన్న వారి సంఖ్య తగ్గుముఖం పట్టదా? జగన్‌రెడ్డి మోడల్ రాజకీయాల నుంచి రాష్ట్రాన్ని బయట పడెయ్యడంతో పాటు యువతను సన్మార్గం వైపు నడిపించగల విప్లవాత్మక నిర్ణయాలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టాలి. కేసులలో ఇరుక్కుంటే తమ పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాలు లభించవు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవు అన్న భయం కల్పించగలిగితే అందరూ దారిలోకి వస్తారు. లేని పక్షంలో జగన్‌రెడ్డి వంటి వారి అండ చూసుకొని ఇంటికో రౌడీ తయారవుతాడు. అదే జరిగితే రాష్ట్రం ఏమవుతుందో ఊహించగలమా?**

చై–పాక్‌పై భారత్ భావి యుద్ధం?!



• పి. చిదంబరం

ఆపరేషన్ సిందూర్‌లో చైనా పరోక్ష ప్రమేయంతో మౌలికంగా మారిపోయిన పరిస్థితుల్లో ఉగ్రవాదంపై పోరుకు మోదీ నిర్దేశించిన కొత్త సిద్ధాంతం ఉపయుక్తమైనదేనా? ఉగ్రవాదులు, వారికి మద్దతునిస్తున్న ప్రభుత్వాల మధ్య తేడా చూపం అనేది ఆ సిద్ధాంతంలోని ఒక ముఖ్య సూత్రం. దీని ప్రకారం ఉగ్రవాద ఘాతుకాలు చోటుచేసుకున్నప్పుడు పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ యుద్ధానికి ఉపక్రమిస్తుంది. అయితే ఇది ఇంకెంత మాత్రం సాధ్యం కాదు. ఒకే ఒక శత్రువుగా ఏకమైన చైనా–పాకిస్థాన్ సంయుక్త సైనిక బలగాలతో తలపడవలసి ఉంటుంది.

చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ గత నెల 31న సింగపూర్‌లో బ్లూమ్ బెర్గ్, రాయిటర్ వార్తాసంస్థలకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ సమయం, జరిగిన ప్రదేశం ఆశ్చర్యపరిచినా ఆయనేమీ ప్రమాదకరమైన పొరపాటు చేయలేదు. ఆపరేషన్ సిందూర్ గురించిన సత్యాలు ఏదో ఒక రోజు అధికారికంగా చెప్పవలసిందే కదా. అయితే పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రధానమంత్రి లేదా రక్షణమంత్రి ఆపరేషన్ సిందూర్‌పై ఒక ప్రకటన చేసి, చర్చను ప్రారంభించి ఉంటే మరింత సముచితంగా ఉండేదని నేను భావిస్తున్నాను.

భారత ప్రభుత్వ అత్యున్నతస్థాయి బాధ్యుల ఆదేశాలు, అనుమతి లేకుండా జనరల్ అనిల్ చౌహాన్ ఆ ఇంటర్వ్యూ ఇచ్చి ఉండరు. ఆయన చెప్పింది సూటిగా, స్పష్టంగా, సరళంగా ఉన్నది: భారత సైన్యం తన లక్ష్యాలను సాధించింది. అయితే నష్టాలనూ చవి చూసింది. మే 7న ఆపరేషన్ సిందూర్ ప్రారంభమయినప్పుడు భారత సైన్యం వ్యూహపరంగా చేసిన తప్పులను సీడీఎస్ అంగీకరించారు. అయితే వెన్వెంటనే తన తప్పులు సరిదిద్దుకుందని, మే 9–10 రాత్రి పాకిస్థాన్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని కొత్త దాడులు ప్రారంభించిందని ఆయన తెలిపారు. భారత్‌కు సంభవించిన నష్టాల గురించి ఆయన విపులీకరించలేదు. అయితే స్వతంత్ర సైనిక నిపుణులు, అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం భారత్ ఐదు యుద్ధ విమానాలను నష్టపోయింది: 3 రాఫెల్, 1 సుఖోయి, 1 మిగ్.

'వ్యూహాత్మక తప్పులు', 'నష్టాలు'ను సైనిక నిపుణులు లోతుగా, నిగ్రహంగా విశ్లేషించవలసిన అవసరమున్నది. స్పష్టంగా తెలుస్తున్న, ధ్రువపరిచిన వాస్తవాలను పేర్కొంటాను: మే 7 తెల్లవారుజామున ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైనప్పుడు భారత్‌కు కొన్ని అనుకూలతలు ఉన్నాయి. భారత యుద్ధ విమానాలు, మిస్సైళ్లు పాకిస్థాన్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలను పూర్తిగా ధ్వంసం చేశాయి; పాకిస్థాన్ మే 8న ప్రతిదాడులు ప్రారంభించింది. భారత్‌లోని లక్ష్యాలపై డ్రోన్ దాడులు నిర్వహించింది. గైడెడ్ మిస్సైల్స్‌ను కూడా మోహరించింది. మే 8న భారత వాయుసేన విమానాలు కూలిపోయాయి. జూన్ 4న పూణేలో సీడీఎస్ జనరల్ చౌహాన్ వ్యాఖ్యల ప్రకారం భారతీయ విమానాలకు భారత వాయుతలంలోనే నష్టం వాటిల్లింది. మే 8, 9న ఇతర విమానాలు తమ స్థావరాలకు తిరిగి రాగలిగాయి; వ్యూహాత్మక తప్పులు సరిదిద్దుకున్న తరువాత మే 9, 10 తేదీల్లో యుద్ధ విమానాలు, మిస్సైళ్లు, డ్రోన్‌లను నియోగించారు. భారత్ యుద్ధ విమానాలు భారత్ వాయుతలంలోనే ఉండి బ్రహ్మోస్ మిస్సైల్‌తో సహా పలు మిస్సైళ్లను ప్రయోగించాయి. అవి పాకిస్థాన్‌లోని 11 వాయుసేన స్థావరాలను ధ్వంసం చేశాయి. మే 10న యుద్ధం నిలిచిపోయింది.



ఆపరేషన్ సిందూర్‌తో తాను ఒక కొత్త యుద్ధ పరిస్థితిలో ఉన్నానన్న వాస్తవం భారత్‌కు తెలిసివచ్చింది. ఈ అంశాన్ని మరింత స్పష్టంగా చెప్పడానికే ఈ వ్యాసాన్ని ఉద్దేశించాను. పాకిస్థాన్ రక్షణ –దాడి (డిఫెన్స్–అఫెన్స్) వ్యూహంలో చైనీస్ యుద్ధ విమానాలు (జె–10), చైనీస్ మిస్సైళ్లు (పీఎల్–15), చైనీస్ వాయుతల రక్షణ వ్యవస్థలు పూర్తిస్థాయిలో పాల్గొన్నాయని ఇప్పుడు సందేహాతీతంగా ధ్రువపడింది. చైనీస్ యుద్ధ విమానాలలో పాకిస్థానీ పైలెట్‌లు ఉన్నారు. చైనీస్ మిస్సైళ్లను పాకిస్థానీ సైనికాధికారులు ప్రయోగించారు; చైనీస్ జనరల్స్ రూపొందించిన వ్యూహాత్మక ప్రణాళికలను పాకిస్థానీ సైనికాధికారులు అమలుపరిచారు. అంతేకాదు, చైనీస్ సైనిక ఉపగ్రహాలు, చైనీస్ కృత్రిమ మేధ (ఏఐ) పాటవం పాకిస్థాన్ సైనిక చర్యలకు మార్గదర్శకత్వం వహించాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే చైనా తన ఆయుధ వ్యవస్థల శక్తిసామర్థ్యాలను యుద్ధ రంగంలో పరీక్షించుకునేందుకు భారత్–పాకిస్థాన్ యుద్ధం ద్వారా లభించిన అవకాశాన్ని పూర్తిగా ఉపయోగించుకుంది. భారత్‌కు వ్యతిరేకంగా చైనా పరోక్ష యుద్ధం చేసింది.

చైనా పరోక్ష ప్రమేయంతో మౌలికంగా మారిపోయిన పరిస్థితుల్లో ఉగ్రవాదంపై పోరుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్దేశించిన కొత్త సిద్ధాంతం ఉపయుక్తమైనదీ, కార్యసాధకమైనదేనా? ఉగ్రవాదులు, వారికి మద్దతునిస్తున్న ప్రభుత్వాల మధ్య తేడా చూపం అనేది మోదీ సిద్ధాంతంలోని ఒక ముఖ్య సూత్రం. దీని ప్రకారం ఉగ్రవాద ఘాతుకాలు చోటుచేసుకున్నప్పుడు పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ యుద్ధానికి ఉపక్రమిస్తుంది. అయితే ఇది ఇంకెంత మాత్రం సాధ్యం కాదు. భారత్‌పై యుద్ధాన్ని బలవంతంగా రుద్దితే, ఒకే ఒక శత్రువుగా ఏకమైన పాకిస్థాన్, చైనాకు వ్యతిరేకంగా యుద్ధం చేయవలసి ఉంటుంది. పాకిస్థాన్–చైనాల సంయుక్త సైనిక బలగాలతో తలపడవలసి ఉంటుంది. ఒక యుద్ధ రంగంలోనో లేక రెండు యుద్ధరంగాలలో ఒకేసారి పోరాడే లక్ష్య ప్రాతిపదికన భారత్ యుద్ధ సన్నద్ధత కొత్త ప్రతికూల పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోగలుగుతుందా? భవిష్యత్తులో భారత్ చేయవలసివచ్చే ఏ యుద్ధమైనా చాలా పెద్ద, శక్తిమంతమైన ఈ సంయుక్త శత్రుసేనతో చేయవలసి వస్తుంది.

ప్రతి ఉగ్రవాద దాడికి దీటైన ప్రతిస్పందన ఉంటుందని మోదీ స్పష్టం చేశారు. ఉరి ఘటనకు ప్రతిస్పందనలో సరిహద్దులకు ఆవల భారత సైనికదళాల రహస్య దాడి, పఠాన్ కోట్ ఘటనకు ప్రతిస్పందనలో భారత వాయుసేన ఏకైక వైమానిక దాడి లాంటి చర్యలు ఇంకెంత మాత్రం ఉగ్రవాదాన్ని నిరోధించలేవు. కనుకనే పహల్గాంకు ప్రతిస్పందనగా నాలుగురోజుల యుద్ధం సంభవించింది. మరి ఇప్పటికీ ఉగ్రవాద దాడులు నిలిచిపోకపోతే? చై–పాక్ (చైనా–పాకిస్థాన్) సంయుక్త సైనిక బలగాలకు వ్యతిరేకంగా సుదీర్ఘ యుద్ధం అనివార్యమవుతుందా?

నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశాంగ విధానం ఈ కొత్త పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోలేదని రుజువయింది. భారత్ వ్యతిరేకిస్తున్నప్పటికీ ఐఎమ్ఎఫ్ మే 9న పాకిస్థాన్‌కు 100 కోట్ల డాలర్ల రుణం మంజూరు చేసింది. పాక్‌కు 800 మిలియన్ డాలర్ల రుణం ఇచ్చేందుకు ఈ నెల 3న ఏడీబీ ఆమోదించింది. రాబోయే పదేళ్లలో 40బిలియన్ డాలర్ల రుణం ఇచ్చేందుకు ప్రపంచ బ్యాంకు నిర్ణయించింది. పాకిస్థాన్ ఆర్థిక సత్తువకు దోహదం చేసే ఈ నిర్ణయాల విషయంలో అమెరికా, చైనాల సంయుక్త ప్రోద్బలం ఉన్నది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తాలిబన్ శాంక్షన్స్ కమిటీ చైర్మన్‌గా, భద్రతామండలి కౌంటర్ టెర్రరిజం కమిటీ వైస్ చైర్మన్‌గా పాకిస్థాన్ ఎన్నికయింది! ఈ పరిణామాలన్నీ, ఆపరేషన్ సిందూర్ సమయంలోను, ఆ తరువాత, మన ఎంపీల బృందాలు దేశ దేశాల ప్రభుత్వాధినేతలకు పాక్ దుశ్చర్యలను ఏకరువు పెడుతున్నప్పుడు సంభవించినవే సుమా! నాకు అందిన విశ్వసనీయమైన సమాచారం మేరకు ప్రతి దేశమూ ఉగ్రవాదాన్ని ఖండించింది. అయితే ఏ దేశమూ పాకిస్థాన్‌ను గర్హించలేదు. మన సైనిక వ్యూహమూ, విదేశాంగ విధానంపై పునరాలోచన తప్పనిసరి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)



నేడే మృగశిర కార్తె

చేపలకు భలే గిరాకీ

వరంగల్ కల్చరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం ముగిసి వర్షాకాలం ప్రారంభానికి సూచికగా మృగశిర కార్తె ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. వేసవిలో 15 రోజుల పాటు కొనసాగే రోహిణి కార్తె శనివారంతో ముగిసింది. రోహిణి కార్తెలో సాధారణంగా రోకళ్లు పగిలే ఎండలు కొడుతాయని అంటారు. కానీ ఈసారి వాతావరణం చల్లబడింది. మృగశిర కార్తె ప్రారంభం రోజు తొలకరి జల్లులు కురుస్తాయని అస్తమా, దమ్ము, దగ్గు ఉన్నవారికి చేప మందు వేస్తారు. ఈరోజున చేపలను తినడం ఆరోగ్యానికి మేలుగా భావిస్తారు. ఈసారి మృగశిర కార్తె ఆదివారం కావడంతో చేపల అమ్మకాలు కూడా జోరుగా సాగనున్నాయి. నగరంలో ముఖ్యంగా అండర్ బ్రిడ్జి, ఎల్లంబజార్ ప్రాంతాల్లో చేపల అమ్మకాలు జరుగుతాయి. బొమ్మె చేపలు కిలో రూ. 500 నుంచి రూ. 600ల వరకు పలుకుతున్నాయి. జేపీఎన్ రోడ్డు ప్రాంతంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు చేపల మందు వేయడానికి ఏర్పాట్లు చేశారు.



విషాదహేల

మేడిగడ్డ వద్ద గోదావరిలో ఆరుగురి గల్లంతు

- అందరూ 18 ఏళ్ల లోపు వారే..
- గల్లంతైన వారిలో అన్న తమ్ముడు.. తండ్రి కళ్లముందే ఘటన
- మేడిగడ్డ బ్యారేజీ వద్ద సరదాగా స్నానం చేస్తుండగా కొట్టుకుపోయిన వైనం
- మహదేవపూర్, మహాముత్తారం మండలాల్లో విషాదం

ఘటనాస్థలంలో రోదిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు



శివమనోజ్ (ఫైల్)



రాంచరణ్ (ఫైల్)



రాహుల్ (ఫైల్)



సాగర్ (ఫైల్)



రక్షిత్ (ఫైల్)



మధుసూదన్(ఫైల్)

మహదేవపూర్ రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): గోదావరిలో సరదాగా గడపాలనే వారి కోరిక ముప్పుగా మారింది. వారి ఆనందం తీరకముందే విధి వారిపై పంజా విసిరింది. కళ్లముందే ఇద్దరు కుమారులు, మేనల్లుడు కొట్టుకుపోగా అతడు కన్నీరుమున్నీరవుతున్నాడు. పెళ్లి కోసం వచ్చిన మరో ఇద్దరు అనూహ్యంగా ప్రమాదం బారిన పడగా, వారి కుటుంబాలు రోదిస్తున్నాయి. గోదావరి నదిలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తూ ఆరుగురు గల్లంతైన విషాద సంఘటన జయశంకర్ భూపాలపల్లి మహదేవపూర్ మండలంలో చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షి, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహదేవపూర్ మండలం అంబట్‌పల్లి గ్రామానికి చెందిన పట్టి వెంకటస్వామి కుమారులు పట్టి మధుసూదన్(18), పట్టి శివమనోజ్(15)తో పాటు వెంకటస్వామి మేనల్లుడు తొగరి రక్షిత్(13), అంబట్‌పల్లికి చెందిన మరో యువకుడు కర్నాల సాగర్(16), మహాముత్తారం మండలం కొర్లకుంట గ్రామానికి చెందిన బొల్లెడ్ల రాంచరణ్ అలియాస్ పండు(17), స్తంభంపల్లి(పీపీ) గ్రామానికి చెందిన పసుల రాహుల్(18)తో పాటు పట్టి శివమణికంఠ శనివారం సాయంత్రం మేడిగడ్డ బ్యారేజీ వద్ద గోదావరి నదిలో సరదాగా స్నానం చేయడానికి బయలుదేరారు. అయితే అందరూ చిన్నవారు కావడంతో వెంకటస్వామి స్వయంగా వారిని తన ఆటోలో మేడిగడ్డ బ్యారేజీ వద్దకు తీసుకువెళ్లాడు. బ్యారేజీ ఎగువ ప్రవాహంలోని బ్లాక్-3 వద్ద స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటి ప్రవాహంలో చిక్కుకున్నారు. వారికి ఎవరికీ ఈత రాదు. ఈ క్రమంలో వారంతా కేకలు వేస్తుండగా అక్కడే వున్న పట్టి శివమణికంఠ, వెంకటస్వామి వారిని కాపాడేందుకు యత్నించారు. అప్పటికే వారు ప్రవాహంలో గల్లంతయ్యారు. బ్యారేజీ వద్ద 5వేల క్యూసెక్కుల ప్రవాహం ఉండటంతో, గాలింపు మానుకొని ఇద్దరూ ఒడ్డుకు చేరుకుని కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు.

సంఘటన స్థలాన్ని కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్ సింగ్, భూపాలపల్లి అడిషనల్ ఎస్పీ నరేష్, కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి పరిశీలించారు. మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు సింగరేణి రెస్క్యూటీంతో పాటు ఫైర్, పోలీసు శాఖలకు చెందిన రెస్క్యూ టీంలు ఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టాయి. పూర్తిగా చీకటిగా ఉండటంతో గాలింపు ఆలస్యమవుతోంది. కళ్లముందే ఇద్దరు కుమారులు గల్లంతు కావడంతో వెంకటస్వామి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు.

ముప్పు తెచ్చిన సరదా

పట్టి మధుసూదన్, పట్టి శివమనోజ్ ఇద్దరూ సొంత అనదమ్ములు. వీరి బంధువు తొగరి రక్షిత్. మహాముత్తారం మండలం కొర్లకుంట గ్రామానికి చెందిన బొల్లెడ్ల రాంచరణ్ అలియాస్ పండు, పసుల రాహుల్ అంబట్‌పల్లిలో పెళ్లికి వచ్చారు. వీరికి స్థానికులైన సాగర్, శివమణికంఠ జత కలిశారు.

అందరూ మేడిగడ్డ వద్ద గోదావరిలో సరదాగా గడపాలని నిశ్చయించుకొని మధుసూదన్ తండ్రి వెంకటస్వామి ఆటోలో బయలుదేరారు. అయితే వారిని వెంకటస్వామి వారించి, ఆటోను తానే నడుపుకుంటూ గోదావరి వద్దకు తీసుకువచ్చాడు. వీరిలో ఎవరికీ ఈత రాదు. వెంకటస్వామి, శివమణికంఠ ఒడ్డున ఉండగా, మిగతా వారు నదిలోకి దిగారు. ఒకరిచేయిని మరొకరు పట్టుకొని లోనికి వెళ్లేందుకు ప్రయత్నించారు.

అయితే అక్కడ లోతును గమనించకపోవడంతో వారు మునుపనకు గురికావడం మొదలుపెట్టారు. వారు కేకల వేయడాన్ని గమనించిన శివమణికంఠ, వెంకటస్వామి కాపాడేందుకు ప్రయత్నించినా, నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో సాధ్యపడలేదు. కళ్లముందే ఆరుగురు గల్లంతు కావడంతో వారు షాక్‌కు గురయ్యారు. సరిగ్గా సాయంత్రం 6.10 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది.



హనుమకొండ బొక్కలగడ్డ ఈద్గాలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఘనంగా బక్రీద్



ఈద్గాల్లో సామూహిక ప్రార్థనలు చేసిన ముస్లింలు

హనుమకొండ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు బక్రీద్ పండుగను శనివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాలలో సామూహిక ప్రార్థనలు జరిపారు. పరస్పరం అలాయ్ బలాయ్ చేసుకున్నారు. నాయకులు, ప్రజాప్రతినిధులు ఈద్గాలను సందర్శించి శుభాకాంక్షలు తెలిపారు. హనుమకొండలోని బొక్కలగడ్డ, ఎన్‌జీవోస్ కాలనీ, ములుగు రోడ్డు, దర్గాకాజీపేట, పెద్దమ్మగడ్డ తదితర ఈద్గాలు సామూహిక ప్రార్థనలు చేసేందుకు వచ్చిన ముస్లింలతో కిటకిటలాడుతూ కనిపించాయి. ఈద్గాలకు సకాలంలో చేరుకోనివారు తమ సమీప మసీదులలో ప్రార్థనలు చేశారు. హనుమకొండ మచిలీబజార్, బడీ మసీదు, చోటీ మసీదు రాయపుర, మచిలీబజార్ మసీదులు ప్రార్థనలు చేసిన ముస్లింలతో సందడిగా కనిపించాయి. కాగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మెన్ సిరిసిల్ల రాజయ్య పెద్దమ్మగడ్డ ఈద్గాను సందర్శించి ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేశారు. వారికి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ బక్రీద్ త్యాగానికి, విశ్వాసానికి, అల్లాహ్‌కు విధేయతకు ప్రతీక అన్నారు. పండుగ సందర్భంగా ఈద్గాలు, మసీదుల వద్ద భారీ పోలీసు బందో బస్తు ఏర్పాటు చేశారు.

15 మంది ఎస్సైల బదిలీ

ఎస్సైలుగా పదోన్నతి పొందిన ముగ్గురికి పోస్టింగ్‌లు

వరంగల్ క్రైం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లలో విధులు నిర్వర్తించే ఎస్సైలను బదిలీ చేయడంతో పాటు ఇటీవల ఏఎస్సై నుంచి ఎస్సైలుగా పదోన్నతి పొందిన ముగ్గురి ఎస్సైలకు పోస్టింగ్‌లు కల్పిస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. వారిలో రావుల రణధీర్ వరంగల్ ట్రాఫిక్ పీఎస్ నుంచి దుగ్గొండి పీస్, ఎన్. వెంకటేశ్వర్లు దుగ్గొండి నుంచి ఇంతేజార్‌గంజ్, ఎన్. రవికిరణ్ సుబేదారి నుంచి ఇంతేజార్‌గంజ్, సబ్బాని శివకృష్ణ పరకాల నుంచి మట్టెవాడ, నవీన్‌కుమార్ మట్టెవాడ నుంచి కేయూసీ, ఆర్. రామారావు కాజీపేట ట్రాఫిక్ నుంచి సీఎస్‌బీ, దిండిగల రాజు సీపీటీసీ నుంచి ఎనుమాముల, సయ్యద్ పాషా ఇంతేజార్‌గంజ్ నుంచి కేయూసీ, బి. శ్రీనివాస్, మోటెం సతీష్‌లు ఏప్రిల్ నెలలో కమిషనరేట్‌లో రిపోర్ట్ చేయగా శ్రీనివాస్‌కు మట్టెవాడ, సతీష్‌కు ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో పోస్టింగ్ ఇచ్చారు. వీఆర్ లో ఉన్న శ్రవణ్‌కుమార్ ను కాజీపేట ట్రాఫిక్ పీఎస్‌కు బదిలీ చేశారు. ఇటీవలే ఏఎస్సైల నుంచి ఎస్సైలుగా పదోన్నతి పొందిన బి. జనార్ధన్‌ను సుబేదారి పీఎస్‌కు, ఈ. నారాయణ హనుమకొండ ట్రాఫిక్ పీఎస్, జి. సీతారాములును వరంగల్ ట్రాఫిక్ పీఎస్‌లో నియమించారు.



టీసీల పేరు.. అక్రమాల జోరు..

- రెగ్యులర్ కోర్సుల్లో టీసీలు లేకున్నా అడ్మిషన్లు
- కేయూ బీఈడీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో దందా
- 24 మందికి నోటీసులిచ్చిన ప్రిన్సిపాల్

6

అందరి చూపు 'కాళేశ్వరం' వైపే..

- ఈ నెల 11న పీసీ ఘోష్ కమిషన్ ముందుకు కేసీఆర్
- ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలను ఇప్పటికే తేల్చిన విజిలెన్స్
- బ్యారేజీలకు ఇప్పట్లో మరమ్మతులు లేనట్టే..
- విచారణ ముగిసిన తర్వాతే ప్రాజెక్టు భవితవ్యంపై నిర్ణయం

భూపాలపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : లక్ష కోట్ల బ్లండర్‌గా విమర్శలను ఎదుర్కొంటున్న కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులు ఇప్పట్లో పట్టాలెక్కే సూచనలు కనిపించడం లేదు. 2023 అక్టోబర్లో కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుల్లో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజ్ కుంగిన తర్వాత ఈ ప్రాజెక్టు ఎందుకు పనికి రాకుండా పోయింది. రెండేళ్ల పాటు ఈ ప్రాజెక్టులోని సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలలో నీటిని నిలువ చేశారు. అంతేకాకుండా కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని కూడా ఎత్తిపోశారు. ఊహించని రీతిలో మేడిగడ్డ బ్యారేజీలోని ఏడవ బ్లాక్‌లో పియర్లు దెబ్బ తినడంతో బీటలు ఏర్పడ్డాయి. దానికి తోడు ప్రాజెక్టు ఎగువ భాగాన నిర్మాణ లోపాల కారణంగా లీకేజీల సమస్య కూడా తీవ్ర రూపం దాల్చింది. ఫలితంగా బ్యారేజీ ప్రమాదకరంగా మారడంతో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిపుణులను రంగంలోకి దింపి సమగ్ర పరీక్షలు నిర్వహించింది. అటు మేడిగడ్డ బ్యారేజీకి ఎగువన నిర్మించిన అన్నారం బ్యారేజీలోను లీకేజీల సమస్య ఉత్పన్నం కావడంతో మొత్తంగా ఈ ప్రాజెక్టు నిర్మాణ వైఫల్యాలతో కూడుకొని ఉన్నట్లు గుర్తించిన నిపుణులు ఈ బ్యారేజీలలో మరమ్మతు చర్యలు చేపట్టకుండా నీటిని నిల్వ చేయకూడదంటూ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ స్పష్టంగా ఆదేశించింది. దాంతో గత మూడు సీజన్లలో దాదాపు 2 వేల టీఎంసీలకు పైగా వరద నీరంతా వృథాగా సముద్రం పాలయ్యింది.

ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం డ్యాం సేఫ్టీకి సంబంధించి సమగ్రమైన తనిఖీలు నిర్వహించాలని కోరడంతో ఎన్డీఎస్ఏ నిపుణుల బృందం పలు దఫాలుగా ఇక్కడ పర్యటించి ఏడవ బ్లాక్‌లో లోపాలను అధ్యయనం చేశారు. అంతేకాకుండా జియో ఫిజికల్, జియో టెక్నికల్ లాంటి పరీక్షలు కూడా నిర్వహించారు. ఏడవ బ్లాక్‌లో అణువణువు పరీక్షించి దెబ్బతిన్న బ్లాక్‌లో సీకెంట్ ఫైల్స్ అమరికలను తెలుసుకునేందుకు డ్రిల్లింగ్‌లు నిర్వహించి మట్టి నమూనాలను కూడా సేకరించారు. దరిమిలా ప్రాజెక్టు వైఫల్యానికి ప్రధానంగా నిర్మాణ సమయంలో చోటు చేసుకున్న నాణ్యత లోపాలు, నిర్మాణ సంస్థ ఎస్ఓపిని (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రోసీజర్) ప్రమాణాలను పాటించకుండా హడావుడిగా పనులు పూర్తి చేయడం వల్ల సమస్యలు ఉత్పన్నమయ్యాయని ప్రాథమిక నివేదికలో పేర్కొంది. మరో వైపు విజిలెన్స్ జరిపిన తనిఖీలలో కూడా అక్రమాలు జరిగినట్లు నివేదిక ఇవ్వడంతో రాష్ట్ర ప్రభుత్వం తదుపరి ఎలాంటి చర్యలు చేపట్టబోతోందన్న దానిపై సర్వత్ర ఆసక్తి వ్యక్తమవుతోంది. ప్రాజెక్టు దెబ్బతిన్న వ్యవహారంపై నియమించిన జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ విచారణ కూడా తుది దశకు చేరుకుంది. ఈ పరిస్థితుల్లో ప్రాజెక్టుపై విచారణ పూర్తయిన తర్వాతే మరమ్మతులకు సంబంధించి ప్రభుత్వం చర్యలు చేపట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. అదే సమయంలో ప్రాజెక్టులో అక్రమాలు చోటు చేసుకున్న వ్యవహారంపై సంబంధిత చీఫ్ ఇంజనీర్లు, అధికారులు, నిర్మాణ సంస్థలపైన చర్యలకు ఉపక్రమించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ ప్రక్రియ అంతా కూడా మరో మూడు నెలల్లో ముగిసే అవకాశం ఉందంటున్నారు.



కేసీఆర్‌పైనే అందరి నజర్

మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతిన్న వ్యవహారంలో ఏర్పాటైన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ విచారణకు రావాలంటూ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు నోటీసులు జారీ చేయడంతో ఆయన జూన్ 11న కమిషన్ ముందుకు రానున్నారు. విచారణలో కేసీఆర్ ఏం చెప్పబోతున్నారన్న దానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చలు సాగుతున్నాయి. ముఖ్యంగా డిజైన్ల మార్పు, ప్రాజెక్టు ఫౌండేషన్ సందర్భంగా చేపట్టిన డ్రిల్లింగ్ వివరాలు, బిల్లుల చెల్లింపులు వంటి కీలక ఫైళ్లకు సంబంధించి సీఎంవోలో లభించిన క్లియరెన్స్, ప్రాజెక్ట్ అంచనాలను పెంచి కాంట్రాక్టర్లకు ఆయాచిత లబ్ధి చేకూర్చారనే ఆరోపణలపై కమిషన్ ప్రశ్నించే అవకాశం ఉందంటున్నారు.

'సన్న బియ్యం' కష్టాలు

- మొరాయిస్తున్న ఈ-పాస్ యంత్రాలు
- ఒక్కో వ్యక్తికి అరగంట సమయం
- బియ్యం పంపిణీలో ఇబ్బందులు
- రేషన్‌షాపుల వద్ద లబ్ధిదారుల పడిగాపులు

వరంగల్ కలెక్టరేట్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేసే ప్రక్రియ ప్రారంభమైంది. అయితే కొన్ని ప్రాంతాల్లో ఈ-పాస్ యంత్రాలు మొరాయిస్తుండటంతో పంపిణీలో ఆలస్యం అవుతోంది. దీంతో లబ్ధిదారులు గంటల తరబడి దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఓపిక నశించి కొందరు బియ్యం తీసుకోకుండానే వెళ్లిపోతున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వ సాఫ్ట్‌వేర్‌తో బియ్యం పంపిణీ చేసేవారు. ఈ నెలలో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సాఫ్ట్‌వేర్‌తో కూడిన ఈ-పాస్ యంత్రాలు డీలర్లకు ఇచ్చారు. దీంతో బియ్యం పంపిణీకి ఒక్కో వ్యక్తికి సుమారు అరగంట సమయం పడుతోంది. ప్రభుత్వం మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి ఇస్తుండడంతో లబ్ధిదారులు రేషన్ దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. ఉదయం 6 గంటల నుంచే బస్తసంచులు పట్టుకొని క్యూలో నిల్చుంటున్నారు. రేషన్ షాపుల వద్ద నీడ లేకపోవడంతో ఎండలో ఉండాల్సి వస్తోంది.

ఈ నెలాఖరు వరకు బియ్యం తీసుకునే అవకాశం కల్పించినా లబ్ధిదారులు ముందుగా తీసుకునేందుకే ఆసక్తి చూపుతున్నారు. దీంతో రేషన్ దుకాణాల వద్ద తీవ్రమైన రద్దీ ఉంటోంది. మరో వైపు మూడు నెలల బియ్యం కోటాను రేషన్ డీలర్లు డంప్ చేసుకునే స్థలం లేకపోవడంతో వారు సైతం ఇబ్బందులు పడుతున్నారు. కాగా, సన్న బియ్యం పంపిణీ చేస్తుండటంతో షాపుల వద్ద జనం ఎగబడుతున్నారు. వరంగల్ జిల్లాలో 509 రేషన్ దుకాణాలు ఉండగా, 2,67,141 రేషన్ కార్డుదారులు ఉన్నారు. మూడు నెలలకు గాను 15,564 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు.



రేషన్ దుకాణం వద్ద బియ్యం కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

ఇవ్వడంలో ఆలస్యం..

మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తుండటంతో ఒక్కో లబ్ధిదారుడు ఈ-పాస్ యంత్రాలపై మూడుసార్లు వేలిముద్ర వేయాల్సి వస్తోంది. ఇలా ప్రతిసారి రేషన్‌కార్డు నెంబరు నమోదు చేయాలి. బియ్యం కూడా మూడు సార్లు తూకం వేయాల్సి వస్తుండటంతో పంపిణీకి సమయం ఎక్కువగా పడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో

మిగతా 8వ పేజీలో..

ఉద్యోగుల హక్కులపై పోరాడుదాం..

ట్రెంగ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి

రాంగనర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జాయింట్ యాక్షన్ కమిటీతో సంబంధం లేకుండా ఉద్యోగులు, పెన్షనర్లు ఒక్క తాటిపైకి వచ్చి మన హక్కుల కోసం మనమే కొట్లాడి సాధించుకుందామని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి పిలుపునిచ్చారు. శనివారం జరిగిన ట్రెంగ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వేతన సవరణ 5 ఏళ్లకోసారి జరగాలి కానీ 2023లో ఇవ్వాల్సిన పీఆర్సీ ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వం ఎప్పుడు లేని విధంగా 5 శాతం ఐఆర్ ప్రకటించి ఉద్యోగుల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. అయిన జేఏసీ నోరు మెదపలేదన్నారు. పీఆర్సీ కమిషన్ రిపోర్ట్ తయారైనప్పటికి ఇప్పటివరకు ప్రభుత్వానికి రిపోర్ట్ చేరలేదన్నారు. దీనిపై జాక్ నాయకులకు ఎలాంటి పట్టింపులేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న 5 డీఏల్లో కనీసం 4 డీఏలైన ఇవ్వాలన్నారు. ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సరేండర్ లీవ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. ఈసమావేశంలో ట్రెంగ నాయకులు మాచుపల్లి శేఖర్, పట్టల విజయ్‌బాబు, కృష్ణప్రసాద్, శ్రీనువాస్‌రావు, నర్సింహానాయక్, గౌస్, మరుపట్ల మలయ్య, మేకల రమేశ్, కస్నా, అమ్జద్‌ఖాన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫలితాల వెల్లడి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ ఫలితాలను శనివారం హైదరాబాద్‌లో వెల్లడించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 2,478 విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయగా, 1,711 మంది 69.04 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఇంటర్‌లో 4,449 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షకు హాజరు కాగా, 2,989 మంది 67.17 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అనగాని సదానందం పేర్కొన్నారు. జిల్లాల వారిగా ఫలితాలు ఇల్లా ఉన్నాయి. వరంగల్ జిల్లాలో టెన్త్‌లో 26.7 శాతం, ఇంటర్‌లో 49.7 శాతం ఉత్తీర్ణత సాధించారు. హనుమకొండలో పదిలో 81.6 శాతం, ఇంటర్‌లో 67.5 శాతం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో టెన్త్‌లో 80 శాతం, ఇంటర్‌లో 76.6 శాతం, మహబూబాబాద్‌లో టెన్త్‌లో 76 శాతం, ఇంటర్‌లో 74.2 శాతం, జనగామలో టెన్త్‌లో 84 శాతం, ఇంటర్‌లో 82.48 శాతం, ములుగు జిల్లాలో టెన్త్‌లో 76 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఇంటర్‌లో 51.6 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ప్రొఫెసర్ కంచ ఐలయ్య సోదరుడి మృతి


కట్టయ్య (ఫైల్)

చెన్నారావుపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన ప్రొఫెసర్ కంచ ఐలయ్య సోదరుడు కంచ కట్టయ్య (76) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. గ్రామస్థులు కథనం ప్రకారం.. ఇదే గ్రామానికి చెందిన కట్టయ్య ఇంటి వద్ద గతంలో రైసు మిల్లు నడిపిస్తూ, వ్యవసాయ పనులు చేశాడు. గత కొంత కాలంగా అనారోగ్యంగా బాధపడుతున్నాడు. మధ్యాహ్న సమయంలో గుండెపోటుతో మృతి చెందాడు. మృతునికి బార్య భారతి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

టీసీల పేరు.. అక్రమాల జోరు..

రెగ్యులర్ కోర్సుల్లో టీసీలు లేకున్నా అడ్మిషన్లు ● కేయూ బీఈడీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో దందా ● 24 మందికి నోటీసులు



కేయూ క్యాంపస్ జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లోని బీఈడీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలల్లో టీసీలకు సంబంధించి చోటుచేసుకున్న అక్రమాలు విస్తుగొలుపుతున్నాయి. టీసీలు లేకుండానే అడ్మిషన్లు ఇచ్చి, పరీక్షలు రాయించిన వైనమే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తోంది. వర్సిటీ నియమ, నిబంధనల మేరకు రెగ్యులర్ కోర్సుల్లో తప్పనిసరిగా టీసీ (టాన్స్‌ఫర్ సర్టిఫికెట్) సమర్పిస్తేనే అడ్మిషన్లు ఇవ్వాలి. కొంతమంది విద్యార్థులు టీసీలు ఇవ్వలేని పరిస్థితుల్లో హామీపత్రాన్ని ఇచ్చి అడ్మిషన్లు పొందుతారు. అయితే అడ్మిషన్ కన్ఫర్మేషన్ వరకు తప్పనిసరిగా టీసీలను అందచేయాలి. ఒకవేళ టీసీలు ఇవ్వకపోతే అడ్మిషన్ రద్దు అవుతుంది. అయితే వర్సిటీ క్యాంపస్‌లో సీటు సంపాదించిన విద్యార్థులెవరూ సీటును వదులుకోరు. రెగ్యులర్ కోర్సులైన ఎంఈడీ, బీఈడీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలల్లో బీపీఈడీ, ఎంపీఈడీలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులైతే వారిచ్చిన హామీ పత్రం మేరకు టీసీలు అడ్మిషన్ రద్దు కాక ముందే తెచ్చి ఇస్తారు. ఇక టీసీలు లేనివారు, ఇక్కడ చదువుతూ మరొక కోర్సు మరో దగ్గర చేస్తున్నవారు.. టీసీలు ఇవ్వరు. ఇలా టీసీలు ఇవ్వని విద్యార్థులను వెంటనే గుర్తించి అడ్మిషన్లను రద్దు చేయాల్సిన అధికారులు దందాకు తెరలేపారు.

టీసీల దందా ఇలా..

కేయూలో బీఈడీ, ఎంఈడీలతో పాటు ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో బీపీఈడీ, ఎంపీఈడీ కోర్సులున్నాయి. ఈ కోర్సుల్లో అడ్మిషన్ పొందినప్పటి నుంచి రెండేళ్లపాటు విద్యను అభ్యసించాల్సి ఉంటుంది. 3 నెలలకోమారు సెమిస్టర్ పరీక్షలుంటాయి. ప్రతీ సెమిస్టర్‌కు పరీక్షల ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ప్రిన్సిపాల్స్ మొదటి సెమిస్టర్ ఫీజుల చెల్లింపు సందర్భంలో టీసీలు ఇవ్వని విద్యార్థులను గుర్తించి ఫీజులు తీసుకోలేదు. దీంతో హైరానాకు గురైన సదరు విద్యార్థులు తమ వద్ద టీసీలు లేవని, గతంలో తాము చదివిన కళాశాలల్లో ఉన్నాయని నమ్మబలికారు. ఇక్కడే ప్రిన్సిపాల్స్‌తోపాటు కొందరు అధ్యాపకులు టీసీల దందాకు తెరలేపారు. టీసీల్లేని విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేశారు. డబ్బులు తీసుకుని ఫీజులు కట్టించుకుని పరీక్షలకు అనుమతించారు. టీసీలు ఇవ్వకుంటే అడ్మిషన్లు రద్దయి చదువు ఆగిపోవడంతో పాటు హాస్టల్, మెస్ సౌకర్యాలు కోల్పోతారు. దీంతో అప్పటి ప్రిన్సిపాళ్లకు డబ్బులిచ్చి కోర్సు పూర్తి చేసుకోవడమే మంచిదని విద్యార్థులు ప్రిన్సిపాల్స్‌కు అడిగినంత డబ్బులిచ్చారని తెలుస్తోంది.

ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో..

టీసీల్లేకుండానే దర్జాగా రెగ్యులర్ కోర్సుల్లో అడ్మిషన్లు వెలగబెడుతున్న వారిని ఇటీవల కొత్తగా వచ్చిన క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ గుర్తించారు. మొదటి సెమిస్టర్‌లోనే అడ్డుకోవాల్సిన విద్యార్థులు తాజాగా రెండో సెమిస్టర్‌లోకి వచ్చారు. వీరిలో ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో 10 మంది విద్యార్థులున్నారు. ఎంపీఈడీలో 6 గురు, బీపీఈడీలో మరో 4గురు ఉన్నారు. వీరందరికీ జూన్ 6న నోటీస్‌లు జారీ చేశారు. జూన్ 16వరకు టీసీలు ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో తప్పనిసరిగా అందచేయాలని, లేకపోతే అడ్మిషన్ల రద్దు చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు.

ఎడ్యుకేషన్ కళాశాలలో..

క్యాంపస్‌లోని ఎడ్యుకేషన్ కళాశాలలో ఎంఈడీ చదువుతున్న 10 మంది విద్యార్థులు, అలాగే బీఈడీలో అడ్మిషన్లు పొందిన మరో 4గురు కూడా టీసీలు ఇవ్వలేదు. వీరికి జూన్ 4న నోటీసులు జారీ చేసి 21 వరకు గడువిచ్చారు.అభ్యర్థులపేర్లతో సహా ఆయా కళాశాల నోటీస్ బోర్డులపై టీసీలు కళాశాలలో ఇవ్వని వారి వివరాలను అంటించారు. నిర్ణీత గడువులోపల టీసీలు సమర్పిస్తారా లేదా అనేది తేలవలిసి వుంది.

బాధ్యులపై చర్యలేవీ..?

ఎంఈడీ, బీఈడీ, బీపీఈడీ, ఎంపీఈడీ కోర్సుల్లో 2024-25 ఏడాదికి గాను మొత్తంగా 24 మంది టీసీల్లేకుండానే రెగ్యులర్ కోర్సుల్లో అడ్మిషన్లు పొంది సెమిస్టర్ పరీక్షలు రాశారు. వీరిని గుర్తించారు సరే, మరి వీరికంటే ముందు టీసీల్లేకుండా కోర్సులు పూర్తి చేసుకుని వెళ్లిన వారిని గుర్తించేది ఎలా, వారిపై చర్యలు ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. టీసీల్లేకుండా అడ్మిషన్లు ఇవ్వడం.. ఇచ్చిన నిర్దేశిత సమయంలో టీసీలను తెప్పించుకోకపోవడం.. పైగా సెమిస్టర్ పరీక్షలకు అనుమతించిన అప్పటి ప్రిన్సిపాల్‌తో పాటు ఇతర అధికారులపై చర్యలేమిటనేది తాజా ప్రశ్న. గతంలో వర్సిటీ ఉన్నతాధికారులు బీఈడీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో చోటు చేసుకున్న అవకతవకలపై కమిటీలు ఏర్పాటు చేశారు. రిపోర్టులను బట్టి బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి.

నోటీసులిచ్చింది నిజమే..

తాళ్లపల్లి మనోహర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

క్యాంపస్‌లోని ఫిజికల్ ఎడ్యుకేషన్, ఎడ్యుకేషన్ కళాశాలల్లో టీసీల్లేకుండా అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు నోటీసులు ఇచ్చింది నిజమే. వారికి నిర్దేశించిన సమయంలో టీసీలు కళాశాలల్లో సమర్పించకపోతే అడ్మిషన్లను రద్దు చేస్తామని చెప్పాం. రెగ్యులర్ కోర్సుల్లో టీసీలు ఇవ్వకుండా అడ్మిషన్లు పొందడంతో పాటు సెమిస్టర్ పరీక్షలకు హాజరుకావడం తప్పే. ఇప్పటికైనా టీసీలు ఇవ్వకుంటే చోటుచేసుకునే పరిణామాలకు వారే బాధ్యత వహించాలి.

15న ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15న హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి చెస్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-13 బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న ఈ ఎంపిక పోటీల్లో 1జనవరి 2012 సంవత్సరం తరువాత జన్మించిన వారు అర్హులన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నలుగురు బాలురు, నలుగురు బాలికలను జూలై నెల మొదటి వారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చెస్ టోర్నీకి ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ ఆధార్‌కార్డుతో పాటు చెస్ బోర్డు వెంట తీసుకొని ఎంపిక పోటీలకు హాజరు కావాలని ఆయన వెల్లడించారు. మరిన్ని వివరాలకు సెల్ 9059522986 నెంబర్‌లో సంప్రదించాలని కన్నా సూచించారు.

రేపు గుమ్మడి జనార్దన్‌కు ఇందారపు స్మారక పురస్కారం



హనుమకొండ కల్చలర్ జూన్7, (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరానికి చెందిన ప్రఖ్యాత సితార విధ్వంసుడు విద్యాంసుడు, విద్యారణ్య ప్రభుత్వ సంగీత కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ పండిట్ గుమ్మడి జనార్ధన్‌కు ప్రముఖ అష్టవధాని ఇందరాపు కిషన్ రావు స్మారక పురస్కారాన్ని సోమవారం ప్రదానం చేయనున్నారు. హనుమకొండలోని మీరా సంగీత మండలి ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్ సమీపంలోని సామ జగన్‌మోహన్‌రెడ్డి స్మారకభవన్‌లో సోమవారం సాయంత్రం 5 గంటలకు జరిగే ప్రత్యేక వేడుకల్లో గుమ్మడి జనార్ధన్‌కు పురస్కారం ప్రదానం చేయనున్నట్లు మీరా సంగీత మండలి అధ్యక్షుడు పింగళి వెంకటేశ్వర్‌రావు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, సహృదయ అధ్యక్షుడు గిరిజా మనోహర్‌బాబు, వనం లక్ష్మీకాంతరావు, డాక్టర్ ఎస్ఎన్‌చారి, తదితర ప్రముఖుల ఆధ్వర్యంలో జరిగే వేడుకల్లో ఆయనకు పురస్కారం ప్రదానం చేస్తామని, ఈ సందర్భంగా కిషన్‌రావు విరాచిత సంగీత లలితా గీతాలాపన నిర్వహిస్తామని వెంకటేశ్వర్‌రావు చెప్పారు.

బాలికల క్రికెట్ టోర్నీ నిర్వహిస్తాం..

● హెచ్‌సీఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బసవరాజు ● ముగిసిన వేసవి క్రికెట్ క్రీడా శిక్షణ శిబిరం


క్రీడాకారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న హెచ్‌సీఏ సంయుక్త కార్యదర్శి బసవరాజు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలో క్రికెట్ క్రీడల్లో బాలురకు దీటుగా బాలికలను ప్రోత్సహించడానికి సీనియర్స్ విభాగంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తామని హెచ్‌సీఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టి.బసవరాజు అన్నారు. వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్(డబ్ల్యూసీఏ) ఆధ్వర్యంలో మే 9న ప్రారంభమైన వరంగల్ జిల్లా వేసవి క్రికెట్ క్రీడా శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. కరుణాపురం సమీపంలోని వంగాలపల్లి క్రికెట్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన క్రీడా శిక్షణ శిబిరం ముగింపు వేడుకలకు బసవరాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

దాదాపు నెలపాటు డబ్ల్యూసీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆరు జిల్లాల్లో వేరు వేరుగా వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు నిర్వహించి విజయవంతం చేయడం అభినందనీయమని కొనియాడారు. రానున్న రోజుల్లో వరంగల్ జిల్లా కేంద్రంగా క్రికెట్ క్రీడలో బాలురకు దీటుగా బాలికలు రాణించే విధంగా టోర్నమెంట్లు నిర్వహిస్తామన్నారు. డబ్ల్యూసీఏ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరు జిల్లాలోని క్రికెట్ క్రీడా శిక్షణ శిబిరాల్లో మొత్తం 800మంది బాలబాలికల పాల్గొన్నారన్నారు. వరంగల్ జిల్లా నుంచి సుమారు 160మంది బాలబాలికలు ఈ వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాల్లో తర్ఫీదు పొందారన్నారు. నిష్ణాతులైన కోచ్‌ల పర్యవేక్షణలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా శిక్షణ శిబిరం విజయవంతంగా నిర్వహించామన్నారు. నిత్యం క్రికెట్ శిక్షణ శిబిరాలు నిర్వహించడానికి అనువుగా ఉన్న వంగాలపల్లి క్రికెట్ క్రీడా మైదానాన్ని హెచ్‌సీఏ పరిధిలోకి తీసుకురావాలని ప్రతిపాదనలు చేశామని, త్వరలో నిర్వహించబోయే ఏజీఎం మీటింగ్‌లో ఈ అంశంపై చర్చలు జరుపుతామన్నారు. రాత్రివేళల్లో ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించుకోవడానికి అనువుగా జిల్లాలో క్రికెట్ అకాడమీ ఏర్పాటుకు త్వరలోనే హెచ్‌సీఏ నుంచి అనుమతులు రాబోతున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ కలిగిన క్రికెటర్లరు వెలికి తీయడానికి వేసవి క్రికెట్ క్రీడా శిబిరాల ఎంతగానో దోహదపడతాయని, రానున్నరోజుల్లో జిల్లాలోని బాలిక క్రికెటర్లకు మంచి రోజులు రాబోతున్నాయని శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా వేసవి క్రికెట్ క్రీడాశిబిరంలో శిక్షణ పొందిన క్రీడాకారులకు అతిథులు మెడల్స్, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ క్లబ్ కార్యదర్శులు భార్గవ్, శంకర్, అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శి బస్వరాజు ఉపేందర్, ఈసీ మెంబర్లు వేణుగోపాల్, అభినవ్ వినయ్, అజయ్‌సారథి, సీనియర్ క్రికెటర్లు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో హైడ్రామా

మద్యం తాగారంటూ సోషల్ మీడియాలో వైరల్

ఫొటోలు తీసిన విలేకరులపై పోలీసుస్టేషన్ రెవెన్యూ సిబ్బంది ఫిర్యాదు


తహసీల్దార్ కార్యాలయంలో దర్శనమిస్తున్న బీర్ కాటన్

కన్నాయిగూడెం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో టేబుల్‌లపై బీరు కాటన్ ప్రత్యక్షమైన సంఘటన శనివారం మధ్యాహ్నం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక విలేకరులు కొంత మంది కార్యాలయానికి వెళ్లి వీడియోలు, ఫొటో తీశారు. కాగా, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సెలవు రోజుల్లో కూడా విధులు నిర్వహిస్తున్న క్రమంలో విధులకు ఆటకం కల్పించడమే కాకుండా మద్యం సేవించారని సోషల్ మీడియాలో వైరల్ చేయడంతోని రెవెన్యూ సిబ్బంది మనోభావాలను దెబ్బ తీశారని సిబ్బంది వాపోయారు. ఈ విషయంపై రెవెన్యూ సిబ్బంది స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫొటోలు తీసిన విలేకరులపై ఫిర్యాదు చేసి డ్రింక్ టెస్టు చేసుకున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయంపై తహసీల్దార్‌ని ఫోన్‌లో వివరణ కోరగా.. ఈటెస్టుల్లో సిబ్బందికి ఎవరికి కూడా మద్యం తాగినట్లు నిర్ధారణ కాలేదని తహసీల్దార్ సర్వర్ తెలిపారు. కాగా, భూభారతి రెవెన్యూ సదస్సు సందర్భంగా గ్రామసభలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న సందర్భంలో మధ్యాహ్నం సమయంలో మండలంలోని లక్ష్మీపురంలోని ఓ హోటల్లో భోజనానికి ఆర్డర్ ఇవ్వగా బీరు కాటన్‌లో ఆ భోజనాలను పెట్టి ఇవ్వడం జరిగిందని అందులో పేర్కొన్నారు.



ఫొటోలు తీసిన విలేకరులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నేహ (ఫైల్)

బొలేరో వాహనం, ఆటో ఢీ

బాలిక మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు


నేహ (ఫైల్)

కురవి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం శివారు మూడుగు డిసెలతండా వద్ద జాతీయ రహదారిపై ఆటోను బొలేరో వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో కురవికి చెందిన తొడుసు నేహ (16) అనే బాలిక మృతి చెందగా, ఆమె తల్లి సరితకు తీవ్రగా యాలయ్యాయి. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్‌నుంచి కురవికి ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను కురవి వైపునుంచి మహబూబాబాద్‌కు వెళ్తున్న బొలేరో వాహనం ఢీకొట్టింది. ఆటోలో ఉన్న నేహ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె తల్లి సరితకు తలతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ కానుగంటి రాజుకు కాలు విరిగింది. ఎస్సై ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను మహబూబాబాద్ జిల్లా అస్పత్రికి తరలించారు. చనిపోయిన నేహ ఇటీవలనే పదో తరగతిలో 570 మార్కులు సాధించి ఇంటర్ ఫ్రీ సీటు సాధించింది. ఈ రోడ్డు ప్రమాదం కురవిలో తీవ్ర విషాదం నింపింది.

ప్రైవేటు కంపెనీల మాయలో పడొద్దు

- విత్తన కొనుగోళ్లలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి
- అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
- నకిలీ విత్తన కంపెనీలపై చర్యలకు ఆదేశాలు



జిల్లా కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులో తనిఖీ నిర్వహిస్తున్న కలెక్టర్ (ఫైల్)

ములుగు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం సీజన్ వస్తున్నందున అన్నదాతలు సాగుకు సిద్ధమయ్యారు. దుక్కులు దున్ని విత్తనాలు కొనుగోలు చేసేందుకు రెడీగా ఉన్నారు. అయితే ఇదే సమయంలో నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. అన్నదాతలు అప్రమత్తంగా లేకపోతే తీరని నష్టం జరిగే అవకాశం ఉంది. లైసెన్స్‌ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని, విత్తన ప్యాకెట్లపై ప్యాకింగ్ తేది, లాట్ నంబర్ తదితర వివరాలు ఉన్నాయో లేదోనని పరిశీలించాకే కొనుగోలు చేయాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. విత్తన ప్యాకింగ్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను మొబైల్ ద్వారా స్కాన్ చేసి అవి మంచి విత్తనాలా.. కాదా..అని తెలుసుకోవచ్చని అంటున్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన అనంతరం తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని సూచిస్తున్నారు.

నకిలీలపై అధికారుల నజర్..

నకిలీ విత్తనాల గుట్టు రట్టు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కలెక్టర్ దివాకర విత్తన దుకాణదారులతో సమావేశం నిర్వహించి నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. నిత్యం విత్తన, ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలిస్తున్నారు. వ్యవసాయ శాఖ, పోలీసు శాఖను సమన్వయ పరుస్తూ తరచూ విత్తనషాపులపై దాడులు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రైతులను మోసం చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశాలిస్తున్నారు.

ఒప్పంద వ్యవసాయం పేరిట రైతులకు గాలం..

కొన్ని ప్రైవేటు కంపెనీలు ఒప్పంద వ్యవసాయం పేరిట రైతులను ముంచుతున్నాయి. విత్తన చట్టాన్ని ఉల్లంఘిస్తూ రైతులతో ఒప్పందం చేసుకుంటున్నాయి. పెట్టుబడికి సాయం మేమే చేస్తామని, క్వింటాకు ఇంత రేటు చెల్లిస్తామని, పంట దిగుబడి వచ్చాక అంతా మేమే కొనుగోలు చేస్తామని చెప్పి అన్నదాతలను ముగ్గులోకి దింపుతున్నాయి. వారి మాటలు నమ్మి జిల్లాలో గతంలో సుమారు వెయ్యి మంది రైతులు నష్టపోయారు. ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. పంట చేతి కొచ్చాక కొనుగోలు చేయాలని రైతులు సదరు కంపెనీల ఏజెంట్లను కోరగా అవి డీఎన్‌ఏ టెస్టు పాస్ కాలేదని, దీంతో వాటిని మేము కొనుగోలు చేయలేమని చెప్పడంతో అన్నదాతలు తలలు పట్టుకుంటున్నారు. ఇలాంటి కంపెనీల చేతుల్లో మోసపోయిన రైతులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు విత్తన కొనుగోళ్లలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.




ఆరుద్రకూ ఆత్రుతే..!

ఈ సారి రుతుపవనాలే కాదు ఆరుద్ర పురుగు కూడా ముందుగానే కనిపించింది. జూన్ 22 నుంచి ఆరుద్ర కార్తె ప్రారంభం కానుంది. ఆ సమయంలో పంట చేలల్లో ఆరుద్ర పురుగు కనిపిస్తుంది. ప్రస్తుతం చిన్నచిన్న వర్షాలు పడుతుండటంతో ముందుగానే ఆరుద్ర కనువిందు చేస్తోంది. వెంకటాపూర్ మండల శివారులోని ఓగ్గాన్ని కుంట శివారు చెలకలలో ఆరుద్ర పురుగులు దర్శనమివ్వగా దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

- వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి)

అక్షర తపస్వి...
అమృతవాక్కుల తేజస్వి

- మార్క్సిస్టుగా పోరుబాట
- వచన వేద మేధో దీప్తి
- సమ సమాజం కోసం పరితపించిన మానవతావాది
- నేడు దాశరథి రంగాచార్య వర్ధంతి



హనుమకొండ/చిన్నగూడూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జీవన యానంలో అవిశ్రాంత పథకుడు.. సాహితీ ప్రస్థానంలో అలుపెరగని యోధుడు.. నిరంతరం శ్రమించడాన్ని జీవన సూత్రంగా భావించిన గొప్ప మానవతావాది దాశరథి రంగాచార్య. ప్రజా ఉద్యమంలో పుట్టి వేదభారతాన్ని అన్వేషించిన అక్షర తపస్వి. మార్క్సిస్టుగా పోరుబాటలో నడిచి వచన వేదాన్ని రచించిన, సమ సమాజ ఆవిష్కరణ కోసం నిరంతరం తపించిన సంపూర్ణ మానవుడు. దాశరథి ఆయన ఇంటి పేరే కాదు. వంశ నామం కూడా. రామానుజులు తర్వాత ఆర్య పీఠం అధిష్ఠించిన దాశరథి వారి వంశాంకురం రంగాచార్య. జూన్ 8న ఆయన వర్ధంతి సందర్భంగా ప్రత్యేక వ్యాసం.

కుటుంబ నేపథ్యం

దాశరథి రంగాచార్య 1928, ఆగస్టు 24న మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరులో విద్వాన్ దాశరథి వెంకటాచార్య, వెంకటమ్మలకు జన్మించారు. బీఏ, ఎల్ఎల్‌బీ పట్టాపుచ్చుకున్న రంగాచార్యకు భార్య కమల, ముగ్గురు పిల్లలు సంతానం. రంగాచార్య బాల్యం అంతా చిన్నగూడూరులోనే గడిచింది. సంస్కృతం, తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లీష్ భాషలలో ప్రావీణ్యం ఉన్న దాశరథి తన భావాలను వ్యక్తీకరించేందుకు సాహిత్యాన్ని ఒక సాధనంగా ఎంచుకున్నారు. గాంధీ మహాత్ముడు, మార్క్స్ ఆయనను ఎంతో ప్రభావితం చేశారు. రావి నారాయణరెడ్డి ఆయన రాజకీయ గురువు. కవి, సాయుధ పోరాట యోధుడు దాశరథి క్రిష్ణమాచార్యులు..రంగాచార్యకు స్వయాన అన్న. రంగాచార్య సాయుధ పోరాటంలో విస్తృతంగా పాల్గొన్నారు. లాఠీ దెబ్బలు తిన్నారు. ఒక సారి తూటా దెబ్బ నుంచి తృటిలో తప్పించుకొని బతికి బయటపడ్డారు. చిన్నతనంలోనే కుటుంబ భారం తనపై పడడంతో ఆ కాలంలోనే ఉపాధ్యాయుడిగా, గ్రంథపాలకుడిగా పనిచేశారు. సాయుధ పోరాటం ముగిశాక సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 32ఏళ్లపాటు పనిచేసి అసిస్టెంట్ కమిషనర్‌గా ఉద్యోగ విరమణచేశారు. దాశరథి రంగాచార్యులకు ప్రభుత్వం వెస్ట్ మారేడుపల్లిలో భూమి కేటాయిస్తే ఇల్లు కట్టుకొని అక్కడ నివసించారు. 86ఏళ్ల వయసులో అనారోగ్యంతో 2015, జూన్ 8న కన్నుమూశారు.

ఉద్యమ ప్రస్థానం

నైజాం రాజ్యంలో నిజాం పాలన కాలంలో జన్మించిన రంగాచార్య ఆంధ్ర మహాసభ, ఆర్య సమాజాలు నిజాం నిరంకుశ పాలనను ఎదుర్కొంటున్న తీరుకు ఆకర్షితులయ్యారు. తండ్రి సనాతనవాది. ఆయన అన్న ప్రఖ్యాత కవి, అభ్యుదయవాది క్రిష్ణమాచార్యుల సాంగత్యంలో అభ్యుదయ ఆలోచనలను, విప్లవ భావాలను పుణికిపుచ్చుకున్నారు. అసమానతలకు, అణచివేతకు నిలయంగా మారిన నాటినైజాం సమాజాన్ని గమనిస్తూ పెరిగిన రంగాచార్యులు 1945లో ప్రారంభమైన తెలంగాణ సాయుధ పోరాటంలో క్రియాశీలక పాత్రను పోషించారు. కుటుంబ బాధ్యతల కారణంగా గ్రంథపాలకుడిగా, ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే ఆనాటి సమాజంలో అసమానతల గురించి ప్రజలను చైతన్యపరిచారు. ఆక్రమంలో తనపై నిజాం ప్రభుత్వ అనుకూలురు దాడులు జరిపినా వెరవలేదు. 12ఏళ్ల వయసులోనే పోరాట బావుటా పట్టి భారత స్వాతంత్ర్య ఉద్యమం, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడారు. దేశ్‌ముఖ్‌లు, మక్తేదారులు, పటేళ్లు, పట్వారీలు తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలపై జరిపిన అరాచకాలను తీవ్రంగా వ్యతిరేకించారు.

సారస్వత గోపురం

సంప్రదాయ పునాదుల మీద ఆకాశమంత ఎత్తు ఎదిగిన అభ్యుదయ సారస్వత గోపురం రంగాచార్య. ఎన్నో నవలలు, గ్రంథాలు, కవితలు, వ్యాస సంకలనాలు రాశారు. తెలంగాణ సాయుధ పోరాటం నాటి స్థితిగతులు, ఆ కాలంలోనే దారుణమైన బానిస పద్ధతులను రంగాచార్యులు చిల్లర దేవుళ్లు, మోదుగు పూలు, జనపదం నవలల్లో చిత్రీకరించారు. చిల్లర దేవుళ్ల నవలలో సాయుధ పోరాటం ముందటి స్థితిగతులు, మోదుగు పూలు నవలలో తెలంగాణ సాయుధ పోరాటకాలం పరిస్థితులు, జనపదంలో తదనంతర స్థితిని అక్షరీకరించారు. రంగాచార్యులు విశిష్టమైన రచనలతో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. తెలంగాణ పోరాట క్రమాన్ని నవలల రూపంలో ప్రతిబింబించారు.

తెలంగాణ ప్రాంత చారిత్రక, సామాజిక, రాజకీయ పరిణామాలకు ప్రతిరూపంగా రచించిన తన ఆత్మకథ జీవనయానం వంటివి సాహిత్యంపై చెరగని ముద్రలువేశాయి. వేదం లిపిబద్ధం కారాదనే నిబంధనలున్నా వాటిని ఏకంగా తెలుగులోకి అనువదించారు. వేదాలను తెలుగులో అనువదించిన వ్యక్తిగా ఆయన సాహిత్య చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. ఉర్దూ సాహిత్యంలో అత్యుత్తమమైన రచనగా భావించే మీర్జా రుస్వా ఉమ్రావ్ జాన్ ఆదా నవలను అదే పేరుతో తెలుగులోకి అనువదించారు. రంగాచార్య చిల్లర దేవుళ్ల నవలకు ఆంధ్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. వేదాలను అనువదించి, మహాభారతాన్ని సులభ వచనంలో రచించినందుకు అభినవ వ్యాసుడు బిరుదును పొందారు. ఖమ్మంలో సాహితీ ఆధ్వర్యంలో వెండి కిరీటంతో సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం పులుపుల వెంకటశివయ్య సాహితీ పురస్కారాన్ని అందచేసింది.



చిన్నగూడూరు(2021)లో ఏర్పాటు చేసిన రంగాచార్య విగ్రహం

రంగాచార్య విగ్రహం ఏర్పాటు

మహబూబాబాద్ సమైక్య విద్యా సంస్థల వ్యవస్థాపకుడు అడ్డగోడ నరేష్ తన సొంత ఖర్చులతో చిన్నగూడూరు దాశరథి ప్రాంగణంలో 2021లో కృష్ణమాచార్యుల విగ్రహ ప్రాంగణం పక్కన దాశరథి రంగాచార్యుల విగ్రహం ఏర్పాటు చేసి ఆవిష్కరించారు.

ఎస్సార్‌యూలో విద్యార్థులకు నాణ్యమైన విద్య

- 1200 మందికి పైగా విద్యార్థుల ఎంపిక
- సక్సెస్ మీట్‌లో చాన్స్‌లర్ వరదారెడ్డి వెల్లడి



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎస్సార్ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి

హసన్‌పర్తి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఆర్ యూనివర్సిటీలో విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించంతోనే క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో అత్యధికంగా ఎంపికవుతున్నారని ఎస్సార్‌యూచాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి వెల్లడించారు. విద్యార్థుల ఉద్యోగ విజయాలను పురస్కరించుకొని ఎస్సార్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో శనివారం సక్సెస్ మీట్‌ను నిర్వహించారు. రూ.51లక్షల వార్షిక ప్యాకేజీతో అత్యధికవేతనంతో ఉద్యోగాలు చేస్తున్న విద్యార్థులను విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఎస్సార్‌యూ చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులకు అందిస్తున్న శిక్షణ, కెరీర్‌పై ఉన్న నిబద్ధతకు నిదర్శనంగా 1200 మందికి పైగా విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని చెప్పారు. విద్యార్థుల ఆసక్తులను ప్రోత్సహిస్తూ అన్ని కోణాల్లో వారిని అభివృద్ధిచేయడమే లక్ష్యంగా యాజమాన్యం, బోధనా సిబ్బంది కృషి చేస్తోందన్నారు. ఈ విజయాల్లో కీలకంగా పనిచేసిన డీన్లు, వివిధ విభాగాధిపతులు, డైరెక్టర్లు, ప్లేస్‌మెంట్ సమన్వయకర్తలు అందరి కృషి అభినందనీయమన్నారు.

వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ.. ప్లేస్‌మెంట్ విజయాలతో పాటు విద్యార్థులకు ఉన్నత విద్యలో అవకాశాలు కల్పించేందుకు అనేక అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో ఎంవోయూలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఎస్ఆర్ఐఎక్స్ ఇంక్యూబేషన్ కేంద్రం ద్వారా విద్యార్థుల స్టార్టప్ ఆలోచనలకు సీడ్ ఫండింగ్ ద్వారా మద్దతు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ దిశగా కృషి చేసిన డీన్లు, ప్లేస్‌మెంట్ బృందం, ఉపాధ్యాయుల సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ అసోసియేట్ డైరెక్టర్ జి.సునిల్‌రెడ్డి ఈ విద్యా సంవత్సరానికి గల ప్లేస్‌మెంట్ నివేదికను సమర్పించి మాట్లాడుతూ.. 1200మందికి పైగా విద్యార్థుల ప్రఖ్యాత సంస్థలలో ఉద్యోగాలకు ఎంపికకావడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమన్నారు.

ఈ ఏడాది ఎస్సార్ యూనివర్సిటీ క్యాంపస్‌ను సందర్శించిన సంస్థలలో మైక్రోసాఫ్ట్, సేల్స్‌ఫోర్స్ సర్వీస్ నౌ, ఫ్లిప్‌కార్ట్ నీవ్, ష్నైడర్ ఎలక్ట్రిక్, ఇన్ఫోసిస్, కాప్జెమిని, యాక్సెంచర్, కాగ్నిజెంట్, హ్యుండాయ్, బోష్, టోషిబా, టెక్ మహీంద్రా వంటి ప్రఖ్యాత మల్టినేషనల్ సంస్థలున్నాయని తెలిపారు. ఈ సంవత్సరం విద్యార్థులు అత్యధికంగా వార్షిక ప్యాకేజీలు రూ.51 లక్షలు, 44 లక్షలు, 34.4లక్షల వేతనంతో ప్రపంచస్థాయి ఉద్యోగ అవకాశాలతో ఆఫర్లు లభించడం విశ్వవిద్యాలయ నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా ప్లేస్‌మెంట్ పొందిన విద్యార్థులకు చాన్స్‌లర్ వరదారెడ్డి, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్, రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి చేతుల మీదుగా అభినందన పత్రాలు, ఆఫర్ లెటర్లు అందజేశారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ వి.మహేష్, విభిన్న స్కూళ్ల డీన్లు, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు, ప్లేస్‌మెంట్ టీమ్‌తో పాటు ప్లేస్‌మెంట్ పొందిన విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ బుక్ చేస్తే.. సబ్బులు వచ్చాయి..

- ఆన్‌లైన్ డెలివరీలో మాయాజాలం
- బుచ్చిరెడ్డిపల్లిలో బాధితుడి గగ్గోలు




త్రిబుల్ ఎక్స్ సబ్బులను చూపిస్తున్న బానోతు నరసింహ

నల్లబెల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఫ్లిప్‌కార్ట్‌లో సెల్‌ఫోన్ బుక్ చేస్తే రెండు త్రిబుల్ ఎక్స్ సబ్బులు వచ్చిన సంఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం బుచ్చిరెడ్డిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడు బానోతు నరసింహ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. బుచ్చిరెడ్డిపల్లికి చెం దిన నరసింహ కుమారుడు బానోతు రాజేందర్ ఫ్లిప్‌కార్ట్‌లో మోటారోలో సెల్‌ఫోన్‌ను ఆన్‌లైన్‌లో జూన్ 1వ తేదీన బుక్ చేశాడు. ఆన్‌లైన్ కొరియర్ డెలివరీ బాయ్ జూన్ 6న నరసింహకు ఫోన్‌చేసి బుచ్చిరెడ్డిపల్లి గ్రామంలోని ఇంటికి వచ్చాడు. డెలివరీ బాయ్‌కి నరసింహ రూ.16,068లను చెల్లించిన అనంతరం పార్సిల్ ఇచ్చి ఓపెన్ చేయమన్నాడు. పార్సిల్‌ను ఓపెన్ చేస్తుంటే డెలివరీ బాయ్ వీడియో తీశాడు. ఒక్కసారిగా ఆ పార్సిల్‌లో నుంచి రెండు త్రిబుల్ ఎక్స్ సబ్బులు బయటపడ్డాయి. వెంటనే డెలివరీ బాయ్‌ని పట్టుకొని ఏమిటిదని ప్రశ్నించగా, తనకేమీ తెలియదని, కంపెనీకి సమాచారం తెలుపండని అన్నారు. దీంతో నరసింహ అదేరోజు నర్సంపేట ఆఫీస్‌కి వెళ్లి దరఖాస్తు ఇచ్చాడు. విచారణ చేస్తామని, డబ్బులు తిరిగి వస్తాయని ఆఫీస్ వాళ్లు తెలిపారు. అయితే ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో ఇంత మోసం ఉంటుందా? అని నరసింహ ఆవేదన వ్యక్తం చేశాడు.

లెక్కల పాఠ్యపుస్తకాల్లో మార్పులు

- ఏఐ మేళవింపుతో పాఠ్యాంశాల జోడింపు
- శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు



వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : సాంకేతికతను జోడించి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. కృత్రిమ మేధ(ఏఐ) మేళవింపుతో గణితంలో కొన్ని పాఠ్యాంశాలను చేర్చారు. 1 నుంచి 9వ తరగతుల గణితం పాఠ్యపుస్తకాల్లో ఏఐతో కూడిన కొత్త చాప్టర్స్‌ను చేర్చారు. పాఠశాలల ప్రారంభం రోజున విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు పంపిణీ కానున్నాయి. 1 నుంచి 9 తరగతులు గణితంలోని అనేక చాప్టర్లలో ఏఐని జోడించారు. గణితంలో ఇప్పటికీ మూస పద్ధతిలోనే లెక్కలున్నాయి. ఆల్జీబ్రా అసలే అర్థంకాని విద్యార్థులున్నారు. ఇందులోని కొన్ని లెక్కలు సూత్రాలతో మిళితమై ఉంటాయి. వాస్తవంగా ఈ తరహా సూత్రాల వాడకం పూర్తిగా మారిపోయింది. ఏఐ ఆధారిత టెక్నాలజీ గణితశాస్త్ర పునాదిని నిర్దేశిస్తుందంటే అతిశయోక్తి కాదు. ఈ కారణంతోనే లెర్నింగ్ మాడ్యూల్స్‌లో కీలకమైన లెక్కలను ఏఐ పరిధిలోకి తెచ్చారు. ఈ మార్పు విద్యార్థుల్లో ఆసక్తిని పెంచే అవకాశం ఉంది. లెక్కల సూత్రాల స్థానంలో ఏఐ భాష నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక కోడింగ్‌తో పుస్తకాలు రూపొందించారు. ప్రాథమిక తరగతుల్లో సాధారణ భాషగా ఏఐ లెక్కలు ఉండనున్నాయి. 7 నుంచి 9 తరగతికి వచ్చే విద్యార్థులు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో కూడిన క్యాలిక్యులేషన్స్ చేయాల్సి ఉంటుంది.

మారిన పాఠ్యపుస్తకాల్లో మేళవించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాఠ్యాంశాలకు అనుగుణంగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. గత నెలలో ఉపాధ్యాయులకు నిర్వహించిన కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్‌లో ఒక్క సెషన్‌లో ఏఐ బోధనాంశాలపై శిక్షణను ఇచ్చారు. మారిన సిలబస్‌లో మారిన లెక్కల తీరు, వాటిని అర్థం చేసుకునే విధానం, క్యాలిక్యులేషన్‌లో సరైన జవాబు రాబట్టే తీరును మ్యాథ్స్ ఉపాధ్యాయులు ఈ శిక్షణలో నేర్చుకున్నారు. గత ఏడాది విద్యా సంవత్సరం చివరల్లో జిల్లాల్లోని కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి వాటిల్లోనే విద్యార్థులకు ఏఐ ఆధారిత పాఠ్యాంశాలను బోధించారు. అయితే ఈ విద్యాసంవత్సరం పూర్తిస్థాయిలో 1 నుంచి 9 తరగతుల గణిత పాఠ్యపుస్తకాల్లో ఏఐ మేళవించిన పాఠ్యాంశాలను జోడించడంతో అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఏఐ ఆధారిత పాఠ్యాంశాలవిద్యాబోధనజరుగనుంది.

జిల్లా పేరు	ఏఐ పాఠ్యాంశాల బోధన జరిగిన పాఠశాలలు
వరంగల్	16
హనుమకొండ	14
జనగామ	18
మహబూబాబాద్	12
జయశంకర్ భూపాలపల్లి	06
ములుగు	06

ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయి నుంచే ఆటల్లో శిక్షణ అందించేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికిగాను నాలుగో తరగతిలో ప్రవేశాలకు జిల్లాలోని అర్హులైన బాలబాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ఆదిలాబాద్, కరీంనగర్, హకీంపేట్‌లో ఉన్న క్రీడా పాఠశాలల్లో పాల్గొనే బాలబాలికలకు మూడు అంచెల పద్ధతిన ఎంపిక పోటీలు ఉంటాయని ఆయన తెలిపారు. ఆదిలాబాద్, కరీంనగర్, హకీంపేట్ క్రీడా పాఠశాలల్లో ఒక్కో పాఠశాల నుంచి 20 మంది బాలురు, 20 మంది బాలికలకు మొత్తం 120 మంది విద్యార్థులకు సీట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. జూన్ 16 నుంచి 19వ తేదీ వరకు మండల స్థాయిలో ఎంపికలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులు జూన్ 23 నుంచి 26వ తేదీ వరకు జిల్లా స్థాయిలో నిర్వహించనున్న ఎంపిక పోటీల్లో పాల్గొంటారని అన్నారు.

అదేవిధంగా జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభతో రాణించిన బాలబాలికలకు జూలై 1నుంచి 5వరకు రాష్ట్ర స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహించి ఇక్కడ రాష్ట్రస్థాయిలో ప్రతిభ ఆధారంగా రాష్ట్రంలోని మూడు క్రీడా పాఠశాలలకు ఒక్కో పాఠశాలకు 20మంది బాలురు, 20మంది బాలికలను ఎంపిక చేయనున్నామన్నారు. క్రీడా పాఠశాల ఎంపిక పోటీల్లో పాల్గొనే విద్యార్థులు వైద్య పరీక్షల్లో నెగ్గిన తరువాత మొత్తం 9శారీరక సామర్థ్య అంశాల్లో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఎత్తు, బరువు, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్స్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, వర్టికల్ జంప్, మెడిసిన్‌బాల్‌త్రో, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, 800మీటర్ల పరుగుపందెం, 6ఇంటూ 8మీటర్ల షటిల్ రన్, పోటీలను బాలబాలికలకు వేర్వేరుగా ఉంటాయన్నారు. ఒక్కో పరీక్షకు అత్యధికంగా 3పాయింట్లు, ఉండగా, ఇలా ఎక్కువ పాయింట్లు సాధించి రాష్ట్రస్థాయిలో సైతం మెరిట్ పాయింట్లు పొందిన 20 మంది బాలురు, 20 మంది బాలికలను ఒక్కో క్రీడా పాఠశాలకు ఎంపిక చేస్తామన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 1 సెప్టెంబరు, 2016 నుంచి 30 ఆగస్టు 2017 మధ్యకాలంలో జన్మించిన వారు తమ బర్త్ సరిఫికెట్, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి జారీ చేసిన బోనఫైడ్ సర్టిఫికెట్, రెసిడెన్షియల్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డుతో పాటు 10పాస్‌పోర్టు సైజ్ ఫోటోలను వెంట తీసుకొని ఈ నెల 7నుంచి జిల్లాలోని డీఎస్‌ఏ కార్యాయాల్లో గాని, ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారాగాని తమ పేర్లను నమోదు చేసుకోవాలని అశోక్‌కుమార్ ప్రకటన ద్వారా సూచించారు. అదేవిధంగా ఈ ప్రవేశాలకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఒక ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను రూపొందించి విద్యార్థులకు అందుబాటులో ఉంచమన్నారు. ఈ ఎంపిక ప్రక్రియను పూర్తి పారదర్శకంగా ఉండే విధంగా అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 9392997668 నెంబర్‌లో సంప్రదించాలని అశోక్‌కుమార్ కోరారు.




పంట పొలంలో ఏర్పాటు చేసిన గొర్రెల మంద

సేంద్రియ సాగుపై రైతుల ఆసక్తి

- జీవాల ఎరువుపై దృష్టి
- కోళ్ల పెంట కొనుగోలు
- పచ్చిరొట్ట, జీలుగ పంటల సాగు


మొగుళ్లపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువుల వల్ల భూసారం దెబ్బతినడంతో పాటు పంటల దిగుబడి తగ్గిపోవడంతో రైతులు సేంద్రియ సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. నేలను సారవంతం చేసేందుకు మూగజీవాల ఎరువును ఉపయోగిస్తున్నారు. పొలాల్లో గడ్డి ఉండగానే కొందరు మేకలు, గొర్రెలు, గేదెల మందలను పెట్టిస్తున్నారు. యాసంగి కోతలు అయిపోయాక గడ్డిని భూమిలోనే కలియదున్నుతున్నారు. ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, కంపోస్టు ఎరువులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పశువుల పేడ ట్రాక్టర్‌కు రూ.2500 నుంచి రూ.3500 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. రోజుకు రూ.3వేల నుంచి రూ.3500 వరకు ఖర్చు పెట్టి భూముల్లో మేకలు, గొర్రెల మందలు పెట్టిస్తున్నారు. ఇందుకోసం కొద్దిరోజుల క్రితమే అడ్వాన్స్ కూడా ఇచ్చారు. హైదరాబాద్, సిద్దిపేట తదితర జిల్లాలలోని పౌల్ట్రీల నుంచి కోళ్ల వ్యర్థాలను కొని తెచ్చుకుంటున్నారు. చిన్న లారీ అయితే రూ.25వేలు, పెద్ద లారీ అయితే రూ.35వేల చొప్పున కొనుగోలు చేస్తున్నారు.

రసాయనిక ఎరువులు తగ్గిస్తున్నాం
నర్సింహారెడ్డి, రైతు మొగుళ్లపల్లి




రసాయన ఎరువులను అధికంగా వినియోగించడం వల్ల భూముల్లో పోషకాలు దెబ్బతింటున్నాయి. వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పిస్తే చాలా మంది రైతులు సేంద్రియ ఎరువుల వినియోగం వైపు మొగ్గు చూపుతారు. భూసారం పెంపునకు కోడి, గొర్రెలు, మేకల ఎరువు, ఆవు పేడ, చెరువు మట్టిని వినియోగిస్తున్నాం.

సేంద్రియ సాగు మేలు..
వీరునాయక్, జిల్లా వ్యవసాయాధికారి



రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వైపు మొగ్గు చూపాలి. ప్రభుత్వం జీలుగ, జనుము, పెసర విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేస్తోంది. పంటలపై అధికంగా రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులను వినియోగిస్తే భూమిలోని పోషకాలు నశించి పంట దిగుబడి తగ్గిపోతుంది.



పీసీబీ సభ్యుడు గాదె దయాకర్‌కు సన్మానం

కేయూ క్యాంపస్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అప్పీలెట్ అథారిటీ సభ్యుడిగా నియమితుడైన కేయూ కెమిస్ట్రీ విభాగం రిటైర్డు ప్రొఫెసర్ గాదె దయాకర్‌ను శనివారం హనుమకొండ సర్క్యూట్ గెస్ట్ హౌస్ సమీపంలోని స్వగృహంలో పలువురు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గురుకుల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ అజయ్‌కుమార్, ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా డైరెక్టర్ డాక్టర్ కొంగర జగన్మోహన్, టీజీపీఏ అధికార ప్రతినిధి తనుగుల శ్రీనివాస్, హైకోర్టు అడ్వకేట్ మాసారపు సాంబశివరావు, చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



దయాకర్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

డెంగీ వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి

» డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : డెంగీ వ్యాధితో ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య సూచించారు. కంఠాత్మకూరుకు చెందిన రామంచ సాయితేజ(15), తండ్రి కిరణ్‌కు డెంగీ జ్వరం వచ్చినట్లు అందిన సమాచారం మేరకు శనివారం పీహెచ్‌సీ సిబ్బందిని అప్రమత్తం చేయడమే కాకుండా డీఎంహెచ్‌వో స్వయంగా గ్రామాన్ని సందర్శించారు. డెంగీ సోకిన వారి ఇంటి చుట్టుపక్కల గల 52 ఇళ్లకు ఆశ కార్యకర్తలపై పైరేత్రియం మందు స్ప్రే చేయించారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ.. సుమారు పది ఇళ్లలో ప్రజలకు దోమల పెరుగుదల, నివారణ గురించి వివరిస్తూ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రాయపర్తి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దివ్య, పల్లె దవాఖానా వైద్యులు మాధవి, సూపర్‌వైజర్లు సాంబయ్య, ప్రశాంతి, రవీందర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

» పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



టీచర్స్ కాలనీ ఫేజ్-2 ఆర్చ్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డెపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం గ్రేటర్ వరంగల్ 60వ డివిజన్ వడ్డెపల్లి టీచర్స్ కాలనీ ఫేస్-2లో స్థానిక కాలనీ వాసుల ఆధ్వర్యంలో నిర్మించే కాలనీ ప్రవేశ ద్వారం(ఆర్చ్) పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్చ్ అనేది కేవలం ఒక నిర్మాణం మాత్రమే కాదని, అది మీ కాలనీ ఐక్యతకు, అభివృద్ధి దిశగా వేసే తొలి అడుగని కొనియాడారు. ఆర్చ్ నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నాగరాజు, ఆలయ అర్చకులు, పాలక మండలి సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం



ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్

హసన్‌పర్తి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ అన్నారు. గ్రేటర్ 66వ డివిజన్‌లో ప్లాస్టిక్ రహిత డివిజన్ కోసం ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరుతూ శనివారం కరపత్రాలు పంచుతూ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక కార్పొరేటర్ శివకుమార్ మాట్లాడుతూ 100 రోజుల ప్రణాళికలో నగరాన్ని 2047 వరకు నగరంలో ఎక్కడైనా నివాసాలు ఏర్పరుచుకునే విధంగా ప్లాస్టిక్ రహితంగా చేయాలనే ముఖ్య ఉద్దేశంతోనే అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. షాపు యజమానులు, ప్రజలు ఒక్కరోజు వాడిపడేసే కవర్లు వాడకూడదని, వాతావరణాన్ని కలుషితం చేయకూడదని ఇంటింటా తిరుగుతూ పర్యావరణాన్ని కాపాడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ భాషానాయక్, జవాన్లు భిక్షపతి, నాగరాజు, సురేష్‌తో పాటు కార్మికులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సంస్థాగత నిర్మాణాలను పూర్తిచేయాలి

» హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కందుకూరి సోమన్న



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి సోమన్న

రాంనగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 7న ఎమ్మార్పీఎస్ 31వ వార్షికోత్సవం ఉన్న నేపథ్యంలో సంస్థగత నిర్మాణాలను పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సోమన్న పిలుపునిచ్చారు. హనుమకొండ లష్కర్‌సింగారంలో బొక్క రాజేశ్ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్‌చార్జి సోమన్న, ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చింతలపల్లి సోమశేఖర్ హాజరై మాట్లాడుతూ.. ఈ నెల రోజులపాటు జిల్లాలోని ప్రతి మండలం, గ్రామంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల కమిటీలను ఏర్పాటు చేయాలని, దీని కోసం జిల్లాలోని 14 మండలాలకు త్వరలోనే ఇన్‌చార్జిలు, కో- ఇన్‌చార్జిల వివరాలను ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్, హనుమకొండ మండల ఉపాధ్యక్షుడు రాజేందర్, ఎర్ర రాము, అలువాల ఎల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

ఈద్గాల్లో సామూహిక ప్రార్థనలు





హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ ఈద్గాలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, కాజీపేటలో బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీసులు



కాజీపేటలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

వడ్డెపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని వివిధ డివిజన్లలో త్యాగానికి ప్రతిరూపమైన బక్రీద్ పర్వదిన వేడుకలను ముస్లింలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈద్గాలు, మసీదులలో సామూహిక ప్రార్థన(నమాజ్)లు చేశారు. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని ఈద్గాలో వడ్డెపల్లి మసీదు కమిటీ ప్రతినిధులు ఎమ్డీ.సిరాజ్, ఎమ్డీ.అక్మల్, ఆబిద్, అమీర్, ఆరీఫ్, యూసఫ్ ఆధ్వర్యంలో బక్రీదును పురస్కరించుకొని ఇమామ్ మౌళా ఖురాన్‌లోని ప్రవచనాలను పఠించారు. అనంతరం ముస్లిం సోదరులతో సామూహిక ప్రార్థనలు చేయించారు. ఎన్జీవోస్ కాలనీ, జవహర్ కాలనీ, గోకుల్ నగర్, గోపాల్‌పూర్, అన్సార్ కాలనీలలోని మసీదులలోసైతం ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బంధు మిత్రులకు సేమియా పాయసంతో పాటు ఖుర్బాని చేసిన మాంసాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు ఆరీఫ్, జావెద్, అన్వర్ అలీ, ఖదీర్, అక్రమ్, యాకూబ్, ఎమ్డీ.రియాజ్, సమీర్, రఫీక్, తదితరులు పాల్గొని అలాయ్ బలాయ్ (ఆలింగనం) తీసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

● కాజీపేట: కాజీపేటలో శనివారం బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి. కూరగాయల మార్కెట్ ఈద్గా, జూబ్లీమార్కెట్, దర్గాతోపాటు వివిధ కాలనీల్లో మసీదుల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. 63వ డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ, 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్‌లు మసీదుల వద్దకు వెళ్లి ముస్లీంలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి భారీ పోలీస్ బందోబస్త్ నిర్వహించారు.

మోదీ పాలనలోనే ప్రజా సంక్షేమం

హసన్‌పర్తి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ పాలనలోనే దేశ ప్రజల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని బీజేపీ వర్ధన్నపేట నియోజకవర్గ కన్వీనర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రగట్టుగుట్ట విశ్వకోసేనా స్వచ్ఛంద సేవా సమితి కల్యాణ మండపంలో శనివారం 11 ఏళ్ల మోదీ పాలన విజయాలపై బీజేపీ కార్యశాల నిర్వహించింది. మండల అధ్యక్షుడు మారం తిరుపతి యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ 11 ఏళ్ల విజయవంతమైన పాలనలో దేశం సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై విశ్లేషణాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మారపల్లి రాంచంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి చల్లగొండ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు నాంపల్లి శ్రీనివాస్, మాజీ మార్కెట్ డైరెక్టర్ రాజేశ్వర్ రావు, జీల సురేష్, దాది మధు, ఉమాదేవి, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు, వివిధ పదాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి



ఈవోకు ఆభరణాలను అందజేస్తున్న కృష్ణారావు దంపతులు

భద్రకాళి అమ్మవారికి బంగారు కానుకలు

● రూ.10లక్షల విలువైన ఆభరణాలు సమర్పించిన ఎన్‌ఆర్‌ఐ దంపతులు

వరంగల్ కల్చరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లోని శ్రీభద్రకాళి అమ్మవారికి భక్తులు సుమారు రూ.10 లక్షల విలువైన (110 గ్రాములు) ఆభరణాలను బహూకరించారు.అమెరికాలో నివాసముంటున్న రేవతి -కృష్ణారావు దంపతులు శనివారం 2 కాసుల పేర్ల బంగారు నగలను ఈవో శేషభారతికి అందజేశారు.

టాటా మోటార్స్ వర్క్‌షాపులో మాన్సూన్ క్యాంపు

రాంనగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): టాటా మోటార్స్(సెలెక్ట్ మోటార్స్) వర్క్‌షాపు పెద్దమ్మగడ్డలో శనివారం ఏర్పాటుచేసిన మాన్సూన్ క్యాంపును హనుమకొండ సీఐ సతీష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సెలెక్ట్ మోటార్స్ జీఎం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మాన్సూన్ క్యాంపు ప్రయోజనాలను కస్టమర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్క్‌షాపు నిర్వాహకులు రత్నాకర్‌రెడ్డి, సీఎస్ఎం నాగార్జున, సిబ్బంది పాల్గొన్నారు.



క్యాంపును ప్రారంభిస్తున్న సీఐ సతీష్

'సన్న బియ్యం' కష్టాలు

(5వ పేజీ తరువాయి)

ఇంటర్‌నెట్ సరిగా లేక సర్వర్ మొరాయిస్తోంది. ఒక్కొక్కరికి అర గంట సమయం పడుతుండటంతో గంటల తరబడి రేషన్ షాపుల ముందు నిల్చోలేక లబ్ధిదారులు విసుగుచెందుతున్నారు.

పనులు వదులుకోవాల్సి వస్తోంది..

పెండ్లి వరుణ్, కొండూరు రాయపర్తి మండలం



మూడు నెలల బియ్యం ఒకేసారి ఇస్తుండటంతో పనులు వదులుకొని రేషన్ దుకాణం వద్ద వేచి ఉంటున్నాం. మూడుసార్లు వేలిముద్రలు తీసుకొని బియ్యం ఇవ్వడంలో గంటల సమయం పడుతోంది. పనులు వదులుకొని తిరుగుతున్నాం. ఎండలో నిల్చోలేక ఇబ్బంది పడుతున్నాం.

మూడు రోజులుగా తిరుగుతున్నా..

ప్రవీణ్, వరంగల్



రేషన్ బియ్యం తీసుకునేందుకు మూడు రోజులుగా తిరుగుతున్నా. పేపర్‌పై నెంబర్ వేసి మరునాడు రమ్మంటే వెళ్లాను. ఉదయం పూట 20 మందికి, సాయంత్రం పూట మరో 20 మందికి చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు. మూడు సార్లు వేలిముద్ర వేయడంతో చాలా సమయం పడుతోంది. సర్వర్ డౌన్ అయితే గంట వేచి ఉండాల్సి వస్తోంది.

నెలాఖరు వరకు బియ్యం పంపిణీ చేస్తాం..

సంధ్యారాణి, అదనపు కలెక్టర్

మూడు నెలలకు ఒకేసారి బియ్యం పంపిణీ చేపడుతుండటంతో ఇబ్బంది అవుతోంది. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి తప్పకుండా బియ్యం అందజేస్తాం. రేషన్ దుకాణాల వద్ద వేచి ఉండకుండా టోకెన్లు అందజేసి క్రమ పద్ధతిలో సరుకులు అందజేయాలని డీలర్లకు సూచించాం. గతంలో ప్రతీ నెల 15 వరకు బియ్యం పంపిణీ చేసేవారు. కానీ, ఈసారి నెలాఖరు వరకు పంపిణీ చేస్తాం.

ఇల్లు రాలేదనే కోపంతోనే మాట్లాడా..

● పీడీ ఎదుట నిందితురాలి వెల్లడి

హసన్‌పర్తి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : రూ.లక్ష ఇస్తేనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నారని నాగారం గ్రామంలో బండారి అనిత అనే మహిళ వాట్సాప్‌లో వీడియో వైరల్ చేసిన ఘటనపై హసన్‌పర్తి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైన విషయం విదితమే. ఈ ఘటనపై హౌసింగ్ పీడీ డి.రవిందర్ శనివారం స్థానిక ఎంపీడీవో కర్నాకర్‌రెడ్డి సమక్షంలో గ్రామంలో విచారణ జరిపారు. నిందితురాలు బండ అనితతో పాటు ఇందిరమ్మ లబ్ధిదారులను పిలిపించి విచారించారు. ఈ క్రమంలో ఇందిరమ్మ లబ్ధిదారులు తమకు ఇల్లు మంజూరు చేసినందుకు ఎవరికీ డబ్బులు ఇవ్వలేదని విచారణ అధికారికి వివరించారు. అయితే నిందితురాలు బండ అనిత మాత్రం తనకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాలేదని అక్కసుతోనే రూ.లక్ష ఇస్తేనే ఇందిరమ్మ ఇల్లు అని తప్పుడు వీడియో ప్రచారం చేసినట్లు హౌసింగ్ పీడీ ఎదుట వెల్లడించింది. ఈ విషయంలో ఎటువంటి ఆధారాలు లేవని నిందితురాలు అంగీకరించడంతో విచారణ అధికారి లిఖిత పూర్వక వాంగ్మూలం తీసుకున్నారు.

ఈ సందర్భంగా హౌసింగ్ పీడీ డి.రవీందర్, ఎంపీడీవో కర్నాకర్‌రెడ్డిలు మాట్లాడుతూ.. అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు తప్పకుండా మంజూరవుతాయన్నారు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వారి వివరాలను వెల్లడిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. ఇందిరమ్మ లబ్ధిదారులు ఎవరికీ ఒక్క రూపాయికి కూడా ఇవ్వవద్దని హితవు పలికారు. ఈ సందర్భంగా హౌసింగ్ పీడీ వెంట హౌసింగ్ ఏఈ ఎ.నరేందర్‌రాజు, పంచాయతీ కార్యదర్శి గరిగెప్రశాంతి, ఇందిరమ్మ కమిటీసభ్యులు మల్లాడి ఇంద్రారెడ్డి, నక్క రవి, సందరాజు సంతోష్, ఇందిరమ్మ లబ్ధిదారులున్నారు.



నాగారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిందితురాలిని విచారణ చేస్తున్న హౌసింగ్ పీడీ డి.రవీందర్

బల్దియాలో అసభ్యకర చేష్టలు

● వీడియో వైరల్.. ఉన్నతాధికారుల సీరియస్

వరంగల్ కార్పొరేషన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బల్దియాలో రాసలీలల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. కొందరు ఉద్యోగులు కార్యాలయంలోనే కక్కుర్తి పనులు కానిస్తూ బల్దియా పరువును దిగజార్చడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బల్దియా ప్రధాన కార్యాలయంలోని అకౌంట్స్ విభాగంలో పని చేస్తున్న ఒక మహిళా అధికారి, మరోపురుష అధికారి చాలా రోజులుగా స్నేహపూర్వకంగా ఉంటున్నారు. వీరు కార్యాలయంలో ముద్దులాడుకోవడం వీడియోలో బయటకు వచ్చి వైరల్ అయింది. అయితే ఈ ఘటన 15 రోజుల కిందట చోటుచేసుకోగా అప్పుడే ఇద్దరిని మందలించినట్టు బల్దియా అధికారులు చెప్పుకొస్తున్నారు. కాగా ఐదు రోజుల కిందట ఇదే ఇద్దరు ఉద్యోగులు అకౌంట్స్ విభాగంలో ఒకరిపై ఒకరు చేతులు వేసుకోవడం, ముద్దులు పెట్టుకుంటున్నట్టు కనిపిస్తున్న మరో వీడియో బయటకురావడంతో చర్చనీయాంశమైంది. విషయం సీరియస్ కావడంతో మేయర్, కమిషనర్‌లు స్పందించారు. ఇద్దరు ఉద్యోగులను మందలించినట్టు తెలిసింది. బల్దియాలో జరిగిన చుంబనాల ఘటనపై రాష్ట్ర మున్సిపల్ అధికారులు జిల్లా అధికారులను మందలించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో బల్దియా అదనపు కమిషనర్ జోనాను విచారణ అధికారిగా నియమించి పూర్తి వివరాలు సేకరించాలని సూచించినట్టు సమాచారం.

వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న పులి దేవేందర్ ముదిరాజ్

వడ్డెపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్‌కు మంత్రివర్గ విస్తరణలో మంత్రి పదవి ఇచ్చి అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్ సామాజిక వర్గానికి ప్రాధాన్యత కల్పించాలని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్(మెపా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ కాంగ్రెస్‌పార్టీ అధిష్ఠానానికివిజ్ఞప్తి చేశారు. శనివారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని మెపా వరంగల్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పులి రాజేష్ ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలయాపన చేయకుండా ముదిరాజ్ కులంలో ఏకైక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. సమావేశంలో మెపా రాష్ట్ర, జిల్లా నాయకులు పులి ప్రభాకర్, పొన్నం రాజు, దండు చిరంజీవి, నీరటి రాజు, సింగారపు రామకృష్ణ, గోనెల విజేందర్, పులి మహేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

గైనేని రాజన్‌కు సతీ వియోగం

న్యూశాయంపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకుడు, హోటల్ రాజ్ యజమాని గైనేని రాజన్ సతీమణి డాక్టర్ గైనేని స్వరూప(70) శనివారం ఉదయం హనుమకొండ విద్యుత్ నగర్‌లోని వారి స్వగృహంలో అనారోగ్యంతో మృతి చెందారు. మృతి విషయం తెలుసుకున్న పలువురు రాజన్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్వరూప అంత్యక్రియలు పద్మాక్షి కాలనీలోని శ్మశాన వాటికలో జరిగాయి. మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవపటేల్, అపెక్స్ కమిటీ చైర్మన్ పుట్టం పురుషోత్తంరావు, ఉమ్మడి వరంగల్ జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కటకం పెంటయ్య, బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పగడాల కాళీప్రసాద్‌రావు, వరంగల్ తూర్పు నియోజకవర్గ కో ఆర్డినేటర్ పోతు కుమారస్వామి, మున్నూరు కాపు సంఘం నాయకులు తోట తిరుపతయ్య, బొజ్జం రమేష్, పెంచాల గోపన్న, కోల జనార్ధన్, పెరుకారి శ్రీధర్, కేడల జనార్ధన్, పూజారి సత్యనారాయణ, వేల్పుల మోహన్‌రావు, రావుల కిషన్, వివిధ పార్టీల నాయకులు, సంఘాల నాయకులు రాజన్‌ను పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అప్పగింత

కాజీపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : రైల్వే స్టేషన్ పరిసరాల్లో పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్‌ను రైల్వే పోలీసులు పట్టుకుని బాధితుడికి అప్పగించారు. కాజీపేట రైల్వే ఇన్‌స్పెక్టర్ వడ్డే నరేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన కనకాల ఆదిత్య శనివారం రైల్వే స్టేషన్ పరిసరాల్లో తన మొబైల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నారు. రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయగా రైల్వే ఎస్సై లొకేషన్ ఆధారంగా ఫోన్ ఉన్న ప్రదేశాన్ని కనుక్కుని బాధితుడికి ఫోన్ అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ నరేశ్ తెలిపారు.

ల్యాప్‌టాప్ లభ్యం

కాజీపేట రైల్వే స్టేషన్‌లో శనివారం పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఒక బ్యాగు లభ్యమైందని రైల్వే ఇన్‌స్పెక్టర్ వడ్డే నరేశ్ తెలిపారు. బ్యాగులో తనిఖీలు చేయగా అందులో ఒక డెల్ కంపెనీకి చెందిన ఒక ల్యాప్‌టాప్, చార్జర్ ఉంది. చుట్టుపక్కల వారిని అడుగగా ఆ బ్యాగు తమది కాదని చెప్పినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు, బ్యాగుపోయిన వారు కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ నరేశ్ తెలిపారు.

రెడ్డిపురం కుంటలో పడి విద్యార్థి మృతి

వరంగల్ కార్పొరేషన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఆహ్లాదం కోసం ఈతకు వెళ్లి నీటి కుంటలో పడి ఐటీఐ చదువుతున్న తేజావత్ గణేశ్(17) అనే విద్యార్థి మృత్యువాత పడ్డాడు. శనివారం విద్యార్థి మృతదేహాన్ని బల్దియా డీఆర్ఎఫ్ గజ ఈతగాళ్లు, సిబ్బంది బోట్స్ సహాయంతో గంటలో నీటి నుంచి వెలికి తీశారు. బల్దియా డీఎఫ్‌వో శంకర్‌లింగం తెలిపిన ప్రకారం.. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం టీకే తండాకు చెందిన గణేశ్.. వరంగల్ ములుగురోడ్డు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో చదువుతున్నాడు. రెడ్డికాలనీలో తల్లిదండ్రుల వద్ద ఉండి చదువుకుంటున్నాడు. కాగా, ఎండాకాలం కావడంతో రెడ్డిపురంలోని నీటి కుంటలో ఈతకు వెళ్లాడు. ఈత సరిగా రాకపోవడంతో నీరు ఎక్కువగా ఉన్న ప్రదేశానికి వెళ్లి నీటిలో మునిగిపోయాడు. సమయానికి అక్కడ ఎవరూ లేకపోవడంతో కాపాడేవారు లేక నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కేయూ పోలీసులు వరంగల్ అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ఫైర్‌అధికారులు బల్దియా డీఆర్ఎఫ్‌కు సమాచారం అందించడంతో రెస్క్యూటీమ్ నీటిలోకి వెళ్లి అడుగుభాగాన ఉన్న గనేశ్ మృతదేహాన్ని వెలికితీసి కేయూ పోలీసులకు అప్పగించారు. పోస్టుమార్టం కోసం ఎంజీఎంకు తరలించారు. తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.



మృతదేహాన్ని వెలికితీస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

నేపాల్‌లో తెలంగాణ పర్వతారోహకుడి మృతి


రాఘవేంద్ర (ఫైల్)

భువనగిరి టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఎవరెస్ట్ బేస్ క్యాంప్ (ఈబీసీ) ట్రెక్కింగ్‌కు వెళ్లిన తెలంగాణ పర్వతారోహకుడు బలమూరు రాఘవేంద్ర అలియాస్ రాకేష్ (34) నేపాల్ రాజధాని కఠ్మాండులో శుక్రవారం మరణించాడు. ఈబీసీ నుంచి తిరుగు ప్రయాణంలో కఠ్మాండు చేరుకున్న తర్వాత గుండెపోటుకు గురై మృతి చెందాడు. వనపర్తి జిల్లా కొత్తకోటకు చెందిన రాఘవేంద్ర కొంత కాలంగా హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. భువనగిరి కేంద్రంగా పర్వతారోహణ రంగంలో పనిచేస్తున్న ట్రాన్సెండ్ అకాడమీ ఆఫ్ రాక్ క్లైంబింగ్ సంస్థలో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో 20 మందితో కలిసి 18 రోజుల క్రితం ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ట్రెక్కింగ్‌కు వెళ్లాడు. సముద్ర మట్టానికి 5,364 మీటర్ల ఎత్తులో ఉన్న బేస్ క్యాంపు యాత్ర పూర్తి చేసుకుని బృందంతో కలిసి తిరుగు ప్రయాణమైన రాఘవేంద్ర కఠ్మాండు చేరుకున్న కాసేపటికే ప్రాణాలు కోల్పోయాడు.

రూ.కోటి కారు రూ.20 లక్షలకే!

- ప్రభుత్వ ఉద్యోగాలూ ఇప్పిస్తానంటూ యువకుడి మోసం

బేగంపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సీఎంవోలో ఉద్యోగిని అంటూ డబ్బులు వసూలు చేసి పలువురిని నిండా ముంచాడో వ్యక్తి. అతడిపై 16 పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం అతడి కోసం బేగంపేట పోలీసులు గాలిస్తున్నారు. బేగంపేటలోని శ్యామ్‌లాల్ బిల్డింగ్ ప్రాంతంలో నివసించే సతీశ్‌కు ఇటీవల తన సోదరుడి ద్వారా వనస్థలిపురానికి చెందిన ప్రవీణ్ పరిచయమయ్యాడు. తాను సీఎంవోలో పనిచేస్తానంటూ తన వద్ద ఉన్న గుర్తింపు కార్డును చూపించాడు. "ఎవరైనా తెలిసిన వారుంటే చెప్పండి. వారికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తాను. మీ వద్ద కార్లు ఉంటే ప్రొటోకాల్ విభాగంలో పెట్టిస్తాను. నెలకు రూ.50వేలకు పైగా అద్దె వస్తుంది" అని చెప్పాడు. అలాగే రూ.2.5లక్షల ఐఫోన్‌ను రూ.50వేలకే ఇప్పిస్తాననీ చెప్పాడు. పూర్తిగా నమ్మిన సతీశ్.. తనకు 4 ఐఫోన్లు కావాలంటూ ప్రవీణ్‌కు రూ.2లక్షలిచ్చాడు. మరోమారు సతీశ్‌ను ప్రవీణ్ కలిసి.. ఢిల్లీకి చెందిన ఓ కారు తన వద్ద ఉందని, సుమారు కోటి ఖరీదు చేస్తుందని, తెలిసిన వారుంటే రూ.20 లక్షలకు ఇస్తానని చెప్పడంతో ఆ మొత్తాన్ని సతీశ్ అతడికి చెల్లించాడు. చివరికి తాను మోసపోయినట్లుగా తెలుసుకున్న సతీశ్ ఇటీవల బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రవీణ్ కొన్నేళ్లుగా ఇదే తరహాలో మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

కన్నవారిని ఇంట్లోంచి గెంటేసి తాళం

- వృద్ధులైన తల్లిదండ్రులపై కుమారుడి దాష్టీకం


ఇంటి బయట దీనంగా కూర్చున్న వృద్ధ దంపతులు

భిక్కనూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నలుగురు కుమారులకు సమానంగా భూమి పంచి ఇచ్చిన ఆ తల్లిదండ్రులు కొంత భూమిని తమ పేరిటే ఉంచుకున్నారు. ఆ భూమిపైనా కన్నేసి.. ఆ వృద్ధ దంపతులను వేధించుకుతిన్నాడో కుమారుడు! భూమి ఇచ్చేది లేదని దంపతులు చెప్పడంతో వారి బట్టలు, వంట పాత్రలు, ఇతర సామగ్రిని బయటకు విసిరికొట్టి.. వారిని ఇంట్లోంచి గెంటేసి తాళం వేశాడు! కామారెడ్డి జిల్లాలో ఈ ఘటన జరిగింది. భిక్కనూరు మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన మర్రి బాగవ్వ-రాములు దంపతులకు నలుగురు కుమారులు. వీరికి ఊర్లో 5.04 ఎకరాల భూమి ఉంది. గతంలోనే నలుగురు కుమారులకు ఎకరం చొప్పున పట్టాచేసి ఇచ్చి.. మిగతా 1.04 ఎకరాలను తమ పేరిటే ఉంచుకున్నారు ఆ వృద్ధ దంపతులు. భార్యతో కలిసి నిజామాబాద్‌లో ఉంటున్న మూడో కుమారుడు చంద్రం, నెల క్రితం ఇంటికొచ్చాడు. మిగతా భూమినీ పంచాలని, తన వాటాగా వచ్చిన భూమిని విక్రయించి అప్పులు కట్టుకుంటానని తల్లిదండ్రులను వేధిస్తున్నాడు. తాము బతికున్నంత కాలం ఎవరికీ ఆ భూమిని పంచబోమని వారు చెప్పగా గొడవపడి.. వృద్ధ దంపతులను ఇంట్లోంచి బయటకు గెంటేసి, తాళం వేశాడు. చంద్రం తీరుపై వృద్ధ దంపతులు శనివారం ఏఎస్పీ చైతన్యరెడ్డికి ఫిర్యాదు చేశారు. అలాగే, భిక్కనూరు పోలీసుస్టేషన్‌లో వృద్ధ దంపతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చంద్రం అతడి భార్య సునీతతో పాటు భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నించినమరోవ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సెప్టెంబరులో ఐఐటీహెచ్‌లో హ్యాకథాన్ పోటీలు

కంది, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ బ్యాంకుల ఆధ్వర్యంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో కేంద్ర ఆర్థిక సేవల విభాగం సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ-హైదరాబాద్‌లో సెప్టెంబర్ 2, 3 తేదీల్లో ఫిన్‌షీల్డ్ హ్యాకథాన్ సీరీస్-2025 పోటీలు నిర్వహిస్తోంది. ఈ మేరకు ఐఐటీహెచ్ అధికారులు శనివారం ఒక ప్రకటనను విడుదల చేశారు. మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్‌లో మోసాలను అరికట్టడం, బ్యాంకింగ్ రంగంలో సైబర్ సెక్యూరిటీ సవాళ్లను పరిష్కరించడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీల్లో దేశంలో ఉన్న విశ్వవిద్యాలయాలు, కళాశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని అధికారులు పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన బృందాలకు రూ.20 లక్షల విలువైన బహుమతులు అందజేస్తామని అధికారులు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనేందుకు జూన్ 24 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, వివరాలకు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని అధికారులు తెలిపారు.

రాఫెల్ ఫ్యూజ్‌లాజ్‌ల తయారీ హైదరాబాద్‌లో

- దసో ఏవియేషన్, టీఏఎస్ఎల్ మధ్య కీలక ఒప్పందం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాఫెల్ యుద్ధవిమానాల్లో ప్రధాన భాగమైన ఫ్యూజ్‌లాజ్(విమానం మధ్య భాగం) హైదరాబాద్‌లో తయారు చేయనున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఫ్రాన్స్‌కు చెందిన, రాఫెల్ యుద్ధ విమానాలు తయారు చేసే దసో ఏవియేషన్‌కు, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్(టీఏఎస్ఎల్)కు మధ్య ఒప్పందం కుదరిందన్నారు. రాఫెల్ ఫ్యూజ్‌లాజ్‌ను ఫ్రాన్స్‌లో కాకుండా బయటిదేశాల్లో తయారు చేయనుండటం ఇదే తొలిసారని ఆయన శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2027-28లో హైదరాబాద్‌లో రాఫెల్ ఫ్యూజ్‌లాజ్‌ల ఉత్పత్తి ప్రారంభమవుతుందని భావిస్తున్నారు. రాఫెల్ ఫ్యూజ్‌లాజ్‌ల తయారీ కేంద్రాన్ని హైదరాబాద్‌లో ప్రారంభిస్తే తెలంగాణలో విమాన తయారీ పరిశ్రమ విస్తరిస్తుందని కిషన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. దేశీయ సంస్థలు అత్యాధునిక సాంకేతికతను, తయారీ సామర్థ్యాన్ని పెంపొందించుకునేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. కాగా, కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వ హయాంలో భారత రక్షణ ఎగుమతులు వేగంగా పెరిగాయని కిషన్‌రెడ్డి చెప్పారు. 2013-14లో రూ.686కోట్ల నుంచి 2024-25 నాటికి రూ.23,622 కోట్లకు చేరి, 80కి పైగా దేశాలకు మన రక్షణ ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయని వివరించారు.

అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

- కామారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో ఘటనలు

రాజంపేట, కేశంపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అప్పులు తెచ్చి పంటలు సాగు చేయగా సరైన దిగుబడి రాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలంలోని ఆర్గొండకు చెందిన రైతు జంగిటి పెంటయ్య (48).. పొలంలో బోరు వేయడంతో పాటు ఇద్దరు కుమార్తెల పెళ్లిళ్ల కోసం, మొక్కజొన్న పంట వేసేందుకు అప్పులు చేశాడు. అయితే, పంట దిగుబడి రాకపోవడం, చేసిన అప్పులు రూ.6 లక్షలకు చేరడంతో వాటిని ఎలా తీర్చాలో తెలియక జీవితంపై విరక్తితో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే, రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేటకు చెందిన రైతు ఒట్టిల కుమార్(38) వ్యవసాయంతో పాటు నాలుగు పాడి ఆవులను తెచ్చుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆవులు చనిపోవడంతో చేసిన అప్పులు తీర్చే మార్గం లేక పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు.

ఒరిజినల్ ఆధార్ లేదని సాట్ పరీక్షకు నో

- కోకాపేట రాక్‌వెల్ స్కూల్ నిర్వాహకుల నిర్వాకం
- ఆరుగురు అభ్యర్థులకు అనుమతి నిరాకరణ
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు

నార్సింగ్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అమెరికా, కెనడా, బ్రిటన్ తదితర దేశాల్లో గ్రాడ్యుయేషన్ కోర్సులు అభ్యసించడానికి నిర్వహించే స్కాలాస్టిక్ అసెస్‌మెంట్ టెస్టు (సాట్) రాయడానికి వెళ్లిన విద్యార్థినిని ఒరిజినల్ ఆధార్ కార్డు తేలేదని పరీక్షా కేంద్ర నిర్వాహకులు లోపలికి అనుమతించలేదు. కోకాపేటలో శనివారం ఈ ఘటన వెలుగు చూసింది. నిర్వాహకుల తీరుపై బాధితురాలి తండ్రి.. తాను డయల్-100 నంబర్‌కు ఫోన్ చేసి, ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దిల్‌సుఖ్‌నగర్ వాసి (17)కి సాట్ పరీక్ష రాసేందుకు కోకాపేటలోని రాక్‌వెల్ స్కూల్‌లో సెంటర్ పడింది. తండ్రితో కలిసి పరీక్ష రాసేందుకు వెళ్లిన సదరు విద్యార్థిని తన వెంట ఒరిజినల్ ఆధార్ కార్డు కాకుండా డూప్లికేట్ కార్డు తెచ్చినందుకు ఆమెకు పరీక్షా కేంద్రంలో అనుమతి నిరాకరించారు. మరో ఆరుగురు విద్యార్థులనూ లోపలికి అనుమతించలేదు. ఆధార్ కార్డుపై నంబర్, క్యూఆర్ కోడ్ ఉన్నా, కేవలం ఒరిజినల్ కాదన్న సాకుతో పరీక్ష రాయనివ్వ లేదని బాధితురాలు తీవ్ర ఆవేదనతో చేసిన పోస్టు సోషల్ మీడియాలో వైరలైంది. కొన్ని రోజులుగా సాట్ పరీక్ష కోసం పడిన కష్టమంతా వృథా అయిందని బాధితురాలు వాపోయారు. పరీక్షా కేంద్రం నిర్వాహకుల తీరు దారుణమని బాలిక తండ్రి ఆరోపించారు.

స్వగృహ ఫ్లాట్లు.. హౌసింగ్ ప్లాట్లు..

వేలానికి సర్కారు పచ్చజెండా

దశలవారీగా విక్రయానికి మంత్రివర్గ ఉప సంఘం ఆమోదం.. ఈ నెల 20నాటికి నోటిఫికేషన్లు

- 4 వేల కోట్లకుపైగా ఆదాయం వచ్చే చాన్స్

హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహనిర్మాణ శాఖకు అనుబంధంగా ఉన్న రాజీవ్ స్వగృహ కార్పొరేషన్, హౌసింగ్ బోర్డుల పరిధిలోని ఆస్తుల వేలానికి సర్కారు పచ్చజెండా ఊపింది. రాజీవ్ స్వగృహ టవర్లలోని ఫ్లాట్లు, ఓపెన్ ప్లాట్లతో పాటు హౌసింగ్‌బోర్డు పరిధిలోని ఓపెన్ ప్లాట్లను, ఖాళీ స్థలాలను విక్రయించనుంది. దీనిపై గృహనిర్మాణ శాఖ చేసిన ప్రతిపాదనలకు వనరుల సమీకరణ కోసం ఏర్పాటైన క్యాబినేట్ సబ్‌కమిటీ ఆమోదం తెలిపింది. ఈ ఆస్తుల వేలానికి సంబంధించి ఈ నెల (జూన్) 20 నాటికి నోటిఫికేషన్లు విడుదల చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. రాజీవ్ స్వగృహ పరిధిలోని ఆస్తుల వేలంతో సుమారు రూ.3,538 కోట్లు, హౌసింగ్ బోర్డు పరిధిలోని ఆస్తుల వేలంతో సుమారు రూ.600కోట్లు కలిపి.. రూ.4 వేల కోట్లకుపైగా ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ ఆదాయంతో.. ఔటర్ రింగ్ రోడ్డు పరిసరాలు, ఇతర జిల్లాల్లో సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండే హౌజింగ్ పథకాలను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రాంతాన్ని బట్టి కనీస ధర నిర్ణయం

రాజీవ్ స్వగృహ పరిధిలో పోచారం, బండ్లగూడ, గాజులరామారం ప్రాంతాల్లో పూర్తయిన, అసంపూర్తిగా ఉన్న టవర్లు, వాటిల్లోని ఫ్లాట్లకు ప్రాంతాన్ని బట్టి అధికారులు కనీస ధరలను ఖరారు చేశారు. బండ్లగూడలో పూర్తయినఅపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్లకు చదరపు అడుగు రూ.3వేలు, అసంపూర్తిగా ఉన్న వాటికి రూ.2,750చొప్పున ధర నిర్ణయించారు. పోచారంలో పూర్తయిన ఫ్లాట్లకు రూ.2,750, అసంపూర్తి వాటికి రూ.2,250 చొప్పున ధర ఖరారు చేశారు.


పోచారంలోని సద్భావన టౌన్‌షిప్

వేలం వేయనున్న ఆస్తులు ఇవే..

రాజీవ్ స్వగృహ, హౌసింగ్ బోర్డు ఆస్తులను ఒకే సారి కాకుండా దశలవారీగా వేలం వేయాలని నిర్ణయించారు. మొదటి విడతలో మేడ్చల్-మల్కాజ్‌గిరి, ఖమ్మం జిల్లాలతోపాటు మరో 9 ప్రాంతాల్లో కలిపి 11 చోట్ల ఉన్న ఆస్తులను వేలం వేయనున్నారు. ఈ ఆస్తుల వేలంతో సుమారు రూ.900 కోట్ల వరకు ఆదాయం రావొచ్చని అంచనా.

- మేడ్చల్ జిల్లా పరిధిలోని పోచారం (సద్భావన టౌన్‌షిప్)లో 601 ఫ్లాట్లున్నాయి. ఇదే జిల్లా పరిధిలోని గాజులరామారంలో 5 టవర్లు, పోచారంలో 6, ఖమ్మంలో పోలేపల్లి దగ్గర అసంపూర్తిగా ఉన్న 8 టవర్లతోపాటు 3.38 ఎకరాల ఖాళీ స్థలాన్ని వేలం వేయనున్నారు.
- మేడ్చల్ పరిధిలోని బండ్లగూడ (సహభావన టౌన్‌షిప్)లో 159 ఫ్లాట్లు ఉన్నాయి. వీటిలో 3బీహెచ్‌కే డీలక్స్ ఫ్లాట్లు 3, 3బీహెచ్‌కే 8, 2బీహెచ్‌కే19, 1బీహెచ్‌కే ఫ్లాట్లు 129 ఉన్నాయి.
- రంగారెడ్డి జిల్లాలోని కుర్మలగూడలో 20, చందానగర్‌లో 3, తొర్రూరులో 514, మహబూబ్‌నగర్ జిల్లాలోని పోతులమడుగులో 111, అమిస్తాపూర్‌లో 45, బహదూర్‌పల్లిలో 69ప్లాట్లు ఉన్నాయి.
- హౌసింగ్ బోర్డు పరిధిలో కేపీహెచ్‌బీ-4వ ఫేజ్‌లో 7.33 ఎకరాల్లో ఉన్న ఖాళీ భూములు, అదే కాలనీలో ఉన్న రెండు ఓపెన్ ప్లాట్లు (ఒకటి 4,598 చ.గ, రెండోది 2,420 చ.గ).. నాంపల్లిలో ఉన్న 1,148 చదరపు అడుగుల ఖాళీ స్థలం వేలం వేయనున్నారు.

ఆస్తుల కొనుగోలుకు మంచి అవకాశం

రాజీవ్ స్వగృహ కార్పొరేషన్, హౌసింగ్ బోర్డు పరిధిలోని ఆస్తుల వేలానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని హౌసింగ్ బోర్డు కమిషనర్ వీపీ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. వివాదాలు లేని భూములు, అందుబాటులో ఉండే ధరలతో నిర్మించిన అపార్ట్‌మెంట్లు, ఫ్లాట్లను కొనుగోలు చేసుకునేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు.

కేపీహెచ్‌బీ-7లో 11న ప్లాట్ల వేలం

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి హౌజింగ్ బోర్డు (కేపీహెచ్‌బీ) ఏడో ఫేజ్‌లోని 17 ప్లాట్లను ఈ నెల 11న బహిరంగ వేలం వేయనున్నారు. ఇందులో 13 వాణిజ్య, నాలుగు నివాస కేటగిరీ ప్లాట్లు ఉన్నాయి. నివాస కేటగిరీకి చదరపు గజానికి రూ.1.25 లక్షలు, వాణిజ్య కేటగిరీకి చదరపు గజం రూ.1.50 లక్షలు కనీస ధరగా నిర్ణయించారు. నివాస కేటగిరీ ప్లాట్ విస్తీర్ణం 194.44 చదరపు గజాలుకాగా.. వాణిజ్య ప్లాట్ల విస్తీర్ణం 151.92 చదరపు గజాల నుంచి 978.92 చ.గజాల వరకు ఉన్నాయి.



ఖరీఫ్‌కు యూరియా కొరత!

- ఈ సారి 9.8లక్షల టన్నుల అవసరం
- అందుబాటులో 3.78 లక్షల టన్నులే
- మిగతా ఎరువుల సరఫరా.. అంతంతే
- సరిపడా ఇవ్వాలని కేంద్రానికి తుమ్మల లేఖలు

హైదరాబాద్, జూన్ 7(ఆంధ్రజజ్యోతి): వానాకాలం (ఖరీఫ్) పంటల సీజన్ వచ్చేస్తోంది. రాష్ట్రంలో మాత్రం యూరియా సహా ఇతర ఎరువులకు తీవ్ర కొరత నెలకొంది. రాష్ట్రానికి కోటా మేరకు ఎరువులను కేంద్రం సరఫరా చేయకపోవడం వల్లే ఈ సమస్య నెలకొంది. ఏప్రిల్, మే నెలల్లో చేసిన ఎరువుల సరఫరాలోనూ కేంద్రం కోత విధించింది. ఫలితంగా ఖరీఫ్ సమీపిస్తుండటంతో ప్రధానంగా యూరియా విషయంలో ఆందోళన నెలకొంది. వాస్తవానికి ప్రస్తుత వానాకాలం సీజన్ కోసం 9.8 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం. ఇంతే నిల్వను కేంద్రం కేటాయించింది. అయితే ఏప్రిల్‌లో సరఫరా చేయాల్సిన 1.7లక్షల టన్నుల్లో 1.22లక్షల టన్నులు, మే నెలలో రావాల్సిన 1.6లక్షల టన్నుల్లో.. కేవలం 94 వేల టన్నులనే సరఫరా చేసింది. ఈ మేరకు రాష్ట్రానికి సరఫరా చేసింది 2.08 లక్షల టన్నుల యూరియానే. నిరుడు ఇదే సమయానికి రాష్ట్రంలో 5.5లక్షల టన్నుల యూరియా అందుబాటులో ఉండగా.. ప్రస్తుతం 3.78లక్షల టన్నులు మాత్రమే అందుబాటులో ఉంది. అంటే దాదాపు 1.72లక్షల టన్నుల యూరియా తక్కువగా ఉంది. ఇప్పటికే 0.58లక్షల టన్నుల యూరియా విక్రయాలు జరిగాయి. ఇంకా 6.02 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని గణాంకాలు చెబుతున్నాయి. డీఏపీ 2.40లక్షల టన్నులు అవసరం ఉండగా, ఇప్పటివరకు 0.90 లక్షల టన్నులే అందుబాటులో ఉంది. ఇందులో 0.21 లక్షల టన్నులు ఇప్పటివరకు అమ్ముడైంది. గణాంకాల ప్రకారం డీఏపీకి 1.50 లక్షల మెట్రిక్ టన్నులు కొరత ఉంది. కాంప్లెక్స్ ఎరువులు 10లక్షల టన్నులు అవసరంకాగా, కేవలం 3.61 లక్షల మెట్రిక్ టన్నులే అందుబాటులో ఉన్నాయి.. మరో 6.39 లక్షల టన్నులు కావాల్సి ఉంది. రాష్ట్రంలో ఎరువుల కొరతకు కేంద్రమే కారణమని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. వానాకాలం సీజన్‌కు కేటాయించిన ఎరువులను.. కోటా మేరకు పంపడంలేదని, ఇది వ్యవసాయ అవసరాలకు సరిపోదని తెలుపుతూ కోటా ప్రకారం రాష్ట్రానికి ఎరువులను పంపాలని కోరుతూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి లేఖలు రాస్తున్నారు. అయినప్పటికీ కేంద్రం గడిచిన రెండు నెలలుగా పంపిన ఎరువుల సరఫరాలో కోత విధించడం గమనార్హం.

పడుకున్నోడు పడుకున్నట్టే

సజీవదహనం!

- అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి
- ఇంట్లోంచి పొగలు.. కాసేపటికే ఇల్లు దగ్ధం
- ఆ సమయంలో ఇంట్లో లేని తల్లిదండ్రులు
- జగద్గిరిగుట్టలో ఘటన.. అనుమానాల్లేవన్న తల్లిదండ్రులు


సాయికుమార్ (ఫైల్)

జీడిమెట్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఒంటికి మంటలంటుకొన్నా, లేదా నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నా ఏమాత్రం కదలకుండా మంచ మీద పడుకున్నవాడు పడుకున్నట్టే చనిపోతాడా? జగద్గిరిగుట్టలో ఓ యువకుడు ఇలానే అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మృతుడు 27 ఏళ్ల సాయికుమార్. షాట్‌సర్క్యూట్ కారణంగా మంటలంటుకోవడంతోనే తమ కుమారుడు మృతిచెందాడని కుటుంబసభ్యులు చెబుతుండగా స్థానికులు మాత్రం ఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సీఐ నర్సింహ వెల్లడించిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట మగ్దూంనగర్‌కు చెందిన గజ్జి ఉపేందర్, ధనలక్ష్మి భార్యభర్తలు. వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సాయికుమార్(27) ఉన్నారు. కుమార్తెలకు పెళ్లిళ్లయ్యాయి. ఉపేందర్ స్థానికంగా రేషన్ డీలర్‌గా పనిచేస్తున్నాడు. సాయికుమార్ ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం ఉదయం 9గంటలకు ధనలక్ష్మి సమీపంలోని శివాలయానికి వెళ్లింది. ఉపేందర్ కూడా బయటకు వెళ్లాడు. ఇంట్లో సాయికుమార్ ఒక్కడే ఉన్నాడు. కొద్దిసేపటికి.. సాయికుమార్ గదిలోంచి దట్టంగా పొగలొచ్చాయి. ఆ వెంటనే మంటలు చెలరేగాయి. ఎదురుగా ఉన్న కిరాణాషాపు వారు గుర్తించి స్థానికుల సాయంతో ఫైర్‌సిబ్బందికి, పోలీసులకు సమాచార మిచ్చారు. ఫైర్‌సిబ్బంది, పోలీసులు అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. లోపలికి వెళ్లి చూడగా సాయికుమార్ మంచమ్మీద పడుకున్న స్థితిలోనే సజీవదహనమై కనిపించాడు. కొద్దిసేపటికి ఇంటికొచ్చిన ధనలక్ష్మి, ఉపేందర్.. ఇల్లు తగలబడిపోవడాన్ని చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. కుమారుడి మృతదేహం వద్ద భోరున విలపించారు. క్లూస్‌టీం అక్కడికి చేరుకొని.. పూర్తిగా కాలిపోయిన చార్జర్, పేలకుండా ఉండిపోయిన సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు.. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాలానగర్ ఏసీపీ పి.నరేశ్ రెడ్డి ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ఇంటికి ఎదురుగా ఉన్న సీసీ ఫుటేజీను పరిశీలించారు. సాయికుమార్ మృతికి గల కారణాలను పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత వెల్లడించగలమని చెప్పారు.

ఏపీ లిక్కర్ సొమ్ము విదేశాలకు!

షెల్ కంపెనీల ద్వారా భారీగా మళ్లింపు.. ముంబై కేంద్రంగా వ్యవహారం

- కీలక రూటింగ్ గుర్తించిన సీఐడీ బృందం
- గోవిందప్ప బినామీ బ్యాంక్ ఖాతా నుంచి షెల్ కంపెనీలకు మళ్లింపు
- బ్యాంకుల కేంద్ర కార్యాలయాల్లో గుర్తింపు

అమరావతి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భారీ మద్యం కుంభకోణంలో సిట్ అధికారులు అత్యంత కీలక సమాచారం సేకరించారు. దోచుకున్న వేల కోట్లలో పెద్ద మొత్తం షెల్ కంపెనీలకు మళ్లించినట్టు గుర్తించారు. వాటి ద్వారా విదేశాలకు పంపినట్టు తాజాగా విచారణలో తేలింది. ఈ తతంగమంతా ముంబై కేంద్రంగా జరిగినట్లు కనుగొన్నారు. అత్యాధునిక టెక్నాలజీ వినియోగించి కీలక రూటింగ్ గుర్తించారు. డీఐజీ ర్యాంకు అధికారి నేతృత్వంలో వారం రోజుల క్రితం ముంబైకి వెళ్లిన పది మంది సీఐడీ అధికారుల బృందం షెల్ కంపెనీలకు సంబంధించిన అత్యంత కీలక సమాచారాన్ని గుర్తించింది. హైదరాబాద్‌లో మద్యం వ్యాపారుల నుంచి వసూలు చేసిన నగదు ముంబైకి ఎలా చేరింది? అక్కడి నుంచి బంగారం కొన్నదెంత? అంతిమంగా షెల్ కంపెనీల ద్వారా విదేశాలకు తరలించిన సొమ్ము ఎంత? అనే సమాచారాన్ని కనుగొన్నట్లు తెలిసింది.

కీలక ఆధారాల సేకరణ

జగన్ పాలనలో జరిగిన మూడున్నర వేల కోట్ల లిక్కర్ స్కామ్‌లో ఎందరో సూత్రధారులు, పాత్రధారులు ఇప్పటికే వెలుగులోకి వచ్చారు. అయితే అంతిమ లబ్ధిదారు ఎవరో తెలిసినా ఆయనకు డబ్బులు చేరినట్లు ఆధారాలు సేకరించడంలో సిట్ అధికారులు ప్రయాస పడ్డారు. సుమారు 200 మందిని విచారించి కీలక నిందితుల్ని అరెస్టు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో మద్యం వ్యాపారాన్ని నియంత్రించే ఉద్దేశంతో ఏర్పాటైన సిండికేట్‌లో కీలక సభ్యుడైన బాలాజీ గోవిందప్ప, రాజ్ కసిరెడ్డి ముఖ్య అనుచరుడు చాణక్య ఇచ్చిన సమాచారం, వారి బ్యాంకు లావాదేవీల ఆధారంగా ముంబైలో పెద్ద వ్యవహారమే నడిచినట్లు పసిగట్టారు. అన్ని అంశాలనూ క్రోడీకరించి పోలీస్ బాస్‌కు వివరించారు. సిట్ అధికారులు ఇచ్చిన ఈ కీలక సమాచారం ఆధారంగా.. ఐదు రోజుల క్రితం సీఐడీ డీఐజీ పక్కీరప్ప కాగినెల్లి నేతృత్వంలో పది మంది అధికారుల బృందాన్ని ముంబైకి పంపారు. అక్కడ పలు బ్యాంకుల కేంద్ర కార్యాలయాలకు వెళ్లి షెల్ కంపెనీల లావాదేవీలను పరిశీలించింది. రెండు షెల్ కంపెనీలకు సంబంధించిన వ్యవహారాల్లో గోవిందప్ప బాగోతం బయటికొచ్చింది. స్వతహాగా ఆడిటర్ అయిన గోవిందప్ప చాలా ఏళ్లుగా లెక్కల గోల్‌మాల్‌లో ఆరితేరినట్లు తెలుసుకున్న దర్యాప్తు బృందం అక్కడి ఆడిటర్లతో పాటు ఆదాయపు పన్ను అధికారుల సహకారం తీసుకుంది. పలు షెల్ కంపెనీల ద్వారా భారీ మొత్తం దేశం దాటి వెళ్లినట్లు కీలక ఆధారాలు సేకరించింది. మొత్తం ఐదు దశల్లో.. అంటే ఏ నుంచి బీకి.. బీ నుంచి సీకి.. ఇలా ఐదు కంపెనీలు దాటిన తర్వాత ఆరో షెల్ కంపెనీ ఎఫ్ నుంచి దేశం దాటినట్లు తేలింది. మరో నాలుగైదు రోజుల పాటు అక్కడే ఉండి మరింత కీలక సమాచారాన్ని తీసుకు వస్తామని సీఐడీ బృందం పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చింది.

మాన్షన్ హౌస్.. బంగారు బాతు

ముంబైలో 'మాన్షన్ హౌస్' యాజమాన్యం ఇచ్చిన ముడుపులు బంగారు బాతు గుడ్డేనని దర్యాప్తు సంస్థ నిర్ధారణకు వచ్చింది. తెలుగు రాష్ట్రాల్లో ఈ లిక్కర్ బ్రాండ్‌కు ఎక్కువ సేల్స్ ఉంది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ బ్రాండ్ మద్యాన్ని ఏపీలో సరఫరా చేసే ఎంఎస్ బయోటెక్ కంపెనీ యజమాని జయపాల్ రెడ్డిపై లిక్కర్ మాఫియా కమీషన్ల కోసం ఒత్తిడి తెచ్చింది. ఆయన స్పందించక పోవడంతో ఆ బ్రాండ్ లిక్కర్ ఆర్డర్లను ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా బ్లాక్ చేయించారు. చివరకు ఆయన దారికి రావడంతో బేసిక్ ధరలో 20 శాతం ముడుపులు ప్రతి వారం చెల్లించాల్సిందిగా రహస్య ఒప్పందం చేసుకున్నారు. . అయితే నగదు కాకుండా బంగారం రూపంలో ఇవ్వాలని అడగడంతో ముంబైలో పేరున్న బంగారం షాపులకు ముడుపుల డబ్బులు మళ్లించి బంగారం బిస్కెట్లు తీసుకున్నారు. భారతీ సిమెంట్స్‌లో శాశ్వత డైరెక్టర్ అయిన బాలాజీ గోవిందప్ప ఒక కీలక మహిళకు అత్యంత నమ్మకస్తుడు. నగదు తీసుకున్నా దాచుకోవడం కష్టమని.. బంగారం అయితే ఏటా విలువ పెరుగుతుందని ఆయన చేసిన సూచనతోనే ఈ బాగోతం నడిచినట్లు సీఐడీ అధికారులు భావిస్తున్నారు. జగన్ హయాంలో 1400 కోట్ల రూపాయల విలువైన మద్యం సరఫరా చేసిన మాన్షన్ హౌస్ 20 శాతం కమీషన్ అంటే... 280 కోట్ల రూపాయల విలువ చేసే బంగారం గనినే అప్పగించినట్లు తెలుస్తోంది.


సొమ్ము షెల్ కంపెనీలకు..

లిక్కర్ స్కామ్‌లో సిట్ అధికారులు సుమారు 196.5 కోట్ల రూపాయల బంగారం షాపుల లావాదేవీలు గుర్తించారు. అందులో పద్మావతి జ్యువలరీ షాప్‌కు 107 కోట్లు, తాయాల్ ఎంటర్ ప్రైజెస్‌కు 85 కోట్లు, సోనా చాంది జ్యుయలర్స్‌కు 3.5 కోట్లు, ఉదయ్ జ్యుయలరీ ఇండస్ట్రీస్‌కు సుమారు కోటి రూపాయల వరకు చెల్లించి బంగారం కొన్నట్టు తేల్చారు. రాజ్ కసిరెడ్డి ముఖ్య అనుచరుడైన చాణక్య వ్యవహారాలు నడిపినట్లు అధికారులు గుర్తించారు. తాజాగా డీఐజీ నేతృత్వంలోని బృందం మరింత లోతుగా కూపీ లాగి మనీలాండరింగ్ వ్యవహారాలు, షెల్ కంపెనీల లావాదేవీలు పసిగట్టినట్లు సమాచారం. ఇందులో డికార్ట్ లాజిస్టిక్స్ యజమాని ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డి పేరుతో ఏర్పాటైన టెక్కర్ ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ ద్వారా డొల్ల కంపెనీలకు ముడుపులు చేరినట్లు ఆధారాలు లభించాయి. శాన్‌హోర్డ్ ల్యాబ్స్ 30 కోట్లు, ఎస్‌పీవై ఆగ్రోస్ 15.6 కోట్లు, శాంజ్ ఫీడ్ టెక్నాలజీస్ 6.4 కోట్లు షెల్ కంపెనీలకు మళ్లించాయి. వాటితో పాటు టెక్కర్, అర్రామ్, ఈజీలోడ్ అనే డొల్ల కంపెనీలు కూడా లావాదేవీలు జరిపినట్లు తేలింది.

ఆ ఐదుగురు చిన్నారులకు ఏమైంది?

- కుటుంబంలోని ఐదుగురు చిన్నారులకు ఒకేసారి అస్వస్థత.. ఒకరి మృతి
- తల్లిదండ్రుల సొంత వైద్యం వికటించిందా? అని అనుమానాలు

అల్లాదుర్గం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఏమైందో.. ఎలా జరిగిందో సరైన కారణం తెలియదు కానీ.. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు పిల్లలు ఒకేసారి అస్వస్థతకు గురికాగా...వారిలో ఓ చిన్నారి కన్నుమూసింది. మెదక్ జిల్లా అల్లాదుర్గంలో శనివారం ఈ ఘటన జరగ్గా.. అసలు ఆ చిన్నారులకు ఏమైంది? అనేది చర్చనీయాంశమైంది. స్థానికులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. అల్లాదుర్గంలోని బుడగజంగంకాలనీకి చెందిన సిద్దయ్య, సాయమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఐశ్వర్య, రేణుక, ప్రియ(5), ఇద్దరు కొడుకులు శ్రీను, గణేష్ ఉన్నారు. పిల్లలంతా పదేళ్ల లోపు వారే. నెల క్రితం పిల్లలంతా అనారోగ్యానికి గురి కావడంతో తల్లిదండ్రులు స్థానిక పీహెచ్‌సీలో చికిత్స చేయించారు. తాజాగా ఈనెల 3న ప్రియ, ఐశ్వర్య వాంతులు, విరేచనాలతో మిగిలిన పిల్లలు దగ్గు, జలుబుతో బాధపడ్డారు. ఇక, శుక్రవారం రాత్రి పిల్లలంతా అస్వస్థతకు గురికావడంతో.. నెల క్రితం పీహెచ్‌సీలో ఇచ్చిన మందులనే తల్లిదండ్రులు పిల్లలకు ఇచ్చారు. అయితే, శనివారం ఉదయానికి పిల్లలంతా అపస్మారక స్థితిలో ఉండగా వారిలో ప్రియ మాత్రం మరణించింది. మిగిలిన వారిని జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రేణుక, గణేష్ ప్రస్తుతం కోలుకోగా.. శ్రీను, ఐశ్వర్యకు చికిత్స సాగుతోంది. సాయమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


పిల్లలకు వాడిన మందులను చూపిస్తున్న తల్లి సాయమ్మ

నవ్య ఆదివారం

కుటుంబ కదంబం



ముఖం మెరిపిద్దామిలా

అందం కనిపించాలని అందరూ కోరుకుంటారు. అయితే రసాయనాలు ఉండే సౌందర్యసాధనాలు వాడకుండా, ఇంట్లో ఉండే వాటితోనే సహజంగా ఫేస్ ప్యాక్ తయారు చేసుకుని ముఖం అందంగా మార్చుకోవచ్చు.

- ఒక గిన్నెలో నాలుగు చెంచాల శనగ పిండి, కొంచెం పసుపు, రోజ్ వాటర్ వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖం, మెడ అంతా ప్యాక్‌లా వేయాలి. అరగంట తరువాత నీళ్లతో కడిగేయాలి. ఈ ప్యాక్ చర్మం తేమను కోల్పోకుండా చేస్తుంది.
- పావు కప్పు బొప్పాయి గుజ్జులో ఒక చెంచా తేనే వేసి కలిపి ముఖంపై రాయాలి. 20 నిమిషాల తరువాత నీటితో కడగాలి. దీని వల్ల ముఖంపై మొటిమలు తగ్గుతాయి.
- అరకప్పు దోస ముక్కలను పేస్టులా చేసి అందులో చెంచా పెరుగు కలిపి ముఖం, మెడకు పట్టించి ఆరిపోయాక కడిగేసుకోవాలి. ఈ ప్యాక్‌తో చర్మం తేమను కోల్పోకుండా ఉంటుంది.
- ఒక పండిన అరటిపండును గుజ్జుల చేసి, అందులో ఒక చెంచా పాలు, చెంచా తేనె వేసి కలపాలి. దీనిని ముఖంపై రాస్తూ సున్నితంగా మర్దన చేయాలి. ఇరవై నిమిషాల తరువాత చల్లని నీళ్లతో కడిగేయాలి. దీని వల్ల చర్మంపై మురికి పోయి మెరుస్తుంది.
- రెండు టేబుల్ స్పూన్ల బార్లీ గింజల పొడిని ఓ గిన్నెలోకి తీసుకోవాలి. ఇందులో కొంచెం వేడి నీళ్లు పోసి ముద్దలా చేయాలి. దీనిని ముఖంపై రాసి పావు గంట తరువాత కడిగేయాలి. ఈ ప్యాక్ వల్ల చర్మంపై మృతకణాలు తొలగి ముఖం అందంగా మారుతుంది.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీల్లో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
రానా నాయుడు 2	తెలుగు సిరీస్	జూన్ 13
అమెజాన్ ప్రైమ్		
ది ట్రైటర్స్	హిందీ సిరీస్	జూన్ 12
జియో హాట్‌స్టార్		
శుభం	తెలుగు చిత్రం	జూన్ 14
ఆపిల్ టీవీ ప్లస్		
ఎకో వ్యాలీ	హాలీవుడ్ మూవీ	జూన్ 13
ఈటీవి విన్		
ఆ ఒక్కటీ అడక్కు	తెలుగు చిత్రం	జూన్ 12

నాతో నేనే పోటీపడతా

తెలంగాణ జానపద గీతాలకు ఇప్పుడు మంచి ఆదరణ లభిస్తోంది. పెద్ద హీరోలు కూడా ఫోక్ సాంగ్స్ అంటే ఆసక్తి చూపిస్తున్నారు. తెలంగాణ యాస, భాషలో పాటలు రాయడంలో ఇటీవలి కాలంలో బాగా వినిపిస్తున్న పేరు **కాసర్ల శ్యామ్**. ఇప్పటివరకూ 800కి పైగా పాటలు రాసిన శ్యామ్‌తో 'నవ్య' ముచ్చట్లు.



మీ పాటల ప్రయాణం ఎలా మొదలైంది?

మాది హన్మకొండ ప్రాంతం. నాన్న కాసర్ల మధుసూదనరావు రంగస్థల, సినీ నటులు. 'తల్లిదీవెన', 'చలిచీమలు', 'మంచికి స్థానం లేదు' వంటి దాదాపు 30 చిత్రాల్లో ఆయన నటించారు. నటుడు కావాలనే కోరిక నాకు కూడా చిన్నతనంలో ఉండేది. అయితే నటుడిగా నిలదొక్కుకోవాలంటే ప్రతిభతో పాటు గాడ్‌ఫాదర్ కూడా ఉండాలి. అలా కాకుండా క్రియేటివ్ సైడ్ వెళితే బాగుంటుందనిపించింది. నాన్న కూడా నాకు అదే మాట చెప్పారు. సుభాన్ అని పెద్ద వంశీ దగ్గర కో డైరెక్టర్‌గా చేసేవారు. ఆయన మా నాన్న స్నేహితుడు. ఆయన ద్వారా దర్శకత్వ శాఖలో చేరితే బాగుంటుందని కూడా అనుకొనేవాణ్ణి. కృష్ణవంశీగారు 'సిందూరం' తీస్తున్నప్పుడు ఆయనవద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరాలని, అవకాశం కల్పించమని చంద్రబోస్ గారిని అడిగాను. కుదరలేదు. ఆ తర్వాత హైదరాబాద్‌కు వచ్చి జానపదంలో ఎంఏ, ఎంఫిల్ చేశా. అప్పుడప్పుడు ప్రైవేట్ సాంగ్స్ రాసిన అనుభవం ఉండడంతో సినిమారంగంలో మిత్రులవల్ల అవకాశాలు వచ్చాయి.

కెరీర్‌పరంగా కష్టాలు, కన్నీళ్లు ఉన్నాయా?

హైదరాబాద్ వచ్చిన తర్వాత ఏడేళ్ల వరకూ సినిమా గురించి ఆలోచించలేదు. చదువు మీద దృష్టి పెట్టా. తర్వాత కొంత కాలం ఆకాశవాణిలో క్యాజువల్ అనౌన్సర్‌గా పని చేశా. అడపాదడపా కొన్ని సినిమా పాటలు రాశాను కానీ గీత రచయితగా కెరీర్ ప్రారంభించాలని సీరియస్‌గా అనుకోలేదు. అయితే 'మహాత్మా' చిత్రంలో నా చేత 'నీలపురి గాజులు' పాటను కృష్ణవంశీగారు రాయించడం, అది పాపులర్ కావడంతో రచయితగా ప్రయత్నాలు ముమ్మరం చేశాను.

ఆ పాట మిమ్మల్ని రచయితగా నిలబెట్టిందా?

నిజం చెప్పాలంటే అంత హిట్ పాట రాసినా ఏడాది వరకూ నాకు అవకాశాలు లేవంటే నమ్మండి. ఆ పాట రాసింది నేనే అన్న విషయం చాలా మందికి తెలిసేది కాదు. అయినా ఒక మంచి పాట రాశాను అనే ధైర్యంతో పరిశ్రమలో అందరినీ కలిసేవాణ్ణి. ఆ క్రమంలో మారుతిగారు పరిచయమయ్యారు. ఆయన అప్పటికి పరిశ్రమలోకి రాలేదు. యాడ్స్ చేస్తుండేవారు. వాటికి నేను పాటలు రాసేవాణ్ణి. ఒకసారి మాటల మధ్యలో 'నాకు నీలపురి గాజులు పాట అంటే ఇష్టం. అలాంటి పాటలు కావాలి' అన్నారు. ఆ పాట రాసింది నేనే అని చెప్పగానే ఆశ్చర్యపోయారు. అప్పుడు తను తీస్తున్న 'ఈరోజుల్లో' చిత్రంలో నాతో పాటలు రాయించారు. వరుసగా 15 సినిమాల్లో నాతో పాటలు రాయించి ప్రోత్సహించారు. అప్పటి నుంచి నా ఎదుగుదల మొదలైంది.

తెలంగాణ యాసలో పాట రాయాలంటే ఇప్పుడు మీ పేరే చెబుతారు. అది మీకు ప్లస్సా, మైనస్సా?

'నీ మీద ఒక ముద్ర పడకుండా చూసుకో..' అని తోటి రచయితలు, సీనియర్స్ మొదట్లో సలహా ఇచ్చారు. అన్ని పాటలూ రాయగల సత్తా నీకు ఉంది కనుక జానపద రచయితగా ముద్ర పడకుండా చూసుకో అని కూడా చెప్పారు. ఏదో లేదు అని ప్రయత్నాలు చేసే బదులు నా కంటూ ఒక ముద్ర వేసుకుని, ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్న తర్వాత అప్పుడు రకరకాల జానర్స్‌లో పాటలు రాస్తే బాగుంటుందని నాకు అనిపించింది. ముద్ర పడినా పర్వాలేదు అనే మొండి నమ్మకంతో ముందడుగు వేశాను.

మీ కెరీర్‌లో బాగా కష్టపెట్టిన పాట ఏమన్నా ఉందా?

ఆ సినిమాలు ఆడలేదు, పాటలకు అంత గుర్తింపు లేదు కానీ నన్ను నేను కష్టపెట్టుకున్న పాటలు రెండు ఉన్నాయి. శ్రీహరిగారి చివరి చిత్రం 'రియల్ స్టార్' వాటిల్లో ఒకటి. దానికి అంతకుముందు 'ఛాయ్ సమోసా బిస్కెట్' అనే టైటిల్ ఉండేది. అందులో ఇరానీ ఛాయ్ గురించి, హోటల్ గురించి ఓ పాట రాశాను. ఇకపై ఇరానీ ఛాయ్ గురించి ఎవరైనా పాట రాయాలంటే నా పాటను రిఫరెన్స్‌గా తీసుకోక తప్పదనే కసితో ఆ పాట రాశాను. అలాగే 'పేపర్ బాయ్' చిత్రంలో. ఇంతవరకూ ఏ రచయిత టచ్ చేయని పేపర్ బాయ్ లైఫ్ గురించి పాట రాశాను. ఇవి రెండూ నన్ను నేను బాగా కష్టపెట్టుకుని, రీసెర్చ్ చేసి రాసిన పాటలు. నాకు ఇష్టమైన పాటలు కూడా.

మీ ఫ్యామిలీ గురించి చెప్పండి



నా భార్య పేరు రాధిక. తను ఆర్కిటెక్ట్. నాకు ఇద్దరు పిల్లలు. పెద్దబ్బాయి అమెరికాలో ఎం.ఎస్. చేస్తున్నాడు. చిన్నబ్బాయి సెవెన్త్ క్లాస్. వాడు పాడతాడు. నాన్నగారి నట వారసత్వం వచ్చింది.. భోళా శంకర్, ఫ్యామిలీ స్టార్, డాకూ మహారాజ్ తదితర చిత్రాల్లో నటించాడు. ఇప్పుడు 'ప్యారడైజ్'లో చేస్తున్నాడు.

గీత రచయితల్లో మిమ్మల్ని విరాట్ కోహ్లితో పోలుస్తుంటారట. నిజమేనా?

(నవ్వు) 'భీష్మ' సమయంలో దర్శకుడు వెంకీ కుడుముల చివరి క్షణాల్లో పాట రాసి ఇవ్వాల్సిందే అని చెప్పారు. ముందు పల్లవి ఇస్తే దాన్ని షూట్ చేసుకుంటాం. తర్వాత చరణాలు ఇవ్వవచ్చు అన్నారు. 'ఇంత హడావుడి పెడితే పాట బాగా రాయలేను సార్.. అన్నా. 'మిమ్మల్ని ఎంత హడావుడి చేస్తే అంత బాగా రాస్తారు. మీరు విరాట్ కోహ్లీలాంటి వారు' అని ఆయన అన్నారు. అవునా అని నాలో నేనే మురిసిపోయి ఆ పాట రాశా. నిజంగానే ఆ పాట బాగా వచ్చింది. వెంకీ గారు నాకు ఇచ్చిన ముద్దు పేరు అది.

గీత రచయితల్లో మీరు అభిమానించేది ఎవరిని?

పాత తరం రచయితల్లో చాలా వైవిధ్యంగా కనిపించే ఆరుద్ర నాకు చాలా ఇష్టం. రచయిత అంటే ఇలాగే ఉండాలా అనిపించే ఆయన గెటప్ నన్ను ఆకర్షించింది. ఆ తర్వాత నేను అభిమానించే రచయిత చంద్రబోస్‌గారు. మా వరంగల్ జిల్లా నుంచి చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి, చిన్న వయసులోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న గీత రచయిత ఆయన. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చి సామాన్యులకు ఎలా చేరువ అయ్యారో, అలాగే సినిమా పాటను సామాన్యుల దగ్గరకు తీసుకువెళ్లిన రచయిత చంద్రబోస్. ఆయన పాటలు వింటుంటే పాట రాయడం ఇంత ఈజీనా అనిపించేది. కానీ రాయడం ఎంత కష్టమో నేను రచయితనయ్యాక తెలిసింది.

మీకు పోటీ ఎవరు?

కొత్తగా ఎలా ఆవిష్కరించుకోవాలా అని నాతో నేనే పోటీ పడుతుంటాను. సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ రాసిన పాటలు నా శైలికి చాలా దగ్గరగా ఉంటాయి. అవి వింటుంటే 'అరే ఇవి కదా నేను రాయాల్సినవి' అనుకుంటుంటాను. అందుకే ఆయన పాటల్ని పోటీగా తీసుకునేవాణ్ణి. మా గీత రచయితలందరి మధ్య మంచి స్నేహ సంబంధం ఉంది. నాకు ఏమన్నా సందేహం వస్తే చంద్రబోస్‌కు ఫోన్ చేసి అడుగుతుంటాను. సీతారామశాస్త్రి గారి చివరి రోజుల్లో ఆయనతో చాలా సన్నిహితంగా మెలిగేవాణ్ణి. 'రాములో రాముల' పాట విని ఆయన నన్ను ఎంతో అభినందించారు. 'ఇది నిజంగా శ్యామనామ సంవత్సరం రా' అని దీవించారు.

జీవితంలో మీరు మరచిపోలేని సంఘటన?

సీతారామశాస్త్రిగారితో నాది రుణానుబంధం అనుకుంటాను. పక్కా కమర్షియల్ సినిమాలో టైటిల్ సాంగ్ మొదట నాతో రాయించారు. అది ఓకే అయినా కూడా శాస్త్రిగారి పాట ఉంటే బాగుంటుందని నేను రాసిన పాట పక్కన పెట్టి ఆయనతో రాయించారు దర్శకనిర్మాతలు. పాట మిస్ అయిందే అనే భావన కలిగినా నా బదులు గురువుగారే కదా రాసింది అని సరిపెట్టుకున్నాను. ఆయన చివరి రోజుల్లో 'భీమ్లా నాయక్‌'లో గురువుగారు రాయాల్సిన పాట నేను రాయాల్సి వచ్చింది. ఆయన రుణం ఉంచుకోలేదు. తీర్చుకుని వెళ్లిపోయారు అనుకున్నా. ఇది నా జీవితంలో మరచిపోలేని సంఘటన.

హీరోల పరంగా మీకు వచ్చిన ప్రశంసలు ఏమిటి?

'రాజా ది గ్రేట్‌'లో 'ఎన్నియలో ఎన్నియలో' పాట రాశాను. అది విని రవితేజ నన్ను అభినందించారు. 'రాములో రాముల'ను అల్లు అర్జున్ గారు మెచ్చుకున్నారు. కల్యాణ్‌రామ్‌గారికి నేను రాసిన 'బంబాట్'పాట చాలా ఇష్టం. 'నా జీవిత కాలంలో సరిపోయే హిట్స్ అన్నీ 'దసరా'లో ఇచ్చాడు'.. అని నాని అన్న అభినందించారు. నిర్మాతల్లో స్రవంతి రవికిశోర్‌గారు, హారిక హాసిని చినబాబు గారు.. నాకు రెగ్యులర్‌గా ఫోన్ చేసి నా పాటలను అభినందిస్తుంటారు.

- వినాయకరావు

చిత్రజ్యోతి

SINCE 1965

అల్లు.. అట్లీ సినిమాలో దీపిక





అల్లు అర్జున్ కథానాయకుడిగా అట్లీ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. 'ఏఏ 22.. అట్లీ 6' అనేది వర్కింగ్ టైటిల్. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలోకి బాలీవుడ్ హీరోయిన్ దీపికా పదుకోన్‌ను ఆహ్వానిస్తూ మేకర్స్ 'ఫేసెస్ ఆఫ్ ఏఏ 22.. అట్లీ 6' పేరిట ఓ వీడియోను విడుదల చేశారు. ఇందులో దీపికకు అట్లీ స్క్రిప్ట్ వివరించడం.. ఆమెకు లుక్ టెస్ట్ చేయడం వంటివి చూపించారు. ఇందులో ఆమెది యాక్షన్‌కు అధిక ప్రాధాన్యమున్న శక్తిమంతమైన పాత్రని తెలుస్తోంది. ఈ సందర్భంగా దర్శకుడు అట్లీ మాట్లాడుతూ "దీపిక అద్భుతమైన నటి. సినిమాలో ఆమె పాత్ర ఎంతో కీలకంగా ఉండబోతోంది. ఈ చిత్రంతో ప్రేక్షకులకు మరిచిపోలేని ఓ గొప్ప సినిమాటిక్ అనుభూతిని అందివ్వబోతున్నాం" అని అన్నారు.

డబ్బింగ్ పూర్తి చేసిన నాగార్జున



నాగార్జున, ధనుష్ కథానాయకులుగా శేఖర్ కమ్ముల తెరకెక్కించిన చిత్రం కుబేర. ఈ నెల 20న పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతోంది. తాజాగా, ఈ సినిమాలో తన పాత్ర డబ్బింగ్‌ను పూర్తి చేశారు నాగార్జున. ఈ సందర్భంగా డబ్బింగ్ స్టూడియోలో నాగార్జున, దర్శకుడు శేఖర్ కమ్ముల, నిర్మాత పుష్కర్ రామ్మోహన్ కలసి మాట్లాడుకుంటున్న ఫొటోలను షేర్ చేశారు. రష్మిక కథానాయికగా నటించారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు.

ఈ రక్కసి క్రీడను ఆపాలంటే..



ఆది సాయికుమార్ హీరోగా యుగంధర్ ముని దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'శంబాల: ఎ మిస్టికల్ వరల్డ్'. షైనింగ్ పిక్చర్స్ బేనర్‌పై రాజశేఖర్ అన్నబీమోజు, మహిధర్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ఇటీవల మేక ర్స్ 'శంబాల' మేకింగ్ వీడియోని రిలీజ్ చేసి అంచనాలు పెంచేశారు. తాజాగా ఈ చిత్రం నుంచి టీజర్‌ని విడుదల చేశారు. 'ఈ విశ్వంలో అం తు పట్టని రహస్యాలెన్నో ఉన్నాయి. సైన్స్‌కి సమాధానం దొరకనప్పుడు మూఢ నమ్మకం అం టుంది.. అదే సమాధానం దొరికితే నమ్మకం అంటుంది. పంచభూతాలని శాసిస్తోందంటే ఇది సాధారణమైనది కాదు.. దీని ప్రభావం వల్ల మనం ఎలాంటి పరిస్థితుల్ని ఎదుర్కోవాల్సి వస్తుందో ఊహించలేం.. ఇప్పు డు ఈ రక్కసి క్రీడను ఆపాలంటే..' అంటూ వచ్చిన వాయిస్ ఓవర్ ఉత్కంఠభరితంగా ఉంది.

ఆ నలుగురు అనేది కరెక్ట్ కాదు

సునీల్ నారంగ్



'మోదీ గారే పవన్ కల్యాణ్‌ని తుఫాన్ అన్నారు. ఆయన సినిమాను ఎవరు ఆపుతారు. ఆ నలుగురు అనేది కరెక్ట్ కాదు. ఎవరి దగ్గర ఎన్ని థియేటర్లు ఉన్నాయనే లెక్కలు చూస్తే ఆ నలుగురు అనే టాపిక్ ఉండదు' అని తెలంగాణ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్(టీఎఫ్‌సీసీ) అధ్యక్షుడు సునీల్ నారంగ్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'ఎక్కువ సినిమాలు రావాలి. థియేటర్లు నడవాలి. హీరోలు గాడ్స్ వంటి వారు. వారు ఏం చేయాలనేది మేం చెప్పలేం. కొత్త కమిటీ అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తుంది. ప్రొడ్యూసర్ బాగా లేడు, డిస్ట్రిబ్యూటర్ బాగా లేడు. ఓటీటీ, క్యూబ్, బుక్ మై షో సంస్థలు మాత్రమే బాగున్నాయి' అని అన్నారు. టీఎఫ్‌సీసీ సెక్రటరీ శ్రీధర్ మాట్లాడుతూ 'సింగిల్ స్క్రీన్లు బంద్ అయిపోతున్నాయి. 2016 నుంచి పర్సంటేజీ విధానం కోసం ప్రయత్నిస్తున్నాం. మేము థియేటర్లు బంద్ అని ఎప్పుడూ అనలేదు. పవన్ కల్యాణ్ సినిమా వస్తోందని థియేటర్లు ఖాళీగా ఉంచాం. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ కేవలం మూడు సినిమాలు మాత్రమే హిట్ కొట్టాయి. ప్రతి హీరో ఏడాదికి కనీసం రెండు సినిమాలైనా చేయాలని కోరుతున్నాం' అని అన్నారు.

టీఎఫ్‌సీసీ కొత్త కమిటీ

తెలంగాణ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా సునీల్ నారంగ్ ఎన్నికయ్యారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో కొత్త కమిటీని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా రవీంద్ర గోపాల, ఉదయ్ కుమార్ రెడ్డి, కార్యదర్శిగా శ్రీధర్, సంయుక్త కార్యదర్శిగా చంద్రశేఖర్ రావు, కోశాధికారిగా సత్యనారాయణ గౌడ్ ఎన్నికయ్యారు. వీరితోపాటు 15 మందిని కార్యనిర్వాహక సభ్యులుగా ప్రకటించారు.

సరికొత్త వినోదం



బన్నీ వాస్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న నూతన చిత్రానికి 'మిత్ర మండలి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్‌తో పాటు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్ నీలిరంగు ముసుగుల వెనుక ఉన్న గ్యాంగ్‌ను పరిచయం చేసింది. నూతన దర్శకుడు విజయేందర్.ఎస్ తెరకెక్కిస్తోన్న ఈ చిత్రంలో ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల 'మిషన్ ఇంపాజిబుల్ - ది ఫైనల్ రెకనింగ్' కోసం టామ్ క్రూజ్‌తో కలసి పనిచేసిన నిహారిక ఎన్.ఎం. ఈ చిత్రం ద్వారా తెలుగులోకి అరంగేట్రం చేస్తున్నారు. "మిత్ర మండలి' అనేది స్నేహం ప్రధానంగా నడిచే కథ. ఇది ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని అందించనుంది' అని చిత్రబృందం తెలిపింది. కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప్, డా.విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు.

సిద్దేశ్వరి పీఠం ఉత్తర పీఠాధిపతి పట్టాభిషేకం



చెన్నై, జూన్ 7: తమిళనాడులోని కుర్తాళంలో ఉన్న సిద్దేశ్వరి పీఠం ఉత్తర పీఠాధిపతులుగా దత్తేశ్వరానంద భారతి పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. తెలుగు వారైన మౌనస్వామి స్థాపించిన ఈ పీఠంలో ఎందరో రుషులు, మునులు తపస్సు సాధన చేశారని పీఠం మేనజరు మూర్తి రాజు ఈ సందర్భంగా పేర్కొన్నారు. పీఠ పురోహితులు మాచవోలు రమేశ్ శర్మ ఆధ్వర్యంలో ఈ పట్టాభిషేకం నిర్వహించారు. దత్తేశ్వరానంద భారతి స్వామి కుర్తాళ పీఠ వైభవాన్ని ముందుకు తీసుకెళ్తారని సిద్దేశ్వరి పీఠాధిపతి సిద్దేశ్వరానంద భారతి ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలంగాణ ఎంఎల్‌సీ, మాజీ ప్రధాని పీవీ కుమార్తె సురభివాణి, అధ్యాత్మిక ప్రవచనకర్త అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నక్సలైట్ల ఏరివేతలో పాల్గొన్న పోలీస్ అధికారులతో షా సమావేశం

న్యూఢిల్లీ, జూన్ 7: ఛత్తీస్‌గఢ్‌లో నక్సలైట్ల ఏరివేత ఆపరేషన్‌లో చురుగ్గా వ్యవహరించిన పోలీస్ అధికారులతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణు దేవ్ సాయ్, డిప్యూటీ సీఎం విజయ్ శర్మ, హోం మంత్రిత్వశాఖ సీనియర్ అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహించిన పోలీస్ అధికారులను అభినందించినట్లు అమిత్ షా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. ఆపరేషన్ల విజయవంతం కావడంలో పాలుపంచుకున్న పోలీసులను కూడా తాను కలుసుకోవాలనుకుంటున్నానని, త్వరలో ఛత్తీస్‌గఢ్‌లో పర్యటిస్తానని చెప్పారు.

ఈ నెల 15 నుంచి ఢిల్లీ ఎయిర్‌పోర్టులో రోజుకు 114 విమాన సర్వీసుల రద్దు

న్యూఢిల్లీ, జూన్ 7: ఢిల్లీ విమానాశ్రయంలో ఈ నెల 15 నుంచి సెప్టెంబరు 15 వరకు మూడు నెలల పాటు రోజుకు 114 విమాన సర్వీసులను రద్దు చేయనున్నట్టు ఆ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (డీఐఏఎల్) వెల్లడించింది. ఒక రన్‌వేను ఆధునికీకరణ పనుల నిమిత్తం మూసివేస్తున్నందు వల్ల విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్టు పేర్కొంది. దేశంలో అతిపెద్దదేకాకుండా రద్దీగా ఉండే ఈ విమానాశ్రయంలో నాలుగు రన్‌వేలు ఉండగా.. ప్రతి రోజు 1,450 విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే రద్దు చేయనున్న 114 విమాన సర్వీసులు ఇందులో దాదాపు 7.5 శాతానికి సమానం. మరో 86 విమాన సర్వీసులను రీషెడ్యూల్ చేయనున్నారు.

సోనియాగాంధీకి అస్వస్థత

సిమ్లా, జూన్ 7: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ శనివారం అస్వస్థతకు గురికావడంతో స్థానిక ఇందిరాగాంధీ వైద్య కళాశాల, ఆస్పత్రికి తరలించారు. ఎమ్మారైతో సహా పలు పరీక్షలు నిర్వహించాక ఆమె ఆస్పత్రి నుంచి తిరిగి వెళ్లిపోయారు. అధిక రక్తపోటుతో ఆస్పత్రికి వెళ్లిన ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. కాగా కుమార్తె ప్రియాంక గాంధీతో కలిసి సోనియా వ్యక్తిగత పర్యటనకు సిమ్లా వచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో కూడా ఆమె అస్వస్థతతో ఢిల్లీలోని సర్ గంగారాం ఆస్పత్రిలో చేరారు. అయితే అప్పుడు వైద్యులు పెద్దగా సమస్య ఏమీ లేదని తెలిపారు.

ఐసీయూలో మహిళా రోగిపై అత్యాచారం

జైపూర్, జూన్ 7: రాజస్థాన్‌లో దారుణం జరిగింది. ఆస్పత్రిలోని ఐసీయూలో చికిత్స పొందుతున్న 32 ఏళ్ల మహిళపై అక్కడి నర్సింగ్ సిబ్బందిలో ఒకడు అత్యాచారానికి ఒడిగట్టాడు. జూన్ 4వ తేదీన అల్వార్‌లోని ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీలో ఈ ఘోరం జరిగింది. అత్యాచారానికి ముందు.. బాధితురాలికి నిందితుడు మత్తు ఇంజెక్షన్ ఇచ్చాడు. ఆమెపై దారుణం జరుగుతుండగా కుటుంబసభ్యులు వార్డు బయటే ఉన్నారు. ఘోరాన్ని పసిగట్టి తీవ్రంగా ప్రతిఘటించిన బాధితురాలు తన కుటుంబ సభ్యులను పిలుస్తూ కేకలు పెట్టింది. ఆమె భర్త కంగారుపడుతూ లోపలికి వెళ్లాడు. తనపై జరిగిన ఘోరం గురించి భర్తకు చెబుతూనే బాధితురాలు పూర్తిగా మత్తులోకి జారుకుంది.

బీజేపీ 'మహా' రిగ్గింగ్

మహారాష్ట్రలో విజయం కోసం మ్యాచ్ ఫిక్సింగ్

- ఐదు పద్ధతుల్లో పక్కాగా అక్రమాలు
- సీఈసీ ఎంపిక కమిటీ నుంచి సుప్రీం సీజే తొలగింపూ ఇందులో భాగమే
- రేపు బిహార్‌లోనూ జరిగేది ఇదే
- రాహుల్‌గాంధీ సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, జూన్ 7: మహారాష్ట్ర ఎన్నికల్లో విజయం కోసం బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్ చేసిందని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ ఎన్నికలు ప్రజాస్వామ్య రిగ్గింగ్‌కు బ్లూప్రింట్ వంటివని విమర్శించారు. మహారాష్ట్ర ఎన్నికల్లో అనుసరించిన ఈ విధానాలనే బిహార్ శాసనసభ ఎన్నికల్లోనూ పునరావృతం చేయనుందని, ఎక్కడైతే తమకు పరాజయం తప్పదనుకుంటుందో ఆ రాష్ట్రాలన్నింటిలోనూ అమలు చేయనున్నందంటూ బీజేపీపై ధ్వజమెత్తారు. రాహుల్ వ్యాఖ్యలను బీజేపీ నాయకులతోపాటు ఈసీ వర్గాలు కూడా ఖండించింది. ఆయనవి నిరాధార వ్యాఖ్యలని తేల్చాయి. దీంతో ఈసీపైనా రాహుల్ విరుచుకుపడ్డారు. "సాకులు కాదు.. మీరు పలికే సత్యమే మీ విశ్వసనీయతను నిలుపుతుంది" అని కాంగ్రెస్ నేత ఘాటుగా సూచించారు. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో మహారాష్ట్ర అసెంబ్లీలోని 288 సీట్లలో బీజేపీ 132, దాని మిత్రపక్షాలు మరో 103 చోట్ల గెలిచి, ఆ రాష్ట్ర చరిత్రలోనే అత్యద్భుత విజయాన్ని సొంతం చేసుకున్నాయి. అయితే, అక్కడ విజయం కోసం బీజేపీ ప్రజాస్వామ్య ప్రక్రియను మ్యగ్గం చేసిందని తాజాగా రాసిన ఓ వ్యాసంలో రాహుల్ విమర్శించారు. ఎన్నికల కమిషనర్ నియామకం కోసం ప్యానెల్ రిగ్గింగ్‌కు పాల్పడటం, నకిలీ ఓటర్ల నమోదు, ఓటింగ్ శాతాన్ని పెంచేయడం, గెలవాలనుకున్న చోట బోగస్ ఓటింగ్ జరపించడం, ఆధారాలను దాచిపెట్టడం.. అనే ఐదు పద్ధతులను ఈ ఎన్నికల్లో బీజేపీ అనుసరించిందన్నారు. ఇదేదో చిన్నాచితక మోసం కాదని, వ్యవస్థలను గుప్పెట్లో ఉంచుకుని రిగ్గింగ్‌కు భారీఎత్తున పాడిగట్టారన్నారు. భారత ఎన్నికల ప్రధానాధికారిని ఎంపికచేసే కమిటీనుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని తప్పించి, ఆ స్థానంలో కేంద్రమంత్రికి చోటు కల్పిస్తూ మహారాష్ట్ర ఎన్నికలకు ముందు(2023) తీసుకున్న నిర్ణయాన్ని ఆయన ప్రస్తావించారు. ప్రభుత్వంలో ఉన్నవారికి అనుకూలంగా ఎన్నికల వ్యవస్థ మొగ్గేందుకు ఈ చర్య దోహదం చేసిందని రాహుల్ విమర్శించారు. మోసంచేసి ఆట గెలవవచ్చుగానీ, దానివల్ల ప్రజా విశ్వాసానికి విఘాతం కలుగుతుందని, వ్యవస్థలు దెబ్బతింటాయన్నారు.

రాహుల్ వ్యాఖ్యలు సిగ్గుచేటు

కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ మహారాష్ట్ర ఎన్నికలపై చేసిన వ్యాఖ్యలను బీజేపీ నాయకులు ఖండించారు. వ్యవస్థలను ఘోరంగా అవమానించే పనిని తిరిగి రాహుల్ మొదలుపెట్టారని మండిపడ్డారు. వ్యవస్థలపై ఆయన వ్యాఖ్యలు సిగ్గుచేటు అని ఆక్షేపించారు. మహారాష్ట్ర ఎన్నికల విషయమై ఈసీ ఇప్పటికే అనేకసార్లు వివరణ ఇచ్చిందని బీజేపీ నేత తుహిన్ సిన్హా అన్నారు. తప్పుడు కథనాలకు బ్లూప్రింట్ రాహుల్ వ్యాసం అని కేంద్ర మంత్రి జేపీ నడ్డా విమర్శించారు.

ఈసీ వర్సెస్ రాహుల్

రాహుల్ వ్యాఖ్యలను ఈసీ వర్గాలు తప్పుబట్టి, డాక్యుమెంట్లను విడుదల చేశాయి. ఆయనవి నిరాధార వ్యాఖ్యలని తేల్చాయి. దీనిపై రాహుల్ తీవ్రంగా స్పందించారు. "నేను వేసిన ప్రశ్నలకు సూటిగా స్పందించకుండా సంతకం లేని పత్రాలు విడుదల చేయడం ఒక రాజ్యాంగ సంస్థగా మీకు తగదు. దాచటానికి ఏమీ లేదు అనుకుంటే నా వ్యాసంలో విసిరిన ప్రశ్నలకు బదులివ్వండి. సార్వత్రిక ఎన్నికలు, మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాలకు జరిగిన శాసనసభ ఎన్నికలకు సంబంధించిన.. డిజిటల్, మిషన్ రీడింగ్ ఓటర్ రోల్స్‌ను బయటపెట్టండి. సాయంత్రం 5 తర్వాత మహారాష్ట్రలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో తీసిన సీసీ కెమెరా ఫుటేజీని విడుదల చేయండి." అని డిమాండ్ చేశారు.



భారీగా తగ్గిన 'తీవ్ర పేదరికం'

(మొదటి పేజీ తరువాయి)

నుంచి 2.8 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 10.7 శాతం నుంచి 1.1 శాతానికి 11 ఏళ్ల సమయంలో తగ్గిందని చెప్పింది. ఇక 2017 నాటి పేదరిక రేఖ ఆధారంగా రోజుకు 2.15 డాలర్లు ఖర్చు చేయగలిగే విషయంలో జనాభాలో 2.3 శాతం మంది మాత్రమే అత్యంత పేదరికంలో ఉన్నారని, 2011-12లో 16.2 శాతంతో పోలిస్తే ఇది భారీ తగ్గుదల అని తెలిపింది. 2022లో 2.15 డాలర్ల అంచనా విషయంలో పేదల సంఖ్య 3.36 కోట్లకు తగ్గగా, అది 2011లో 20.5 కోట్లుగా ఉండేదని తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇక బహుముఖీయ పేదరిక సూచీ (ఎంపీఐ)లో దేశం గణనీయంగా పురోగతి సాధించింది. 2005-06లో 53.4 శాతంగా ఉన్న ఆ సూచీ.. 2019-21కి 16.4 శాతానికి, 2022-23కు 15.5 శాతానికి తగ్గింది. ఇక దిగువ మధ్య ఆదాయం విభాగంలో కూడా పేదరికం పెద్దఎత్తున తగ్గింది. ఈ విభాగంలో రోజు వారీ ఖర్చును 3.65 డాలర్ల నుంచి 4.20 డాలర్లకు పెంచి లెక్కించింది. ఈ సవరణ తర్వాత 2011-12లో ఈ విభాగంలో 57.7 శాతంగా ఉన్న పేదరికం, 2022-23 నాటికి 23.9 శాతానికి తగ్గింది. కాగా, ఎన్డీఏ పాలనకు 11 ఏళ్ల పూర్తవుతున్న సందర్భంగా ప్రధాని మోదీ కూడా పేదరికం తగ్గుదలపై ఇటీవల స్పందించారు. డీబీటీ, డిజిటల్ పాలన, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని చెప్పారు.

రాజీ దిశగా ట్రంప్-మస్క్?

- 'ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ట్రంప్ పేరు' పోస్టును తొలగించిన మస్క్



వాషింగ్టన్, జూన్ 7: అమెరికా అధ్యక్షుడు ట్రంప్, బిలియనీర్ ఎలాన్ మస్క్ మధ్య రాజీ దిశగా అడుగులు పడుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. లైంగిక వేధింపుల కుంభకోణంలో నిందితుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ట్రంప్‌నకు సంబంధాలు ఉన్నాయని ఇంతకుముందు ఆరోపించిన టెస్లా సీఈవో... తాజాగా ఆ పోస్టును తొలగించారు. మరోవైపు, ట్రంప్‌తో శాంతి కుదుర్చుకోవాలని మస్క్‌ను అమెరికన్ ఫండ్ మేనేజర్ బిల్ ఆక్‌మన్ కోరారు. వారిద్దరికీ తన మద్దతు ఉంటుందని, విడిపోవడం కంటే కలిసుంటేనే మనం బలంగా ఉంటామని ట్వీట్ చేశారు. దీనికి మస్క్ స్పందిస్తూ.. మీరు చెప్పిన దాంట్లో తప్పేమీ లేదని బదులిచ్చారు. కాగా, మస్క్‌పై అధ్యక్షుడు బహిరంగ విమర్శలు చేయకుండా వైట్‌హౌస్ వర్గాలు కృషి చేస్తున్నాయని మీడియా సంస్థ 'పొలిటికో' కథనం పేర్కొంది. ట్రంప్, మస్క్ మధ్య శాంతి ఒప్పందానికి మధ్యవర్తిత్వం వహించడానికి రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రి మెద్వదేవ్ ముందుకొచ్చారు. అయితే దీనికి కొద్దిగా ఖర్చు అవుతుందన్నారు. 'డి (డొనాల్డ్ ట్రంప్), ఈ (ఎలాన్ మస్క్) మధ్య శాంతి ఒప్పందం కుదర్చడానికి సిద్ధంగా ఉన్నాం. దీనికి ఫీజుగా స్టార్‌లింక్ షేర్లు ఇవ్వాల్సి ఉంటుంది. మీరిద్దరూ ఘర్షణ పడకండి' అంటూ ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఇదిలా ఉండగా, ట్రంప్‌తో విభేదాల నేపథ్యంలో తన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మస్క్ ఓటింగ్ నిర్వహించారు. 80 శాతం మంది అమెరికన్లకు ప్రాతినిధ్యం వహించే విధంగా కొత్త పార్టీ స్థాపనకు సమయం ఆసన్నమైందా అని ఆయన ప్రశ్నించారు. ఈ పోల్‌లో 80శాతం మంది తన నిర్ణయానికి మద్దతు ప్రకటించారని మస్క్ పేర్కొన్నారు. అనంతరం 'ది అమెరికా పార్టీ' అంటూ మరో పోస్టును ఆయన షేర్ చేశారు. దీంతో మస్క్ కొత్త పార్టీ పెట్టబోతున్నారని ఊహాగానాలు ఊపందుకున్నాయి.

లాస్ ఏంజెలెస్‌లో అక్రమ వలసదారుల అరెస్టు

న్యూఢిల్లీ, జూన్ 7: అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నగరంలో అక్రమ వలసదారులను గుర్తించేందుకు ఫెడరల్ అధికారులు శుక్రవారం చేపట్టిన ఆకస్మిక తనిఖీలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి. ఈ సందర్భంగా నిరసనకారులు పోలీసులతో ఘర్షణకు దిగారు. వారికి చెదరగొట్టేందుకు పోలీసులు టియర్‌గ్యాస్, పెప్పర్ స్ప్రే వంటివి ప్రయోగించారు. 44 మంది అక్రమ వలసదారులను అరెస్టు చేసినట్లు అధికారులు ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఫెడరల్ ఏజెంట్లు నగరంలోని ఫ్యాషన్ డిస్ట్రిక్ట్‌లో అక్రమ వలసదారుడనే కారణంగా ఒక దుస్తుల వ్యాపారిపై దాడి చేసి, పలువురు ఉద్యోగస్తులను అదుపులోకి తీసుకున్నారు. దీంతో అధికారుల చర్యలకు వ్యతిరేకంగా భారీ సంఖ్యలో ప్రజలు ఆందోళనకు దిగారు. ఆ తర్వాత వందలాది మంది ఆందోళనకారులు లాస్ ఏంజెలెస్ ఫెడరల్ భవనం వద్దకు చేరుకున్నారు. తనిఖీలను ఆపాలని డిమాండ్ చేశారు.

డ్యూటీ టైం ముగిసింది.. విమానం నడపను

- మహారాష్ట్ర డిప్యూటీ సీఎం షిండేకు వింత అనుభవం



ముంబై, జూన్ 7: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేకు వింత అనుభవం ఎదురయింది. డ్యూటీ సమయం ముగిసిపోయింది, తాను విమానం నడపబోనంటూ పైలట్ నిరాకరించడంతో ఆయన విమానాశ్రయంలో గంట సేపు ఉండిపోవాల్సి వచ్చింది. చివరకు విమాన కంపెనీ ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవడంతో ఆ పైలట్ తన పట్టువీడాడు. ముక్తాయినగర్‌లోని సంత్ ముక్తాయి పల్లకీ సేవలో పాల్గొనేందుకు శుక్రవారం షిండే వ్యక్తిగత విమానంలో ముంబయి నుంచి జలగావ్ బయలుదేరారు. విమానంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో బయలుదేరడమే రెండున్నర గంటలు ఆలస్యమయింది. నిర్ణీత సమయం కన్నా మూడున్నర గంటలు ఆలస్యంగా జలగావ్ చేరుకున్నారు. అక్కడి నుంచి ముక్తాయినగర్‌కు రోడ్డు మార్గంలో చేరుకున్నారు. ఆయన వెంట మంత్రులు గిరీష్ మహాజన్, గులాబ్‌రావ్ పాటిల్, ఇతర అధికారులు ఉన్నారు. అక్కడ పూజల్లో పాల్గొని రాత్రి 9.15 సమయంలో తిరిగి జలగావ్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడే వారికి అనూహ్య సంఘటన ఎదురయింది. తన డ్యూటీ సమయం ముగిసిందని, విమానం నడపబోనంటూ వారికి పైలట్ తేల్చి చెప్పాడు. దాంతో షిండే వెంట ఉన్న ఇద్దరు మంత్రులు, అధికారులు 45 నిమిషాలపాటు నచ్చజెప్పడంతో మెత్తపడి చివరకు విమానం నడపడానికి అంగీకరించాడు.

జ్యోతికి పసిడి

- రిలేలో నిత్య బృందానికి స్వర్ణం
- తైవాన్ అథ్లెటిక్స్





తైపీ సిటీ: తైవాన్ ఓపెన్ అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో భారత క్రీడాకారులు సత్తా చాటారు. ఏకంగా ఆరు స్వర్ణాలు కొల్లగొట్టారు. వీరిలో తెలుగమ్మాయిలు ఉండడం విశేషం. ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ జ్యోతి యర్రాజి 100 మీటర్ల హర్డిల్స్‌లో 12.99 సెకన్ల టైవింగ్‌తో పసిడి పతకం అందుకొంది. మహిళల 110 మీటర్ల హర్డిల్స్‌లో తేజాస్ షిర్సే 13.52 సెకన్లతో స్వర్ణం సాధించగా.. మహిళల 1500 మీటర్ల రేసులో పూజ (4 నిమిషాల 11.63 సెకన్లు), పురుషుల ట్రిపుల్ జంప్‌లో అబ్దుల్లా అబూబాకర్ (16.21 మీటర్లు) విజేతలుగా నిలిచారు. ఇక, 4×100 మీటర్ల రిలే ఈవెంట్లలో తెలంగాణకు చెందిన నిత్య గంధె, సుదీక్ష వడ్లూరి, స్నేహ సత్యనారాయణ షనువల్లి, అబినయ రాజరాజన్‌లతో కూడిన మహిళల జట్టు (44.06 సెకన్లు).. గుర్విందర్, అనిమేశ్, మనికంఠ, అమ్లాన్‌లతో కూడిన పురుషుల బృందం (38.75 సె) పసిడి పతకాలు దక్కించుకొన్నారు.

హాకీలో ఓటమితో షురూ

ఆమ్‌స్టెల్వీన్ (నెదర్లాండ్స్): ఎఫ్ఐహెచ్ హాకీ ప్రొ లీగ్ యూరప్ లెగ్‌ను భారత పురుషుల జట్టు ఓటమితో ప్రారంభించింది. శనివారం ఇక్కడ జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 1-2తో ఆతిథ్య నెదర్లాండ్స్ చేతిలో పరాజయం పాలైంది.

నల్లకలువదే ఎర్రకోట

ఇద్దరూ ఇద్దరే.. ఒకరు వరల్డ్ నెంబర్ వన్ సబలెంక, మరొకరు వరల్డ్ నెంబర్ టూ కొకొ గాఫ్. బరిలోకి దిగిన పదిసార్లు కూడా సమాన విజయాలే. గ్రాండ్‌స్లామ్స్‌లోనే కాదు.. క్లే కోర్టుల్లోనూ తలపడిన రెండేసిసార్లు పైచేయి. అలాంటి వీళ్లు ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో బరిలోకి దిగితే ఎలా ఉంటుంది? అంచనాలకు తగ్గట్టుగానే ఇద్దరూ నువ్వా.. నేనా? అనే రీతిలో ఆడి అభిమానులను ఉర్రూతలూగించారు. అయితే ఆఖరి పోరాటంలో చివరకు నల్ల కలువ గాఫ్‌కే ఫ్రెంచ్ కిరీటం దక్కింది. గెలుపు అవకాశాలను చేజార్చుకున్న సబలెంక రన్నరప్‌తో సరిపెట్టుకుంది.

ఫ్రెంచ్ ఓపెన్ విజేత కొకొ గాఫ్
ఫైనల్లో సబలెంకకు నిరాశ


కొకొ గాఫ్




సబలెంక

ప్రైజ్‌మనీ
కొకొ గాఫ్‌కు రూ.24.87 కోట్లు
సబలెంకకు రూ.12.43 కోట్లు

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో కొత్త చాంపియన్‌గా కొకో గాఫ్ నిలిచింది. శనివారం ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో 21 ఏళ్ల ఈ అమెరికన్.. 6-7 (5-7), 6-2, 6-4తో వరల్డ్ నెంబర్ 1 ఎరీనా సబలెంక (బెలారస్)ను ఓడించి ఎర్రకోటలో పాగా వేసింది. గాఫ్ కెరీర్‌లో ఇదే తొలి ఫ్రెంచ్ ఓపెన్ కాగా.. ఆమెకిది రెండో గ్రాండ్‌స్లామ్. 2023లో యూఎస్ ఓపెన్ గెలిచింది. అలాగే 2015లో సెరెనా తర్వాత మరో యూఎస్ క్రీడాకారిణి ఇక్కడ నెగ్గడం ఇదే మొదటిసారి. అంతేకాకుండా సెరెనా (2002లో) తర్వాత ఫ్రెంచ్ ఓపెన్‌ను గెలిచిన యంగెస్ట్ అమెరికన్‌గానూ గాఫ్ నిలిచింది. ఇక సబలెంక కెరీర్‌లో ఆస్ట్రేలియన్, యూఎస్ ఓపెన్ గెలిచినా ఇప్పటిదాకా ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గలేకపోయింది. ఈ పోరులో సబలెంక 70 అనవసర తప్పిదాలకు పాల్పడి మూల్యం చెల్లించుకుంది. గాఫ్ 9 బ్రేక్ పాయింట్లు, 3 ఏస్‌లతో చెలరేగింది.

హోరాహోరీగా..: తొలి సెట్‌లో సబలెంక శక్తివంతమైన బేస్‌లైన్ ఆటతీరుతో పాటు గాఫ్ పదునైన సర్వీస్ రిటర్న్‌లతో పోరు రంజుగా సాగింది. సుదీర్ఘ ర్యాలీలు, డ్యూస్‌ల కారణంగా ఈ సెట్ గంటా 18 నిమిషాలు సాగింది. తొలి పాయింట్ గాఫ్‌దే అయినా సబలెంక ప్రత్యర్థి సర్వీస్‌లను బ్రేక్ చేస్తూ ఓ దశలో 4-1తో స్పష్టమైన ఆధిక్యంలో ఉంది. కానీ తర్వాత పుంజుకున్న గాఫ్ వరుసగా 3 పాయింట్లతో స్కోరును సమం చేసింది. ఇక్కడి నుంచి కోర్టులో చిరుతల్లా ఇద్దరూ తలపడ్డారు. ఫలితంగా సెట్ 6-6తో టైబ్రేక్‌కు వెళ్లింది. ఇందులో సబలెంక ఆరంభంలో వెనుకబడినా పట్టు వదలకుండా ఆడి సెట్‌ను 7-6తో ముగించింది. అయితే కీలక రెండో సెట్‌లో చెలరేగిన గాఫ్ 35 నిమిషాల్లోనే 6-2తో గెలిచి పోటీలో నిలిచింది. ఇక నిర్ణాయక సెట్ తిరిగి రసవత్తరంగా మారింది. మొదట గాఫ్ బ్రేక్ పాయింట్లతో 3-1తో హవా చూపింది. ఈ దశలో సబలెంక ఒత్తిడిని అధిగమిస్తూ గాఫ్ సర్వీస్‌ను బ్రేక్ చేస్తూ 3-3తో సవాల్ విసిరింది. కానీ సబలెంక అనవసర తప్పిదాలను సొమ్ము చేసుకుంటూ గాఫ్ రెండు వరుస పాయింట్లు ఖాతాలో వేసుకుంది. అయితే తొమ్మిదో గేమ్‌ను సబలెంక దక్కించుకున్నా.. 5-4 ఆధిక్యంతో గాఫ్ చాంపియన్‌షిప్ సర్వీస్‌కు దిగింది. ఇందులో సబలెంక పోరాడినా తన బ్యాక్ హ్యాండ్ విన్నర్‌ను బయటకు కొట్టడంతో.. గాఫ్ విజేతగా నిలిచింది.



సెమీస్‌లో జొకోవిచ్ ఓటమి

ఫైనల్లో సినర్

అల్కారజ్‌తో అమీతుమీ నేడు
సా.6.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..


సినర్


అల్కారజ్

రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్‌పై కన్నేసిన ఆరో సీడ్ జొకోవిచ్‌కు చుక్కెదురైంది. శుక్రవారం రాత్రి హోరాహోరీగా జరిగిన పురుషుల సింగిల్స్ సెమీస్‌లో వరల్డ్ నెంబర్‌వన్ జానిక్ సినర్ చేతిలో జొకో 4-6, 5-7, 6-7 (3-7) తేడాతో వరుస సెట్లలో ఓడిపోయాడు. ఆద్యంతం దూకుడు కనబర్చిన సినర్.. ఫ్రెంచ్ ఓపెన్‌లో ఫైనల్ చేరడం ఇదే తొలిసారి. అలాగే ఓపెన్ ఎరాలో ఎడ్రియానో పనట్టా తర్వాత ఈ మెగా టోర్నీ తుదిపోరుకు చేరిన రెండో ఇటాలియన్‌గా సినర్ నిలిచాడు. మరోవైపు ఈ సీజన్‌లో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ 39 ఏళ్ల జొకోపై సినర్‌దే ఆధిపత్యం. ఇక 3 గంటల 16 నిమిషాలపాటు సాగిన సెమీస్‌లో సినర్ 10 ఏస్‌లతో చెలరేగాడు. అటు జొకో నాలుగు ఏస్‌లకే పరిమితమయ్యాడు. అయితే తొలి సెట్‌లో తేలిపోయినా చివరి రెండు సెట్లలో జొకో గట్టిగానే పోరాడాడు. కానీ తనకన్నా 15 ఏళ్ల చిన్నవాడైన సినర్ పదునైన సర్వీస్‌ల ముందు నిలబడలేక చేతులెత్తేశాడు. ఆదివారం జరిగే ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కారజ్‌తో సినర్ అమీతుమీ తేల్చుకోనున్నాడు.

జొకోకు ఇక్కడ ఇదే ఆఖరు!

తనకు ఇదే చివరి ఫ్రెంచ్ ఓపెన్ అంటూ జొకోవిచ్ సంకేతాలిచ్చాడు. 'ఇక్కడ నేను ఆడిన చివరి మ్యాచ్ ఇదే కావచ్చేమో. నాకైతే తెలీదు. మరో ఏడాది తర్వాత రోలాండ్ గారోస్‌లో ఆడేందుకు శరీరం సహకరిస్తుదో లేదో?. అందుకే ఆట పూర్తయ్యాక భావోద్వేగానికి లోనయ్యా' అని మ్యాచ్ అనంతరం 38 ఏళ్ల జొకో అన్నాడు. అయితే, ఈ నెలాఖరులో మొదలయ్యే వింబుల్డన్, ఆగస్టులో జరిగే యూఎస్ ఓపెన్‌లో మాత్రం ఆడతానని స్పష్టం చేశాడు.

గుకేష్, హంపికి మూడో స్థానం

నార్వే చెస్ విజేతలు కార్ల్‌సన్, ముజిచుక్





స్టావంజర్ (నార్వే): ప్రతిష్ఠాత్మక నార్వే చెస్ టోర్నీ పురుషులు, మహిళల విభాగాలలో భారత గ్రాండ్‌మాస్టర్లు గుకేష్, హంపి మూడో స్థానంలో నిలిచారు. ఫాబియానో కరువానా (అమెరికా)తో చివరి రౌండ్‌లో తీవ్రమైన తప్పిదంతో గుకేష్ ఓటమి పాలయ్యాడు. ఇక..ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ రికార్డు స్థాయిలో ఏడోసారి 'నార్వే' విజేతగా నిలిచాడు. కరువానాతో పదో రౌండ్‌లో సింహభాగం గుకేష్ వెనుకంజలోనే నిలిచాడు. అయితే చివరి దశలో పుంజుకొనే ప్రయత్నం చేశాడు. కానీ సమయాభావంతో ఒత్తిడిలో పడిన భారత గ్రాండ్‌మాస్టర్ ఎత్తు వేయడంలో చేసిన పెద్ద తప్పిదం అతడి ఓటమికి బాటలు వేసింది. దాంతో పది రౌండ్ల ద్వారా మొత్తం 14.5 పాయింట్లు సాధించిన గుకేష్ మూడో స్థానంతో సరిపెట్టుకున్నాడు. చివరి రౌండ్‌లో మరో భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసితో గేమ్‌ను డ్రా చేసుకున్న డిఫెండింగ్ చాంపియన్ కార్ల్‌సన్ టైబ్రేకర్‌లో గెలిచాడు. ఫలితంగా మొత్తం 16 పాయింట్లతో మాగ్నస్ టైటిల్ నిలబెట్టుకున్నాడు. కరువానా (15.5) రెండో స్థానం చేజిక్కించుకున్నాడు. ఆరుగురు గ్రాండ్‌మాస్టర్లు తలపడిన ఈ టోర్నీలో అర్జున్ (13) ఐదో స్థానంలో నిలిచాడు.

చివరి రౌండ్‌లో గెలిచినా..: మహిళల విభాగం పదో రౌండ్‌లో ప్రపంచ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా)ను టైబ్రేకర్‌లో హంపి చిత్తు చేసింది. అయితే మొత్తం 15 పాయింట్లతో హంపి మూడో స్థానానికే పరిమితమైంది. అనా ముజిచుక్ (ఉక్రెయిన్- 16.5) టైటిల్ కైవసం చేసుకుంది. లీ టింగ్ జీ (చైనా, 16) రెండో స్థానం దక్కించుకుంది. చివరి రౌండ్‌లో ముజిచుక్‌ను టైబ్రేకర్‌లో ఓడించిన వైశాలీ (11) ఐదో స్థానంలో నిలిచింది.

బట్లర్ సెంచరీ మిస్

తొలి టీ20లో విండీస్‌పై ఇంగ్లండ్ గెలుపు



చెస్టర్ లీ స్ట్రీట్: కీపర్ బట్లర్ (59 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 96) బ్యాటింగ్‌లో, స్పిన్నర్ లియామ్ డాసన్ (4/20) బౌలింగ్‌లో అదరగొట్టడంతో వెస్టిండీస్‌తో తొలి టీ20లో ఇంగ్లండ్ 21 పరుగులతో నెగ్గింది. తొలుత ఇంగ్లండ్ 20 ఓవర్లలో 188/6 స్కోరు చేసింది. జెమీ స్మిత్ (38), బెథెల్ (23 నాటౌట్) సత్తా చాటారు. రొమారియో షెఫర్డ్ (2/33) రెండు వికెట్లు తీశాడు. ఛేదనలో విండీస్ 20 ఓవర్లలో 167/9 స్కోరుకే పరిమితమై ఓడింది. ఎవిన్ లూయిస్ (39), చేజ్ (24) మాత్రమే రాణించారు. పాట్స్, బెథెల్ చెరో 2 వికెట్లు పడగొట్టారు.

ఇంగ్లండ్ చేరిన టీమిండియా

లండన్: కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సారథ్యంలో భారత జట్టు సుదీర్ఘ పర్యటనకోసం ఇంగ్లండ్ గడ్డపై కాలు మోపింది. 2025-27 ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్‌లో భాగంగా ఈ సిరీస్‌లో ఆతిథ్య జట్టుతో టీమిండియా ఐదు టెస్టులలో తలపడనుంది. శుక్రవారం రాత్రి ముంబై నుంచి బయలు దేరిన భారత్ శనివారం ఇక్కడకు చేరుకుంది. గిల్‌తోపాటు వైస్-కెప్టెన్ రిషభ్ పంత్, ఓపెనర్ సాయి సుదర్శన్, పేసర్లు జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ఆల్‌రౌండర్ జడేజా తదితరులు ఈ బృందంలో ఉన్నారు. టెస్ట్ జట్టులోని ఇతర క్రికెటర్లు ఇండియా 'ఎ' పర్యటనలో భాగంగా ఇప్పటికే యూకేలో ఉన్న సంగతి తెలిసిందే.

ఇంగ్లండ్ లయన్స్ 192/3

నార్తాంప్టన్: ఎమీలియో గే (71), టామ్ హెయిన్స్ (54) అర్ధ శతకాలతో రాణించడంతో భారత్ 'ఎ'తో నాలుగు రోజుల అనధికార టెస్ట్‌లో ఇంగ్లండ్ లయన్స్ దీటైన బదులిస్తోంది. శనివారం ఆట ఆఖరికి లయన్స్ మొదటి ఇన్నింగ్స్‌లో 192/3 స్కోరు చేసింది. జొర్డాన్ కాక్స్ (31), జేమ్స్ ర్యూ (0) క్రీజులో ఉన్నారు. అన్షుల్, తుషార్, తనుష్ తలా ఒక్కో వికెట్ పడగొట్టారు. అంతకుముందు ఓవర్ నైట్ స్కోరు 319/7తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 'ఎ' 348 పరుగులకు ఆలౌటైంది.

పాత కారు అమ్ముతుంటే!

ఇదీ GST


రాంబాబు గొండాల

ప్రస్తుత ఆధునిక కాలంలో ప్రజల అభిరుచులు, అవసరాలు రోజురోజుకు మారిపోతున్నాయి. ఒకప్పుడు విలాస వస్తువు అనేది ఈ రోజు నిత్యావసరంగా మారుతోంది. అలాంటి వాటి జాబితాలో కారు ఒకటి. ఒకప్పుడు సంపన్నులకు మాత్రమే పరిమితమైన కారు ఈ రోజు మధ్య తరగతి ప్రజలకు కూడా అవసరంగా మారింది. కొత్త కార్లతో పాటుగా పాత కార్లను అమ్మటానికి ప్రముఖ కార్ల కంపెనీలన్నీ ప్రత్యేక షోరూమ్స్‌ను ఏర్పాటు చేస్తున్నాయి. అంతేకాకుండా పాత కార్లకు కూడా బ్యాంకులు లోన్ ఇవ్వటం మొదలు పెట్టడంతో పాత కార్ల మార్కెట్ క్రమేపీ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఒక డీలర్ లేదా ఏదైనా కంపెనీ షోరూమ్ పాత కారు అమ్మేటప్పుడు జీఎస్‌టీ చెల్లించాల్సి ఉందా? ఉంటే ఎంత జీఎస్‌టీ కట్టాలో చూద్దాం. కొత్త కార్లకు సంబంధించి జీఎస్‌టీ అనేది గరిష్ట స్లాబ్ అంటే 28 శాతంగా ఉంది. అంతేకాకుండా కేటగిరీని బట్టి గరిష్ఠంగా 15 శాతం వరకు సెస్ కూడా ఉంది. జీఎస్‌టీ వచ్చిన కొత్తలో పాత కార్లకు కూడా ఇదే విధంగా పన్ను శాతం నిర్ణయించటంతో పాత కార్ల అమ్మకందారుల్లో ఆందోళన నెలకొంది. ఆ తర్వాత రేట్లను 2018లో సవరించారు. దీని ప్రకారం పాత కార్ల మీద పన్ను శాతం కారు కెపాసిటీ, పొడవును బట్టి 12 నుంచి 18 శాతంగా నిర్ణయించటం జరిగింది.

ఇకపోతే ఈ ఏడాది జనవరిలో మళ్లీ దీనికి సవరణ చేయటం జరిగింది. కొత్త సవరణ ప్రకారం అన్ని రకాల సెకండ్ హ్యాండ్ కార్లకు పన్ను 18 శాతంగా నిర్ణయించటం జరిగింది. ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయం ఏమిటంటే ఈ విధంగా అమ్మే పాత కార్లకు ఎలాంటి సెస్ లేదు. మరి ఈ పన్ను ఎంత విలువ మీద చెల్లించాలనే దాని మీద కూడా వివరణ ఇచ్చారు. ఇది కేవలం 'మార్జిన్' మీద చెల్లిస్తే సరిపోతుంది. మరి మార్జిన్ అంటే ఏమిటి? అమ్మకపు ధర.. కొన్న ధరకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని మార్జిన్‌గా భావించాలి. ఈ వ్యత్యాసం మీద పన్ను చెల్లిస్తే సరిపోతుంది. ఒకవేళ ఆదాయ పన్ను చట్టం ప్రకారం కారు మీద డిప్రిషియేషన్ (తరుగుదల) చూపించి ఉంటే.. అమ్మకం విలువ, ఆదాయ పన్ను అకౌంట్స్ ప్రకారం అమ్మకం నాటికి కారు విలువ (డిప్రిషియేషన్ పోగా మిగిలిన విలువ) మధ్య వ్యత్యాసాన్ని కారు విలువ కింద చూపి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అదే పాత కార్ల క్రయవిక్రయాలు జరిపే డీలర్ ఒక పాత కారును ఒక వ్యక్తికి విక్రయిస్తే ఆ కారు కొన్నప్పటి విలువ, అమ్మకం విలువ మధ్య వ్యత్యాసాన్ని కారు విలువగా చూపించి దాని మీద పైన సూచించిన విధంగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ ఈ వ్యత్యాసం నెగటివ్‌గా ఉంటే.. అంటే కొనుగోలు ధర కంటే అమ్మకపు విలువ తక్కువగా ఉంటే ఎలాంటి పన్ను చెల్లించనవసరం లేదు. ఒకవేళ, అమ్మకందారుడు కారు కొన్నప్పుడు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) తీసుకుని ఉంటే పైన చెప్పిన పన్ను ప్రయోజనం అతనికి వర్తించదు.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

బిజినెస్ ప్లస్



ఎఫ్‌డీ.. ఏం చేద్దాం..?

ఆర్‌బీఐ రెపో రేటు కోతలతో డిపాజిట్లపై వడ్డీ ఆదాయం తగ్గుముఖం

ఈసారి ద్రవ్య పరపతి సమీక్షలో ఆర్‌బీఐ రెపో రేటును ఏకంగా 0.50 శాతం తగ్గించింది. రుణగ్రహీతలకు ఇది శుభవార్తే. రెపో తగ్గింపుతో రుణాలు మరింత చౌకగా లభించనున్నాయి. ఇప్పటికే రుణాలు తీసుకున్న వారికి ఈఎంఐల భారం కూడా తగ్గనుంది. కానీ, డబ్బు పొదుపు చేయాలనుకునే వారికి మాత్రం ఇది ప్రతికూల పరిణామమే. ఎందుకంటే, రెపో కోతతో రుణ రేట్లతో పాటు డిపాజిట్ రేట్లూ తగ్గుముఖం పట్టనున్నాయి. అంటే, ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)పై లభించే వడ్డీ ఆదాయం మరింత తగ్గనుంది. ఆర్‌బీఐ ఈ ఫిబ్రవరి, ఏప్రిల్‌లోనూ రెపో రేటులో 0.25 శాతం చొప్పున మొత్తం అర శాతం కోత పెట్టింది. దీంతో ఎఫ్‌డీ రేట్లు ఈ ఫిబ్రవరి నుంచి 0.30 శాతం నుంచి 0.70 శాతం స్థాయిలో తగ్గాయి. కొన్ని బ్యాంకులు ఎఫ్‌డీ రేట్లతో పాటు పొదుపు ఖాతా (సేవింగ్స్ అకౌంట్) రేట్లనూ తగ్గించేశాయి. తాజాగా రెపో కోతతో డిపాజిట్లపై వడ్డీ ప్రతిఫలం మరింత తగ్గనుంది. ముఖ్యంగా స్వల్ప, మధ్యకాలిక డిపాజిట్లపై వడ్డీ రేటును గణనీయంగా తగ్గించే అవకాశాలున్నాయని ఆర్థిక విశ్లేషకులు భావిస్తున్నారు.

ఇన్వెస్టర్లు ఏం చేయాలి..?

వడ్డీ రేట్లు తగ్గుతున్న తరుణంలో ఎఫ్‌డీ ఇన్వెస్టర్లకు అందుబాటులో ఉండే ఆప్షన్లు చాలా పరిమితమే. వడ్డీ రాబడి భారీగా తగ్గకుండా చర్యలు చేపట్టడమే ఉత్తమ వ్యూహం.

త్వరపడండి..

ఆర్‌బీఐ రెపో తగ్గించినప్పటికీ, బ్యాంకులు డిపాజిట్లు రేట్లను తగ్గించేందుకు మరికొంత సమయం పట్టవచ్చు. కాబట్టి, కొత్తగా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలనుకునేవారు త్వరపడటం మేలు. ఇప్పటికీ చాలా బ్యాంకులు ఎఫ్‌డీలపై ఆకర్షణీయ వడ్డీ ఆఫర్ చేస్తున్నాయి. 7 శాతం అంతకు పైగా వార్షిక వడ్డీ చెల్లిస్తున్నాయి.

దీర్ఘకాలిక డిపాజిట్లు

మీరు పొదుపు చేయబోయే సొమ్ము లేదా రెన్యువల్ చేయబోయే ఎఫ్‌డీ ఖాతాలోని సొమ్ముతో ఇప్పట్లో అవసరం లేదనుకుంటే.. దీర్ఘకాలానికి డిపాజిట్ చేయడం మేలు. దాంతో అధిక వడ్డీ ఆదాయం పొందే వీలుంటుంది.

స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు

పెద్ద బ్యాంకులతో పోలిస్తే స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు మరింత ఆకర్షణీయ వడ్డీని ఆఫర్ చేస్తుంటాయి. అయితే, వీటిల్లో డిపాజిట్ కూడా కొంత రిస్క్‌తో కూడుకున్నదే. స్వల్పకాలానికి తక్కువ మొత్తంలో డిపాజిట్ చేయవచ్చని, దీర్ఘకాలిక ఎఫ్‌డీలకు మాత్రం బడా బ్యాంకులు లేదా పోస్టాఫీస్ పథకాలే మేలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

కార్పొరేట్ ఎఫ్‌డీలు

రిస్క్ తీసుకోగలిగే కార్పొరేట్ కంపెనీల ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాల్లో సొమ్ము జమ చేయడం ద్వారా అధిక వడ్డీ పొందవచ్చు. మీ పొదుపు సొమ్ములో కొంత మొత్తాన్ని 2-3 ఏళ్ల కాలపరిమితితో కూడిన కార్పొరేట్ బాండ్లలో ఇన్వెస్ట్ చేయవచ్చు. అయితే, ఉత్తమ రేటింగ్ కలిగిన ప్రముఖ కంపెనీల బాండ్లను మాత్రమే ఎంచుకోవాలి.

డెట్ ఫండ్లు

డెట్ మ్యూచువల్ ఫండ్లు, కార్పొరేట్, గవర్నమెంట్ సెక్యూరిటీలు కూడా మంచి ప్రత్యామ్నాయాలు. స్వల్పకాలిక ఎఫ్‌డీ పథకాల కంటే అధిక రిటర్నులు అందుకునే అవకాశం ఉంటుంది. అయితే, ఇవన్నీ ఎంతో కొంత రిస్క్‌తో కూడినవే.

ఐటీ రిటర్నుల ఫైలింగ్‌కు రంగం సిద్ధమైంది. ఆదాయ పన్ను (ఐటీ) శాఖ ఇప్పటికే అన్ని ఐటీఆర్ ఫారాలను విడుదల చేసింది. ఏటా జూలై నెలాఖరు వరకు ఉండే రిటర్నుల ఫైలింగ్ గడువును ప్రభుత్వం ఈ సంవత్సరం సెప్టెంబరు 15 వరకు పొడిగించింది. అయితే చాలా మంది ఉద్యోగుల్లో తాము ఐటీఆర్-1 ఫైల్ చేయాలా? లేక ఐటీఆర్-2 ఫైల్ చేయాలా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



ఐటీఆర్-1, ఐటీఆర్-2 ఎంచుకోవడం ఎలా!

ఈ నెల 15లోగా ఉద్యోగులకు ఫారమ్-16, ఫారమ్-16ఏ అందుబాటులోకి వస్తాయి. అప్పటి నుంచి వారు తమ ఐటీ రిటర్నుల ఫైలింగ్ ప్రారంభించవచ్చు. 2025-26 అసెస్‌మెంట్ ఇయర్ (ఈఏవై)కు సంబంధించిన ఐటీ రిటర్న్ ఫారాల్లో ప్రభుత్వం కొన్ని మార్పులు చేర్పులు చేసింది. గత ఏడాది వరకు జీతం/పెన్షన్ ఆదాయం, లేదా ఒక ఇంటిపై వచ్చే అద్దె ఆదాయం, సేవింగ్/ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ), డివిడెండ్లు, వార్షిక వ్యవసాయ ఆదాయం రూ.5,000 కంటే తక్కువ ఉంటే ఐటీఆర్-1 (సహజ్) రిటర్న్ ఫైల్ చేస్తే సరిపోయేది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లిస్టెడ్ కంపెనీల ఈక్విటీ షేర్లు లేదా ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ యూనిట్ల అమ్మకంపై వచ్చిన వార్షిక దీర్ఘకాలిక మూలధన లాభాలు (ఎల్‌టీసీజీ) రూ.1.25 లక్షల వరకు ఉన్న వ్యక్తులు కూడా ఐటీఆర్-1 ఫారమ్ ద్వారా తమ రిటర్నులు ఫైల్ చేయాల్సి ఉంటుంది.

ఐటీఆర్-1

జీతం/పెన్షన్ తప్ప క్లిష్టమైన ఆర్థిక లావాదేవీలు లేని వ్యక్తులు ఐటీఆర్-1 (సహజ్) ద్వారా తమ రిటర్న్ ఫైల్ చేయడం మంచిది. ఈ ఫారమ్‌లో ఆయా వ్యక్తుల వ్యక్తిగత సమాచారం, ఆదాయ వివరాలు, గత ఆర్థిక సంవత్సరంలో వారు జరిపిన ఆర్థిక లావాదేవీల వివరాలు ముందుగానే పూర్తి చేసి ఉంటాయి. కాకపోతే పన్ను చెల్లింపుదారులు ఈ వివరాలను తమ ఫారమ్-16, బ్యాంకు స్టేట్‌మెంట్లు, ఫారమ్-26ఏ, వార్షిక సమాచార స్టేట్‌మెంట్ (ఏఐఎస్) లోని వివరాలతో సరిచూసుకోవాలి.

ఐటీఆర్-1కు అర్హత

- స్వదేశంలో నివసించే వ్యక్తులై ఉండాలి
- వార్షిక ఆదాయం రూ.50 లక్షలకు మించకూడదు
- వార్షిక ఎల్‌టీసీజీ రూ..1.25 లక్షలు మించరాదు
- ఐటీఆర్-1 ఫైల్ చేసే వ్యక్తి ఏ కంపెనీలోనూ డైరెక్టర్ పదవిలో ఉండకూడదు
- లిస్ట్‌కాని ఏ కంపెనీలోనూ షేర్లు కలిగి ఉండరాదు
- ఆర్థిక సంవత్సరంలో ఎటువంటి విదేశీ ఆదాయం కలిగి ఉండకూడదు
- విదేశాల్లో ఎలాంటి ఆస్తులుగానీ, బ్యాంకు ఖాతాలు గానీ కలిగి ఉండరాదు
- ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్స్ (ఈ- సాప్స్)పై చెల్లించాల్సిన చెల్లింపులు, డిడక్షన్లు వాయిదా పడి ఉండరాదు
- ఏ రకమైన ఆదాయాన్నీ క్యారీ ఫార్వర్డ్ లేదా బ్రాట్ ఫార్వర్డ్ చేసి ఉండకూడదు.

పైన పేర్కొన్న విషయాల పరిధిలోకి రాని వ్యక్తులు ఐటీఆర్-2 ద్వారా తమ ఐటీ రిటర్న్‌లు ఫైల్ చేసుకోవచ్చు. వ్యాపారాలు, వృత్తి ద్వారా ఎటువంటి లాభాలు, రాబడులు లేని వ్యక్తులకు ఈ ఫారమ్ చక్కగా సరిపోతుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



8వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	540
వరంగల్	537	గోదావరి	520
చిత్తూరు	613	విశాఖపట్నం	535
		దజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	114
వరంగల్	110	గుంటూరు	117
కరీంనగర్	110	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	107
కర్నూలు	110	నెల్లూరు	112
విశాఖపట్నం	101	అనంతపురం	112
గోదావరి	114		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,970 ▼	89,800 ▼	1,18,000 ▲
విజయవాడ	99,000 ▼	93,000 ▼	1,08,000 ▲
విశాఖపట్నం	99,600 ▼	89,800 ▼	1,18,000 ▲
రాజమండ్రి	97,960 ▼	89,800 ▼	1,08,300 ▼
ప్రొద్దుటూరు	96,300 ▼	88,640 ▼	1,03,000 ▲
ముంబై	97,145 ▼	88,985 ▼	1,05,285 ▲



కాళేశ్వరానికి..

క్యాబినెట్ ఆమోదం లేదు

ఆ ప్రాజెక్టు విషయం క్యాబినెట్ ముందుకు రానేలేదు

- మూడేళ్ల తరువాత అంచనాల మార్పు ఫైలు
- సబ్‌కమిటీకి, కాళేశ్వరానికి సంబంధం లేదు
- కాళేశ్వరం నిరుపయోగమని ఎన్‌డీఎస్‌ఏ చెప్పింది: తుమ్మల



హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుకు క్యాబినెట్ ఆమోదం లేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అసలు కాళేశ్వరం ప్రాజెక్టు విషయం అప్పటి క్యాబినెట్ ముందుకు రానేలేదని, కేవలం నిర్వహణ అనుమతులతోనే ఆ ప్రాజెక్టు మొదలైందని చెప్పారు. అయితే ప్రాజెక్టు ప్రారంభమైన మూడేళ్ల తరువాత.. నిర్మాణ వ్యయం, అంచనాల మార్పునకు సంబంధించిన ఫైలు మాత్రమే క్యాబినెట్‌కు వచ్చిందని తెలిపారు. అంతేకాకుండా బీఆర్ఎస్ హయాంలో ప్రాణహిత, దేవాదుల, కంతానపల్లి, వరద కాలువ ప్రాజెక్టుల నిర్మాణం, ఇతర అంశాల కోసం ఏర్పాటుచేసిన క్యాబినెట్ సబ్‌కమిటీకి, కాళేశ్వరానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. కాళేశ్వరం నిర్మాణం, అనుమతులు, వ్యయ అంచనాల మార్పులతోపాటు, నాలుగు ప్రాజెక్టుల కోసం ఏర్పాటుచేసిన సబ్‌కమిటీకి సంబంధించిన వివరాలన్నీ తెలుపుతూ కాళేశ్వరం విచారణ కమిషన్‌కు తాను సుమోటోగా లేఖ రాస్తానన్నారు. అంతేకాకుండా.. కాళేశ్వరం నిర్మాణ సమయంలో చోటుచేసుకున్న మరికొన్ని పరిణామాలు, అప్పటి ఫైనాన్స్ సెక్రటరీ రాసిన విషయాలు, ప్రాజెక్టు తొలిదశలోనే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చెప్పిన వివరాలన్నింటినీ కమిషన్‌కు అందజేస్తానని తెలిపారు. ఎంపీ ఈటల రాజేందర్.. కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరై ఇచ్చిన వాంగ్మూలంలో, బయటకు వచ్చిన తరువాత చేసిన వ్యాఖ్యల్లో వాస్తవం లేదన్నారు. మరోవైపు కాళేశ్వరం, సబ్‌కమిటీ ఏర్పాటు విషయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు ఇంకా అసత్యాలు మాట్లాడితే.. ఆయన అబద్ధాల హరీశ్ అవుతారని ఎద్దేవా చేశారు. ఈ మేరకు మంత్రి తుమ్మల శనివారం సచివాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ఈటల అలా ఎందుకు మాట్లాడారో?

కాళేశ్వరం కమిషన్ ఎదుట ఈటల రాజేందర్ ఇచ్చిన వాంగ్మూలం అసత్యాలతో కూడి ఉందని మంత్రి తుమ్మల అన్నారు. అయితే ఆయన అనాలోచితంగా ఆ ప్రకటన చేశారా? లేక అలా మాట్లాడాల్సిన పరిస్థితులేవైనా ఆయనకు దాపురించాయోనన్న అనుమానం ఉందన్నారు. కమిషన్ అడిగిన ప్రశ్నలకు ఈటల పొంతనలేని సమాధానాలు ఇచ్చారని, అవన్నీ వాస్తవాలకు దూరంగా ఉన్నాయని చెప్పారు. ఈటల ప్రస్తావించిన మంత్రివర్గ ఉపసంఘం.. కాళేశ్వరం నిర్మాణం కోసం ఏర్పాటుచేసింది కాదని, మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం కోసం ఉత్తర్వులు ఇచ్చిన 15 రోజుల తరువాత ఉపసంఘం ఏర్పాటైందని తెలిపారు. రాష్ట్రంలో అప్పటికే ఉన్న ప్రాణహిత, దేవాదుల, కంతానపల్లి, వరద కాలువ పనులు కొనసాగించాలంటే.. అప్పటికే ఉన్న అంచనా ధరలు, అవే ధరలకు కాంట్రాక్టర్లు పనిచేస్తారా, వాళ్లు చేయబోమంటే ప్రభుత్వం ఏం చర్యలు తీసుకోవాలనే దానికోసమే సబ్ కమిటీని ఏర్పాటు చేశారని వివరించారు. అందులో కాళేశ్వరం ప్రస్తావనే లేదన్నారు. ఆ సబ్‌కమిటీ రెండు మూడు సార్లు సమావేశమై.. అధికారులతో చర్చించి నివేదికలను ప్యాకేజీల వారీగా అప్పటి ప్రభుత్వానికి, క్యాబినెట్‌కు సమర్పించిందని చెప్పారు. ఆ నివేదికల్లోనూ కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణాలు సహా ఏ రకమైన సూచనలూ చేయలేదన్నారు. కాళేశ్వరం నిర్మాణానికి సబ్‌కమిటీ అనుమతులు ఇచ్చిందని ఈటల ఎందుకు అన్నారో ఆయనే ఆలోచించుకోవాలని సూచించారు. మరోవైపు కాళేశ్వరాన్ని క్యాబినెట్ ఆమోదించిందనడం కూడా అవాస్తవమని పేర్కొన్నారు. అయితే ఆ సబ్‌కమిటీలో, నాటి క్యాబినెట్‌లోనూ తాను ఉన్నందున.. తనను కూడా బాధ్యుడిని చేయాలనే ఉద్దేశంతోనే ఈటల చెప్పి ఉంటారని భావిస్తూ స్పష్టతనిస్తున్నట్లు తెలిపారు. విచారణ కమిషన్ కాళేశ్వరంపై ప్రశ్నిస్తే.. ఈటల మాత్రం నాలుగు ప్రాజెక్టుల కోసం ఏర్పాటైన సబ్‌కమిటీ గురించి ప్రస్తావించడమేంటని నిలదీశారు. క్యాబినెట్‌లో లేని విషయాన్ని ఉన్నట్లు ఎందుకు చెప్పారో ఈటల స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు.

కమిషన్‌కు అన్ని వివరాలు సమర్పిస్తా..

43 ఏళ్లగా.. నిజాయితీ, నిబద్ధతతో రాజకీయాలు చేస్తున్నానని తుమ్మల అన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో ఎప్పుడూ తెలిసి తప్పుచేయలేదన్నారు. వాస్తవానికి తానేంటో, తన వ్యక్తిత్వమేంటో ఈటల రాజేందర్‌కు తెలుసునని, అయినా ఆయన చేసిన ప్రకటన చూసి బాధ కలిగిందని పేర్కొన్నారు. అదే సమయంలో అనుమానం కూడా కలిగిందన్నారు. ఈ సందర్భంగా.. క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటుచేసిన ఉత్తర్వులు, మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం కోసం ఇచ్చిన జీవోలు కూడా ఉన్నాయంటూ చూపించారు. నాలుగు ప్రాజెక్టులపై సబ్‌కమిటీ ఇచ్చిన నివేదికలు కూడా ఉన్నాయని, సమయం వచ్చినప్పుడు వాటిని బహిర్గతం చేస్తానని అన్నారు. అప్పట్లో ఫైనాన్స్ సెక్రటరీ రాసిన విషయాలన్నింటినీ తేదీలతో సహా ఉత్తర్వులను కూడా బయటపెడతానని చెప్పారు. ఈ విషయంలో ఎవరితోనైనా చర్చించడానికి సిద్ధమని ప్రకటించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారాలన్నీ గత ప్రభుత్వ హయాంలోనే జరిగాయని స్పష్టం చేశారు. అసలు కాళేశ్వరం ప్రాజెక్టే నిరుపయోగమని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అప్పుడే చెప్పిందని తుమ్మల తెలిపారు. ప్రస్తుత కమిషన్ విచారణలో వాస్తవాలను తేల్చిన తరువాత చర్యలుంటాయన్నారు. మరోవైపు సమ్మక్క-సారక్క, తుపాకులగూడెం ప్రాజెక్టులపైనా వివరాలు ఇవ్వాలని కోరడంతో నివేదికలు ఇచ్చామని పేర్కొన్నారు. కానీ, అప్పుడు జరిగిన నిర్ణయాలు, ఇచ్చిన నివేదికలకు విరుద్ధంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ప్రభుత్వాల్లోనూ తాను ఉన్నానని, ఎల్లప్పుడూ రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజలకు ఉపయోగపడే విధంగానే పనిచేశానని అన్నారు.

అబద్ధాల హరీశ్ అవుతారు..

కాళేశ్వరం విషయం క్యాబినెట్‌లో ఉందని, తుమ్మలకు కూడా ఈ విషయం తెలుసునని హరీశ్‌రావు అనడంపై విలేకరులు ప్రశ్నించగా, 'ఇంకా అసత్యాలు మాట్లాడితే.. ఆయన అబద్ధాల హరీశ్ అవుతారు' అని తుమ్మల వ్యాఖ్యానించారు. క్యాబినెట్‌కు వచ్చినట్టు ఏదైనా సాక్ష్యం ఉంటే చూపించాలని, రాలేదని చూపించేందుకు తాను సిద్ధమని అన్నారు. అయితే కాళేశ్వరం ప్రారంభమైన మూడేళ్ల తరువాత రివైజ్డ్ ఎస్టిమేట్స్ ఫైలు మాత్రం క్యాబినెట్‌కు వచ్చిందన్నారు. ఆ సమయంలో అంతర్గతంగా కూడా కొంత ఇబ్బందులు పడ్డామని చెప్పారు.

దొంగలకు సద్దులు మోసినట్లుగా

ఈటల తీరు

- కాళేశ్వరం అవినీతి నుంచి కేసీఆర్‌ను తప్పించేందుకు యత్నించారు: ఆది శ్రీనివాస్
- ఈటల.. మళ్లీ బీఆర్ఎస్‌లోకి పోవాలని చూస్తున్నారు: మేడిపల్లి సత్యం

హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం విచారణ కమిషన్ ఎదుట బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఇచ్చిన వివరణ తీరు దొంగలకు సద్దులు మోసినట్లుగా ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. పాత బాస్ కేసీఆర్ రుణం తీర్చుకునేందుకు ఈటల కమిషన్ ముందు నిజాలు చెప్పలేదన్నారు. శనివారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం అవినీతి నుంచి కేసీఆర్‌ను బయటపడేసేందుకు ఈటల ప్రయత్నించారని మండిపడ్డారు. కమిషన్ ముందు ఈటల కాళేశ్వరం కమీషన్ల చిట్టా విప్పుతారని అంతా ఆశించారన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సైతం కమిషన్ ముందు ఈటల అన్ని విషయాలు చెబుతారన్నారని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందని ప్రధాని మోదీ సహా బీజేపీ అగ్ర నేతలు చేసిన ఆరోపణలకు ఈటల ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కేసీఆర్ అవినీతిని నిరూపించేందుకు ఈటలకు మంచి అవకాశం వచ్చినా వదిలేశారన్నారు. ఈటల ఇచ్చిన వివరణపై కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ స్పందించాలన్నారు. బీజేపీ నేతలు దాచాలని చూస్తున్నా దర్యాప్తులో నిజాలు తప్పకుండా బయటకు వస్తాయని చెప్పారు. ఆ రెండు పార్టీల చీకటి ఒప్పందాలు కూడా బయటపడతాయన్నారు. బీజేపీలో అధ్యక్ష పదవి రావట్లేదని.. మళ్లీ బీఆర్ఎస్‌లోకి ఈటల పోవాలని చూస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆరోపించారు. ఈటలకు పాత బాస్ కేసీఆర్ మీద ప్రేమ పోలేదని.. విచారణ కమిషన్ ముందు ఆయన ఇచ్చిన వివరణతోనే స్పష్టమవుతోందన్నారు. విచారణ కమిషన్‌పై కేటీఆర్ వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉన్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్ విమర్శించారు. తెలంగాణ ఏర్పడక ముందు.. ఆ తర్వాత కల్వకుంట్ల కుటుంబం ఆస్తుల వివరాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. పదేళ్ల అధికారంలో ఉండి ఆ పార్టీ నేతలు చేసిన ఆర్థిక దోపిడీ అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు.

తుమ్మిడిహెట్టి వద్ద నీరు లేదని

సీడబ్ల్యూసీ చెప్పలేదు

- క్షమాపణ చెప్పకుండా ఎదురుదాడా ?
- కాళేశ్వరం వైఫల్యానికి కేసీఆర్, హరీశే కారకులు
- హరీశ్ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యానికి మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులే ప్రధాన కారకులని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీ ఏ రోజూ చెప్పలేదని, పైసల కక్కుర్తి కోసం ప్రాజెక్టు ప్రతిపాదనలను మార్చి కాళేశ్వరం చేపట్టారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు పేరు రాకూడదనే కారణంతోనే తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు ప్రాజెక్టును మార్చారని తెలిపారు. బీఆర్ఎస్ తీసుకున్న తప్పుడు నిర్ణయాలు, కమీషన్ల కక్కుర్తి వల్ల తెలంగాణకు శాశ్వత నష్టం జరిగిందని ధ్వజమెత్తారు. ఈ మేరకు కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు శనివారం ఇచ్చిన ప్రజంటేషన్‌పై ఉత్తమ్ మండిపడ్డారు. నాసిరకం పనులు చేపట్టి ప్రజాధనం దుర్వినియోగం చేసినందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాల్సింది పోయి.. ఎదురుదాడికి దిగుతావా? అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావుపై ధ్వజమెత్తారు.

99 టీఎంసీలతో 22 లక్షల ఎకరాలకు సాగునీరు ఎలా ఇచ్చావ్ ?

కాళేశ్వరం ప్రాజెక్టుకు మేడిగడ్డ గుండెకాయ అని చెప్పిన బీఆర్ఎస్ నేతలు ఆ బ్యారేజీ నుంచి ఎత్తిపోసిన నీటినే కాళేశ్వరం నీటిగా పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. 2019లో మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం పూర్తయితే.. 2019-24 వరకు ఐదేళ్ల కాలంలో 162 టీఎంసీల నీటిని మేడిగడ్డ నుంచి ఎత్తిపోశారని, వరదలు రాగానే అందులోని 63 టీఎంసీలను సముద్రంలోకి వదిలిపెట్టారని ఉత్తమ్ వివరించారు. మిగిలిన 99 టీఎంసీలతో 22 లక్షల ఎకరాలకు సాగునీరు ఎలా అందించారో? నీటిపారుదల శాఖ మాజీ మంత్రి హరీశ్ సమాధానం చెప్పాలని నిలదీశారు. 2022 జూలైలో వరదలకు సిరిపురం(అన్నారం) పంప్‌హౌస్ నీట మునిగిందని, అదే ఏడాది కన్నెపల్లి(మేడిగడ్డ) పంప్‌హౌస్ బ్రెస్ట్ వాల్ కూలి మోటార్లన్నీ దెబ్బతిన్నాయని ఉత్తమ్ గుర్తు చేశారు. 2023 అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీ కుంగిందన్నారు. బ్యారేజీలను నీటి మళ్లింపు కోసమే కడతారని, బెంగాల్‌లోని ఫరక్కా బ్యారేజీ కట్టింది కూడా అందుకేనని చెప్పారు. రాతి పునాదిపై నిర్మాణం చేపట్టడం వల్లే.. ఫరక్కా బ్యారేజీ ఇన్నేళ్లుగా చెక్కుచెదరలేదని స్పష్టం చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ప్రతిపాదన, నిర్మాణం బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని, మేడిగడ్డ కుంగింది కూడా బీఆర్ఎస్ హయాంలోనేనని ఎద్దేవా చేశారు. ఫరక్కా బ్యారేజీని నీటి మళ్లింపు కోసం నిర్మిస్తే కాళేశ్వరం బ్యారేజీలను నిధుల మళ్లింపు కోసం కట్టారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబ అవినీతికి కాళేశ్వరం బ్యారేజీలే ప్రత్యక్ష సాక్ష్యం అని మంత్రి పేర్కొన్నారు.

తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ ఎందుకు కట్టలేదు?

తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టకుండా ఎందుకు పక్కన పెట్టారని బీఆర్ఎస్ నేతలను మంత్రి ఉత్తమ్ ప్రశ్నించారు. ఆ బ్యారేజీని కడితే కాంగ్రెస్‌కు పేరు వస్తుందని, బీఆర్ఎస్‌కు పైసలు రావనే పక్కనపెట్టారని తెలిపారు. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి దాకా నీటిని గ్రావిటీతో తరలించడానికి 100 కిమీల ఓపెన్ కెనాల్ నిర్మాణం జరిగిందని, తుమ్మిడిహెట్టి బ్యారేజీ కడితే 100 కిమీల దాకా గ్రావిటీతో నీళ్లు వచ్చేవని మంత్రి తెలిపారు. కానీ, మేడిగడ్డ వల్ల 100కిమీల కిందికి వెళ్లిన నీటిని ఎత్తిపోయడం, వరదలు రాగానే ఆ నీటిని మళ్లీ సముద్రంలోకి వదిలేయడం జరుగుతోందన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ రూ38 వేల కోట్లతో పూర్తయి ఉంటే.. తుమ్మిడిహెట్టి నుంచి చేవెళ్ల దాకా 17 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందేదని మంత్రి తెలిపారు. కానీ, బీఆర్ఎస్ నేతలు రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టారని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు కొనసాగించి ఉంటే రూ.62 వేల కోట్లు మిగిలేవని తెలిపారు. కాళేశ్వరంలోని అన్ని పంపులు నడిస్తే విద్యుత్ భారమే ఏడాదికి రూ.10 వేల కోట్లు అవుతుందని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు కట్టి ఉంటే విద్యుత్ భారం కేవలం రూ.1000 కోట్లు అయ్యేదని చెప్పారు. బీఆర్ఎస్ తీసుకున్న తప్పుడు నిర్ణయాలు, కక్కుర్తి వల్ల రాష్ట్రానికి, రైతులకు శాశ్వత నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి పారుదల ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ చేసిన అప్పులకు ప్రజలు ఏటా రూ.16 వేల కోట్ల వడ్డీ కట్టాల్సివస్తోందన్నారు. ఇక, శ్రీరాంసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి, లోయర్‌మానేరు, అప్పర్ మానేరు, సింగూరు జలాశయాలను నిర్మించింది కాంగ్రెస్ పార్టీ అని మంత్రి ఉత్తమ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పడే నాటికి ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కింద రూ.6156 కోట్లు ఖర్చు చేశామని, 2016 నాటికి రూ.11,679 కోట్లను వెచ్చించారని చెప్పారు. కాళేశ్వరం బ్యారేజీ వైఫల్యానికి కేసీఆర్, హరీశ్‌రావులే ప్రధాన కారకులని స్పష్టం చేశారు. హరీశ్‌రావుకు సిగ్గుంటే ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



కమలంలో ఈటల ఇరకాటం!

- విచారణ కమిషన్ ముందు ఆయన వివరణపై బీజేపీలో కలకలం
- అవినీతి అని పార్టీ ఆరోపిస్తుంటే.. కేసీఆర్‌ను సమర్థించేలా ఈటల మాటలు
- పార్టీ లైన్‌కు, ఆ వివరణకు పొంతనే లేదు
- కేసీఆర్ అవినీతి గురించి మాటమాత్రం విమర్శ కూడా చేయకపోవడంతో ఇబ్బంది

హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై ఏర్పాటైన పీసీ ఘోష్ కమిషన్‌కు బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఇచ్చిన వివరణ.. ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వాన్ని ఇరుకున పడేసిందా? కేసీఆర్‌ను వెనకేసుకొచ్చేలా ఈటల మాట్లాడారనే భావన బీజేపీ నేతల్లో కలవరం రేపుతోందా?.. అంటే అవుననే అంటున్నాయని కమలం పార్టీ వర్గాలు. బీఆర్ఎస్‌ను దెబ్బకొట్టేందుకు అందివచ్చిన అవకాశాన్ని జారవిడుచుకున్నట్టు అయిందని పార్టీ ముఖ్యనేతలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ కుటుంబం భారీగా అవినీతికి పాల్పడిందంటూ ఇన్నాళ్లుగా పార్టీ నాయకత్వం సంధించిన ఆరోపణలకు భిన్నంగా ఈటల వాదన ఉందని వారు స్పష్టం చేస్తున్నారు.

జాతీయ నాయకత్వానికి అంతర్గత నివేదిక..

పీసీ ఘోష్ కమిషన్ ఎదుట శుక్రవారం హాజరైన ఈటల రాజేందర్.. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల మార్పు, అంచనాల పెంపు తదితర అంశాలపై వివరణలు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఈటల చెప్పిన అంశాలు చర్చనీయాంశంగా మారాయి. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను వెనకేసుకొచ్చేలా ఈటల మాట్లాడారంటూ అధికార కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. ఈ అంశం బీజేపీ జాతీయ నాయకత్వం ఆదేశాల మేరకు ఈటల వ్యాఖ్యలు-పర్యవసానాలపై రాష్ట్ర పార్టీ ముఖ్యులు అంతర్గత నివేదిక పంపించారు. "కాళేశ్వరం ప్రాజెక్టు నాటి సీఎం కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా గత ఎన్నికల ముందు ప్రచారం చేశారు. దానికి అనుగుణంగా కాళేశ్వరం కమిషన్ ఎదుట ఈటల మాట్లాడి ఉండాల్సింది. అంతేగాకుండా కేసీఆర్ అవినీతి గురించి ఈటల పల్లెత్తు మాట కూడా ప్రస్తావించకపోవడం ఇబ్బందిగా మారింది. పార్టీ లైన్‌కు, ఈటల కమిషన్ ఎదుట ఇచ్చిన వివరణకు సంబంధమే లేదు. క్యాబినెట్ నిర్ణయం మేరకే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని, అలాగే టెక్నికల్ కమిటీ ప్రతిపాదనలకు అనుగుణంగానే డిజైన్లు మార్చామని ఇచ్చిన వివరణ కేసీఆర్‌ను వెనకేసుకొచ్చేలా ఉంది" అని ఆ నివేదికలో పేర్కొన్నట్టు సమాచారం.




అది ఈటల స్టాండ్.. బీజేపీ స్టాండ్ కాదు: కిషన్‌రెడ్డి

కాళేశ్వరం అవినీతిపై ఆరోపణలకుపార్టీ కట్టుబడి ఉందని వెల్లడి

కాళేశ్వరం కమిషన్ ఎదుట ఎంపీ ఈటల రాజేందర్ ఇచ్చిన వివరణతో బీజేపీకి సంబంధం లేదని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. కాళేశ్వరం కమిషన్ బీజేపీ వైఖరి ఏమిటని ఈటలను అడగలేదని స్పష్టం చేశారు. "ఈటల స్టాండ్.. బీజేపీ స్టాండ్ కాదు. ఆయన బీజేపీ ఎంపీగా అక్కడ హాజరుకాలేదు. బీఆర్ఎస్‌లో ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు ఏం జరిగిందో అదే చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి తనకు తెలిసినదేమిటో కమిషన్ ఎదుట చెప్పారు. తప్పు చేయలేదు కాబట్టి ధైర్యంగా విచారణకు వెళ్లారు" అని చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లకు పగుళ్లు వచ్చింది నిజమా? కాదా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై తాము చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. కమిషన్‌ను కలుస్తామని, తమ వైఖరి చెబుతామని వెల్లడించారు. చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్ బయటికి వచ్చి ప్రాజెక్టు ఎంతవరకు ఉపయోగకరమో చెప్పాలని సవాల్ చేశారు.

కేసీఆర్‌ను ఈటల సమర్థిస్తే రెండొందల శాతం తప్పు : ఎంపీ కొండా



కాళేశ్వరం కమిషన్ ఎదుట కేసీఆర్‌ను ఈటల రాజేందర్ సమర్థిస్తే అది రెండొందల శాతం తప్పు అని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. తనకున్న సమాచారం ప్రకారం ఈటల అలా చెప్పలేదన్నారు. కాళేశ్వరం అవినీతిలో కేసీఆర్‌తో పాటు ఇంజనీర్లదే తప్పని, ఈటల పాత్ర లేదని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం డిజైన్ చేసింది కేసీఆరేనని, అప్పట్లో కేసీఆర్ నిర్వహించిన సమీక్ష సమావేశాల్లో నాటి మంత్రులు హరీశ్, ఈటలకు కూడా అవకాశం ఉండేది కాదని పేర్కొన్నారు. కేసీఆర్‌కు తానా అంటే తందానా అనే నాయకులు, ఇంజనీర్లు మాత్రమే ఆ సమావేశాల్లో పాల్గొనేవారని చెప్పారు. పార్టీ ఎంపీగా తానూ కొన్ని సమావేశాలకు హాజరయ్యానని వివరించారు. కాళేశ్వరం దరిద్రమైన ప్రాజెక్టు అనివ్యాఖ్యానించారు.

మేడిగడ్డ.. మంత్రివర్గ నిర్ణయమే

వ్యాప్కోస్ నివేదిక, లైడార్ సర్వేలు, ఇంజనీర్ల సలహాలతోనే ఆ ప్రాంతం ఎంపిక.. ఉపసంఘంలో సభ్యులుగా ఈటల, తుమ్మల

- కాళేశ్వరంపై కాంగ్రెస్ ది దుష్ప్రచారం:హరీశ్

హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టాలన్నది అప్పటి మంత్రివర్గం తీసుకున్న నిర్ణయమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. వ్యాప్కోస్ (డబ్ల్యూఏపీసీవోఎస్) నివేదికలు, లైడార్ (ఎల్ఐడీఏఆర్) సర్వేలు, రిటైర్డ్ ఇంజినీర్లు, రాష్ట్ర ఇంజినీర్ల సలహాలు, సూచనల ఆధారంగానే బ్యారేజీ నిర్మాణానికి మేడిగడ్డను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, నిధులు, ప్రస్తుత స్థితి, ప్రయోజనాలపై ఆయన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 'కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం- వాస్తవాలు' పేరిట వివరణాత్మక గణాంకాలతో కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టారు. కేంద్ర జలవనరుల సంస్థ సూచనలకు అనుగుణంగా కీలక బ్యారేజీని ఎక్కడ నిర్మిస్తే.. అనువుగా ఉంటుందో చెప్పాలని వ్యాప్కోస్‌ను కోరుతూ అప్పటి ప్రభుత్వం జీవో జారీ చేసినట్లు తెలిపారు. వాళ్లు సర్వే చేసి మేడిగడ్డ వద్ద కడితే బాగుంటుందని నివేదిక ఇచ్చారని, ఆ నివేదికను స్టడీ చేసేందుకు క్యాబినెట్ సబ్ కమిటీ, రిటైర్డ్ ఇంజినీర్లతో మరో కమిటీని కేసీఆర్ వేసినట్లు గుర్తుచేశారు. అందులో అప్పుడు నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న తాను చైర్మన్‌గా, మరో మంత్రి ఈటల రాజేందర్‌తోపాటు గతంలో నీటిపారుదల శాఖ మంత్రిగా అనుభవం ఉన్న తుమ్మల సభ్యులుగా ఉన్నట్లు తెలిపారు. ముగ్గురం కలిసి నీటిపారుదల శాఖ ఇంజనీర్లతో చర్చలు జరిపామని పేర్కొన్నారు. మేడిగడ్డ వద్ద కాళేశ్వరం కట్టాలని క్యాబినెట్‌కు సబ్ కమిటీతోపాటు రిటైర్డ్ ఇంజినీర్ల కమిటీ నివేదికలు ఇచ్చాయని తెలిపారు. తుమ్మల కూడా సంతకం పెట్టి రికమండ్ చేశారని గుర్తు చేశారు. 2007 నుంచి 2014వరకు కేంద్రం, మహారాష్ట్ర, ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నా.. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతి సాధించలేకపోయారని పేర్కొన్నారు. ఆ ప్రాజెక్టుపై పునరాలోచన చేయాలని సెంట్రల్ వాటర్ కమిషన్ సూచనతోపాటు నీటి లభ్యత లేదన్న నివేదికలతోనే ప్రాణహిత- చేవెళ్లను రీడిజైన్ చేయాల్సి వచ్చిందని చెప్పారు.

అభాండాలు వేయడం సరికాదు

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మొత్తం 20,33,578 ఎకరాలకు సాగునీరు అందిందని, ఇది స్వయంగా కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంలోనే ఉందని హరీశ్ గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా 141 టీఎంసీల నీటిని నిల్వ చేసేలా 16 రిజర్వాయర్లను నిర్మించామని, ఇందులో ఒక్క మల్లన్న సాగర్‌లోనే 50 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉందని తెలిపారు. ఎస్సారెస్పీకి నీళ్లు రాని సమయంలో మేడిగడ్డ ద్వారా నీటిని ఎత్తిపోశామని, వర్షాలు బాగా కురిసినప్పుడు ఎస్సారెస్పీ నుంచి మిడ్‌మానేరుకు నీళ్లు తెచ్చుకున్నామని చెప్పారు. మిడ్‌మానేరు నుంచి అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ వరకు నీటిని ఎత్తిపోశామని తెలిపారు. ఎస్సారెస్పీ స్టేజ్-2లో తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ వరకు నీళ్లందించామన్నారు. కాళేశ్వరం నీటితో నేరుగా 98,570 ఎకరాల కొత్త ఆయకట్టుకు, ప్రాజెక్టు కాల్వల ద్వారా నింపిన 456 మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల ద్వారా 39,146 ఎకరాలకు, అలాగే ఎస్సారెస్పీ స్టేజ్-1, స్టేజ్-2, నిజాంసాగర్ నీటితో నింపిన 2,143 మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల ద్వారా 1.67లక్షల ఎకరాలకు నీరు అందిందని వివరించారు. ఎస్సారెస్పీ స్టేజ్ 1, స్టేజ్ 2, నిజాంసాగర్ ప్రాజెక్టుల పరిధిలోని 17.8లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించామన్నారు. అలాంటి ప్రాజెక్టుపై అభాండాలు వేయడం సరికాదని అన్నారు.

తట్టెడు మట్టి తీయకుండా 1052కోట్లు స్వాహా

దేశంలో ఏ ప్రాజెక్టు కూడా ప్రతిపాదిత వ్యయంతో పూర్తి కాలేదని, కానీ.. దేశంలోనే అతి తక్కువ కాస్ట్ ఎస్కలేషన్‌తో పూర్తి చేసిన ఏకైక ప్రాజెక్టు కాళేశ్వరమేనని హరీశ్‌రావు అన్నారు. తుమ్మిడిహెట్టిని రూ.17,875 కోట్లతో నిర్మిస్తామంటూ 2007లో జీవో ఇచ్చి, ఏ పని చేయకుండానే అంచనా వ్యయాన్ని రూ.38,500 కోట్లకు పెంచిన కాంగ్రెస్ నాయకులు.. కాళేశ్వరం ఖర్చు పెరిగిందంటూ తమపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రాణహిత చేవెళ్ల కోసం రూ.10వేల కోట్లు ఖర్చు చేశామని, ఇంకో 20వేల కోట్లు పెడితే పూర్తయ్యేదన్న ఉత్తమ్ మాటలను ప్రస్తావిస్తూ.. తాము లెక్కలు తీస్తే రూ.3700 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు తేలిందని చెప్పారు. 'తుమ్మిడిహెట్టిలో తట్టెడు మట్టి ఎత్తకుండానే మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరిట రూ.1052కోట్లను చెల్లించారని స్వయంగా కాగ్ తన రిపోర్ట్‌లో వెల్లడించింది. ఆ డబ్బును కాంగ్రెస్ నాయకులే జేబుల్లో నింపుకొన్నారు. ఆనాడు టీడీపీ నేతగా ఉన్న రేవంత్‌రెడ్డి.. ఇది జలయజ్ఞం కాదు.. ధన యజ్ఞం అంటూ విమర్శించారు. కానీ.. అదే రేవంత్‌రెడ్డి ఈ రోజు కాంగ్రెస్ అవినీతిని వెనుకేసుకొస్తున్నారు' అని విమర్శించారు. 9న కమిషన్ ముందు హాజరై ప్రాజెక్టుకు సంబంధించిన వాస్తవాలను చెప్తామని తెలిపారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు సంబంధించి తన వద్ద మరో కీలక డాక్యుమెంట్ ఉందన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కూడా బీజేపీకి జేబు సంస్థగా వ్యవహరిస్తోందని, ఈడీ, సీబీఐలా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పని చేస్తోందని ఆరోపించారు. మేడిగడ్డలో పిల్లర్ కుంగితే రెండు రోజుల్లో వచ్చి.. మూడు రోజుల్లోనే ఎన్డీఎస్ఏ నివేదిక ఎలా ఇచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు.



తెలంగాణ భవన్‌లో కాళేశ్వరంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ సందర్భంగా హరీశ్, కేటీఆర్ మాటామంతీ

ఉత్తమ్.. అబద్ధాల ప్రవాహాన్ని ఆపండి

అబద్ధాల ప్రవాహాన్ని ఇకనైనా ఆపాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి హరీశ్ సూచించారు. కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని ఆధారాలతో బయటపెట్టినా.. మళ్లీ అవే అబద్ధాలు చెబుతున్నారని దుయ్యబట్టారు. ఐదేళ్లలో మేడిగడ్డ నుంచి 162టీఎంసీలే ఎత్తిపోశామని చెబుతున్న ఉత్తమ్‌కు.. లక్ష్మి, సరస్వతి, పార్వతి, నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల నుంచి ఎత్తి పోసిన నీరు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు.

నిందలు.. దందాలు.. చందాలు

- ఇదే కాంగ్రెస్ పాలన
- బీజేపీతో కుమ్మక్కై కాళేశ్వరంపై దుష్ప్రచారం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమ నినాదమైన నీళ్లు, నిధులు, నియామకాలు కాంగ్రెస్ దుర్మార్గపు పాలనలో మాయమైపోయాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలు, ఆరోపణలపై తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రెజంటేషన్ కంటే ముందు కేటీఆర్ మాట్లాడారు. అంతేకాక తన 'ఎక్స్' వేదిక పోస్టుల ద్వారా ఖండించారు. కాంగ్రెస్-బీజేపీ కుమ్మక్కై కాళేశ్వరంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడానికే హరీశ్ పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ఇచ్చినట్లు వివరించారు. కాంగ్రెస్ పాలనను 'బీఆర్ఎస్‌పై నిందలు.. కాంట్రాక్టర్లతో దందాలు.. ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు చందాలు..' అంటూ ఎద్దేవా చేశారు. గోదావరి, కృష్ణాలో ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేందుకు కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని గుర్తుచేశారు. పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టులను 90 శాతం పూర్తిచేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనేక ప్రాజెక్టులు కడుతున్నా.. ముఖ్యమంత్రి, మంత్రులు, బీజేపీ నాయకులు ఎందుకు మాట్లాడటం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. 'గుజరాత్‌లో మోర్బి బ్రిడ్జి కూలి 140 మంది చనిపోయినా ఎన్డీఎస్ఏ నోరు మెదపలేదు.. బిహార్‌లో నాలుగు రోజులకే బ్రిడ్జి కూలినా ఏ ఏజెన్సీ స్పందించలేదు.. సుంకిశాలలో రిటైనింగ్ వాల్ కూలినా రాదు.. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలి 8 మంది చనిపోయినా ఎన్డీఎస్ఏ విచారణ చేయలేదు.. కాళేశ్వరం పిల్లర్లు కుంగితే ఏడాదిన్నరగా మరమ్మతులు చేయకుండా రాద్ధాంతం చేస్తున్నారు.' అని కేటీఆర్ విమర్శించారు. పార్లమెంట్ నూతన భవనం కట్టిన ఎల్ అండ్ టీ సంస్థనే మేడిగడ్డ బ్యారేజీ కట్టిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ కేంద్ర కార్యాలయ భవనం కట్టింది కూడా అదే సంస్థ అని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి రాష్ట్ర రైతులను ఇబ్బందులు పెడుతున్న నేపథ్యంలో జిల్లాలకు వెళ్లి ప్రజలకు వాస్తవాలను వివరిస్తామన్నారు. మేడిగడ్డ పిల్లర్లకు మరమ్మతులు చేసి రైతులకు నీళ్లిచ్చే అవకాశం ఉన్నా.. కుంటిసాకులతో కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రజలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌లో 4 ట్రాన్సిట్ కారిడార్లు..!

- నాగోల్, అమీర్‌పేట, పటాన్‌చెరు, జవహర్ నగర్‌లో అమలుకు చర్యలు
- 500-800 మీటర్లలో ఏర్పాటు
- ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టే ప్రయత్నం
- మౌలిక వసతులపై తగ్గనున్న ఒత్తిడి
- తదుపరి దశల్లో ఇతర నగరాలకు చాన్స్

హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ లాంటి నగరాలు, వేగంగా పట్టణీకరణ జరుగుతున్న ప్రాంతాల్లో పెరుగుతున్న ట్రాఫిక్, కాలుష్యానికి చెక్ పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన నేషనల్ ట్రాన్సిట్ ఓరియెంటేషన్ డెవలప్‌మెంట్(టీవోడీ) విధానాన్ని అందిపుచ్చుకోవాలని భావిస్తోంది. ఇందులో భాగంగా జనసాంద్రత, వాహనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో ట్రాన్సిట్ కారిడార్లను ఏర్పాటు చేయనుంది. ప్రజలు తమ ఇళ్ల నుంచి కార్యాలయాలకు నడిచి వెళ్లడం లేదా.. ప్రజారవాణా వ్యవస్థను ఉపయోగించుకునేలా ప్రోత్సహించనుంది. తద్వారా వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గి.. ట్రాఫిక్, వాతావరణ కాలుష్య సమస్యలు తీరుతాయని అధికారులు చెబుతున్నారు. టీవోడీ విధానంలో కీలక ప్రాంతాల్లో 500-800 మీటర్లలో ట్రాన్సిట్ కారిడార్లను అభివృద్ధి చేస్తారు. దాంతోపాటు.. నివాస ప్రాంతాల్లోనే ఉద్యోగావకాశాలు, నిత్యావసరాలు లభించే కేంద్రాలు, పాఠశాలలు, పార్కులు, వినోద కేంద్రాలను ప్రోత్సహించాలని పురపాలక శాఖ భావిస్తోంది. ట్రాన్సిట్ కారిడార్లలో పార్కులు, సైకిల్ లేన్లు, పాదచారుల బాటలను ఏర్పాటు చేస్తారు. తొలిదశలో అమీర్‌పేట, నాగోల్, పటాన్‌చెరు, జవహర్‌నగర్‌లలో వీటిని ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. తదుపరి దశలో హైదరాబాద్‌తోపాటు.. వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ నగరాల్లోనూ ఈ కారిడార్లను ఏర్పాటు చేస్తారు. దీనిపై ఇంకా సమగ్ర నివేదికలు తయారు కావాల్సి ఉందని అధికారులు వివరించారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ విధ్వంసంపై.. విచారణ జరిపించాలి

- బీసీలు కంపెనీలు పెడితే ఓర్వలేకనే దాడులు: ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : గద్వాల్ జిల్లా రాజోలి మండలం ధన్వాడ గ్రామ సమీపంలోని ఇథనాల్ ఫ్యాక్టరీలో జరిగిన విధ్వంసంపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని, అందుకు బాధ్యులైన వారు ఏ స్థాయిలో ఉన్నా కఠిన చర్యలు తీసుకోవాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీలు కంపెనీలు పెట్టి ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తుంటే ఓర్వలేకనే కొంతమంది రాజకీయ పార్టీల ముసుగులో ఈ దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

హామీలిచ్చి ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం

- ఉద్యోగులకు వెంటనే డీఏలు ఇవ్వాలి: కవిత

జగిత్యాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసిన ఉద్యోగులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక విస్మరించిందని నిజామాబాద్ ఎమ్మెల్సీ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. శనివారం ఆమె జగిత్యాల జిల్లాలో పలు ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... ఉద్యోగులకు సమయానికి టీఏలు, డీఏలు, వేతనాలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎగవేసిందని విమర్శించారు. ఉద్యోగులకు ఇచ్చిన అన్ని హామీలను వెంటనే నెరవేర్చాలని, పెండింగ్ డీఏలన్నీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రాజన్న తిప్పాపూర్ గోశాలలో మరో 2 కోడెలు మృతి

వేములవాడ కల్చరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం తిప్పాపూర్ గోశాలలో మరో రెండు కోడెలు మృతిచెందాయి. దీంతో ఇప్పటివరకు మృతిచెందిన కోడెల సంఖ్య 33కు చేరింది. అనారోగ్యం బారిన పడిన 14 కోడెలకు వైద్యాధికారులు చికిత్స అందిస్తుండగా, పది కోడెలు కోలుకుంటున్నట్లు జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు. మరో రెండు కోడెల పరిస్థితి విషమంగా ఉందన్నారు. కోడెల ఆరోగ్య సంరక్షణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ఎమ్మెల్యే మాగంటిని పరామర్శించిన కేటీఆర్

రాయదుర్గం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం పరామర్శించారు. అమెరికా పర్యటన ముగించుకొని శుక్రవారం హైదరాబాద్ చేరుకున్న కేటీఆర్... శనివారం ఉదయం ఏఐజీ ఆస్పత్రికి చేరుకొని గోపీనాథ్‌ను పరామర్శించారు. ఆయనకు చికిత్స అందిస్తున్న ఆస్పత్రి వైద్యులతో కేటీఆర్ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సుమారు 45 నిమిషాలపాటు వైద్యులతో మాట్లాడిన అనంతరం కేటీఆర్ వెళ్లిపోయారు.

నేడు గోపీనాథ్‌ను పరామర్శించనున్న కేసీఆర్..

ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాగంటి గోపీనాథ్‌ను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదివారం పరామర్శించనున్నారు. ఈ సందర్భంగా గోపీనాథ్ కుటుంబసభ్యులకు ఆయన ధైర్యం చెప్పనున్నారు.

జస్బీర్ ఫోన్‌లో 150 పాకిస్థాన్ కాంటాక్టులు

- ఆయనను ఐఎస్ఐకి పరిచయం చేసిన పాక్ మాజీ పోలీసు, యూట్యూబర్ నాసిర్ ఢిల్లాన్

న్యూఢిల్లీ, జూన్ 7: పాకిస్థాన్ కోసం భారత్‌లో గూఢచర్యం చేస్తున్న కేసులో అరెస్టయిన పంజాబ్ యూట్యూబర్ జస్బీర్‌సింగ్ ఫోన్‌లో 150 వరకు పాకిస్థాన్ కాంటాక్టులు (ఫోన్ నంబర్లు) ఉన్నట్టు విచారణ అధికారులు గుర్తించారు. ఆయన ఆరుసార్లు పాకిస్థాన్‌లో పర్యటించి, నేరుగా పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ గూఢచారులతో భేటీ అయినట్టు తేల్చారు. గూఢచర్యం కేసులో అరెస్టయిన మరో యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాతో జస్బీర్‌కు పరిచయం ఉన్నట్టు గుర్తించారు. అంతేకాదు.. పాక్‌కు చెందిన మాజీ పోలీసు అధికారి, ప్రస్తుతం యూట్యూబర్‌గా ఉన్న నాసిర్ ఢిల్లాన్ లాహోర్‌లో తనను ఐఎస్ఐ గూఢచారి, ఢిల్లీలోని పాక్ రాయబార కార్యాలయంలో వీసా అధికారిగా పనిచేసిన డానిష్ అలియస్ ఎహ్సాన్ ఉర్ రెహ్మాన్‌కు పరిచయం చేసినట్టుగా జస్బీర్‌సింగ్ వెల్లడించినట్టు తెలిసింది. డానిష్ తన నుంచి కొన్ని సిమ్‌కార్డులు తీసుకున్నాడని.. పాక్ నిఘా అధికారి ఒకరికి తన ల్యాప్‌టాప్‌ను గంటపాటు అప్పజెప్పానని వివరించినట్టు సమాచారం. జస్బీర్ ల్యాప్‌టాప్, ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు ఫోరెన్సిక్ నిపుణులతో పరిశీలన జరుపుతున్నారు. పాక్ మాజీ పోలీసు అధికారి నాసిర్ ఢిల్లాన్ యూట్యూబర్ ముసుగులో భారత యూట్యూబర్లతో పరిచయం పెంచుకుని, ఐఎస్ఐ గూఢచారి డానిష్ వద్దకు తీసుకెళ్లి.. వారిని ప్రలోభాలతో గూఢచర్యంలోకి దింపినట్టు దర్యాప్తు అధికారులు తేల్చారు. డానిష్ ఏవేవో కార్యక్రమాలకు ఆహ్వానం పేరిట ఈ యూట్యూబర్లను పాక్ హైకమిషన్‌కు రప్పించుకుని, వారికి టాస్కులు అప్పగించినట్టు గుర్తించారు.

స్కూల్ బస్సులు పదిలమేనా?

రాష్ట్రవ్యాప్తంగా 25,677 బస్సులు.. ఇప్పటి వరకూ ఫిట్‌నెస్ జారీ అయినవి 17,020 బస్సులకే

- మే 15తో ముగిసిన గడువు.. ఈ నెల 12న స్కూళ్లు పునఃప్రారంభం
- ఆలోపు ఫిట్‌నెస్ తీసుకోకపోతే బస్సుల్ని సీజ్ చేస్తామంటున్న అధికారులు
- సర్టిఫికెట్ జారీ సమయంలో నిబంధనల్ని పట్టించుకోని కొందరు ఎంవీఐలు


బస్సు పత్రాలు పరిశీలిస్తున్న రవాణాశాఖ అధికారి

హైదరాబాద్/సిటీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మరో నాలుగు రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం. అయినా ఇప్పటికీ పలు విద్యాసంస్థలు బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకోలేదు. రాష్ట్రవ్యాప్తంగా 25,677 విద్యాసంస్థల బస్సులు ఉంటే ఇప్పటి వరకు 17,020 బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకున్నాయి. మిగిలిన 8,657 బస్సులు ఇంకా తీసుకోలేదు. విద్యాసంస్థల బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి. ఏటా మే 15వ తేదీతో బస్సు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల గడువు ముగుస్తుంది. ఆలోపు రెన్యువల్ చేసుకోవాలి. విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే నాటికి స్కూలు బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉండాలి. లేని పక్షంలో అవి రోడ్లపైకి రాకూడదు. కానీ కొన్ని విద్యాసంస్థల యజమాన్యాలు ఇప్పటికీ దరఖాస్తు చేయలేదని రవాణాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

భద్రత, ప్రమాణాలు ముఖ్యం

ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ సమయంలో మోటార్ వాహనాల చట్టం ప్రకారం పలు అంశాలను రవాణా శాఖలోని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు (ఎంవీఐలు) పరిశీలిస్తారు. సదరు వాహనాలను నడిపే డ్రైవర్ల వయసు 60 ఏళ్లలోపు ఉండాలి. డ్రైవర్ భారీ వాహనాల లైసెన్స్ కలిగి ఉండాలి. విద్యార్థులు బస్సు ఎక్కే, దిగే సమయంలో వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకునేందుకు సహాయకుడు ఉండాలి. బస్సులో ప్రథమ చికిత్స కిట్, అగ్నిమాపక పరికరాలు, సీట్ల మధ్య నిర్ణీతస్థాయిలో ఖాళీ, అత్యవసర మార్గాలు ఉండాలి. వాహనానికి సంబంధించి ఆర్‌సీ, పొల్యూషన్, ఇతరత్రా పత్రాలు తప్పనిసరి. వీటితోపాటు వాహనం టైర్లు, బ్రేకులు, ఇంజిన్ కండీషన్ తదితరాలు పరిశీలించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు.

చూసీచూడనట్లు..

నిబంధనల ప్రకారం వాహనం ఉందా? లేదా? అన్నది పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నా.. కొందరు మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు నిబంధనల్ని గాలికి వదిలేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బస్సులో ప్రాథమిక చికిత్స, అగ్నిమాపక కిట్ వంటివి ఉన్నాయా? లేదా? అన్నది పట్టించుకోవడం లేదు. బ్రేకులు, ఇంజిన్ కండీషన్‌లో లోపాలున్నా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలో పాఠశాలలు, ఇంజనీరింగ్ కళాశాలలు ఎక్కువ. వీటికి సంబంధించి 13 వేలకుపైగా బస్సులు ఉండగా.. ఇప్పటి వరకు 10 వేల బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ అయ్యాయి. ఇవన్నీ ప్రమాణాల ప్రకారం ఉన్నవేనా అంటే ఔనని అధికారులూ స్పష్టంగా చెప్పలేని పరిస్థితి. కొన్ని విద్యాసంస్థల్లో 15 ఏళ్లు దాటిన వాహనాలూ యథేచ్ఛగా రోడ్ల మీద నడుస్తుండటం గమనార్హం.

ఫిట్‌నెస్ లేని వాహనాలు సీజ్

రాష్ట్రవ్యాప్తంగా 25,677 విద్యాసంస్థల బస్సులు ఉంటే ఇప్పటి వరకు 17,020 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకున్నాయి. మిగిలిన 8,657 బస్సులు విద్యాసంస్థలు పునఃప్రారంభమయ్యేలోగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలి. ఫిట్‌నెస్ లేని వాహనాలు రోడ్లపైకి వస్తే సీజ్ చేస్తాం. 15 ఏళ్లు దాటిన విద్యాసంస్థల బస్సులు ఎట్టి పరిస్థితుల్లో రోడ్లపై తిరగరాదు. ఫిట్‌నెస్ లేని బస్సుల్లో విద్యార్థుల్ని తీసుకెళ్తే ఆ వాహనాల్ని సీజ్ చేయడంతోపాటు యాజమాన్యాలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. యాజమాన్యాలు వాహనాల్ని మంచి కండీషన్‌లో ఉంచడంతోపాటు అనుభవజ్ఞులైన డ్రైవర్లను నియమించుకోవాలి. 12వ తేదీ నుంచి పాఠశాలలు ప్రారంభం కాగానే తనిఖీలు ప్రారంభించాలని రవాణా శాఖ కార్యాలయాల అధికారులను ఆదేశించాం.

- విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిళ్ల చంద్రశేఖర్‌గౌడ్

తుమ్మల ఆల్ పార్టీ మంత్రి

ఏ పార్టీ అధికారంలో ఉంటే అందులో చేరి మంత్రి అవుతారు

ఈటలపై తుమ్మల విమర్శల నేపథ్యంలో కిషన్‌రెడ్డి ఎద్దేవా

బనకచర్ల డీపీఆర్‌ను కేంద్రం ఇంకా పరిశీలించలేదని వెల్లడి



హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి ఆరోపణలపై ఏర్పాటైన విచారణ కమిషన్ ముందు బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అబద్ధాలు చెప్పారన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. "తుమ్మల నాగేశ్వర్‌రావు ఆల్ పార్టీ మంత్రి. ఏ పార్టీ అధికారంలో ఉంటే అందులో చేరి ఆయన మంత్రిగా కొనసాగుతారు" అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్, టీడీపీ ప్రభుత్వాల్లో కూడా తుమ్మల మంత్రిగా పనిచేశారని గుర్తు చేశారు. శనివారం బీజేపీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రం ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఏపీ ప్రభుత్వం డీపీఆర్ ఇచ్చిందని తెలిపారు. అయితే, దానిని కేంద్రం ఇంకా పరిశీలించలేదని వెల్లడించారు. డీపీఆర్‌ను అధ్యయనం చేసిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటుందన్నారు. గోదావరి జలాల పంపిణీలో తెలంగాణకు అన్యాయం జరగవద్దని, ఈ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రానికి లేఖ రాయాలని, బనకచర్ల ప్రాజెక్టు ఎందుకు నిలిపివేయాలో పూర్తి వివరాలతో కేంద్ర జలవనరుల శాఖకు నివేదించాలని కిషన్‌రెడ్డి సూచించారు. రాష్ట్ర బీజేపీ కొత్త అధ్యక్షుడి ఎన్నిక త్వరలోనే ఉంటుందని వెల్లడించారు. కాగా, సింగరేణి సంస్థ ఖర్చులు తగ్గించుకోవాలని కిషన్‌రెడ్డి అన్నారు. ఈ సంస్థకు తెలంగాణ ప్రభుత్వం రూ.42వేల కోట్లు, ఏపీ ప్రభుత్వం రూ.1200కోట్లు బకాయి ఉన్నాయని ఆయన వెల్లడించారు.

మమ్మల్ని ఆంధ్రప్రదేశ్‌కు పంపండి

- తెలంగాణలో పని చేస్తున్న ఏపీ హోంగార్డుల విజ్ఞప్తి

విజయవాడ (గాంధీనగర్), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో తమ పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకమవకుండా తమను ఆంధ్రప్రదేశ్‌కు పంపాలని తెలంగాణలో విధులు నిర్వర్తిస్తున్న ఏపీకి చెందిన హోంగార్డులు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పోషణ వారి అనారోగ్య సమస్యలకు చికిత్సలను చూసేందుకు అవకాశం కలగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో ఉండటం వల్ల తమ పిల్లలు ఆంధ్రప్రదేశ్ స్థానికత కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారన్నారు. తెలంగాణలో సుమారు 400 మంది ఏపీకి చెందిన హోంగార్డులు విధులు నిర్వర్తిస్తున్నారని... ఇప్పటికైనా రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు స్పందించి తమకు న్యాయం చేయాలని శనివారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఓఆర్ఆర్ లోపల 65వేల ఆటోలకు అనుమతి

- విద్యుత్, ఎల్పీజీ, సీఎన్‌జీ ఆటోలకు మాత్రమే
- 65వేల కుటుంబాలకు ఉపాధి: మంత్రి పొన్నం



హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్)లోపల కొత్తగా 65 వేల ఆటోకు ప్రభుత్వం అనుమతించింది. హైదరాబాద్‌లో పెరుగుతున్న జనాభాకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ జీవో ఆర్టీ నంబర్ 263 జారీ చేశారు. కాలుష్య నియంత్రణలో భాగంగా అమల్లో ఉన్న నిబంధనల మేరకు హైదరాబాద్‌లో కొత్త ఆటోలకు పర్మిట్లు ఇచ్చేందుకు వీలు లేదు. 2002 నుంచి ఈ నిబంధన అమలవుతుండగా, తెలంగాణ ఏర్పాటు తర్వాత అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా 20వేల ఆటోలకు మాత్రమే పర్మిట్లు ఇచ్చింది. అయితే, ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలను సడలిస్తూ ఓఆర్ఆర్ లోపల పరిమిత సంఖ్యలో విద్యుత్, సీఎన్‌జీ, ఎల్పీజీ ఆటోలకు ప్రభుత్వం అనుమతించింది. 20 వేల విద్యుత్ ఆటోలు, 10వేల ఎల్పీజీ ఆటోలు, 10వేల సీఎన్‌జీ ఆటోలు, 25వేల డీజిల్, పెట్రోల్ ఇంజన్లతో ఉన్న (రెట్రో ఫిట్మెంట్ విధానంలో విద్యుత్, సీఎన్‌జీ, ఎల్పీజీగా మార్చేందుకు వీలైన) ఆటోలకు అనుమతులు ఇచ్చేందుకు సర్కారు ఓకే చెప్పింది. కాగా, ఓఆర్ఆర్ లోపల జనాభా పెరుగుదలను దృష్టిలో పెట్టుకొని సీఎం రేవంత్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో 65 వేల కుటుంబాలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఒక ప్రకటనలో వివరించారు.

నేడే విస్తరణ

(మొదటిపేజీ తరువాయి)

పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. కాగా, నిజామాబాద్ జిల్లా బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డికి మంత్రివర్గంలో స్థానం ఖాయమని ముందు నుంచీ ప్రచారం జరుగుతోంది. అయితే తుది జాబితాలో ఆయన పేరు ఉంటుందా? లేదా? అన్నది సస్పెన్స్‌గానే మారింది. మంత్రివర్గ విస్తరణకు గ్రీన్‌సిగ్నల్ లభించి, విస్తరణ ముహూర్తం కూడా ఖరారైనా.. జాబితాపై మాత్రం అర్ధరాత్రి వరకు తుది చర్చలు నడుస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో బెర్తుల ఖరారులో మార్పుచేర్పులు కూడా ఉండవచ్చని తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం జరిగేది మంత్రివర్గ విస్తరణా? పునర్‌వ్యవస్థీకరణా? అన్న చర్చ కూడా నడిచింది. అయితే ప్రస్తుతానికి విస్తరణ మాత్రమే ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

అంతటా చర్చ.. అంతా సస్పెన్స్

మంత్రివర్గ విస్తరణపై శనివారం మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు ఊహాగానాలు సాగాయి. కాంగ్రెస్‌లో అందరూ ఇదే అంశంపై చర్చించుకున్నారు. కానీ, కొత్త మంత్రులు ఎవరు అవుతారనే అంశంపై మాత్రం సస్పెన్స్ కొనసాగింది. ఒక దశలో పార్టీలోని ముఖ్యనేతలెవరికీ దీనిపై నిర్దిష్ట సమాచారం లేకుండా పోయింది. సీఎం రేవంత్‌రెడ్డికి మాత్రం అధిష్ఠానం ముందుగానే చెప్పింది. ఆ తర్వాత క్రమంగా రాత్రి 10 గంటలు దాటాక పార్టీలోని సీనియర్లు, మంత్రులకు కూడా ఈ సమాచారం అందించారని తెలిసింది. అయితే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని, ఫలానా సమయంలో అని మాత్రమే చెప్పారు తప్ప.. ఎవరెవరికి? ఎంతమందికి? అన్న విషయంలో మాత్రం ఒకరిద్దరికే స్పష్టత ఉందని సమాచారం.


సీఎం రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్, కవ్వంపల్లి సత్యనారాయణ, మందుల సామేల్, వేముల వీరేశం, కాలే యాదయ్య

మంత్రివర్గంలో మాకు అవకాశం ఇవ్వండి

- సీఎం రేవంత్‌ను కలిసిన మాదిగ ఎమ్మెల్యేలు

హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మంత్రివర్గంలో తమ సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలని పలువురు మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌ని కోరారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యేలు కొద్దిసేపు ఆయనతో మాట్లాడారు. సీఎంను కలిసిన వారిలో ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ఉన్నారు.

గ్రీన్‌కో ప్రాజెక్టు అద్భుతం

- తెలంగాణలోనూ ఇలాంటి ప్రాజెక్టు ఏర్పాటు చేస్తాం
- పిన్నాపురం గ్రీన్‌కో పవర్ ప్రాజెక్టు సందర్శనలో డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్/ ఓర్వకల్లు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలోనే గ్రీన్‌కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ సంస్థ ఏర్పాటు చేసిన ప్రాజెక్టు అద్భుతమని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. తెలంగాణలోనూ ఇటువంటి ప్రాజెక్టే ఏర్పాటు చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లా పిన్నాపురంలోని గ్రీన్‌కో ఇంటిగ్రేటెడ్ పవర్ సంస్థ యాజమాన్యం ఆహ్వానం మేరకు మల్లు భట్టి విక్రమార్క శనివారం ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ భవిష్యత్తు హరిత ఇంధనానిది (గ్రీన్ పవర్)దే నన్నారు. గ్రీన్ పవర్ ఉత్పత్తి కోసం తమ ప్రభుత్వం రూ.లక్ష కోట్ల విలువైన అవగాహనా ఒప్పందాలు (ఎంవోయూ) కుదుర్చుకున్నదని, పక్కా ప్రణాళికతో 2030 నాటికి రాష్ట్రంలో 20 వేల మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంతో ముందుకు సాగుతున్నదన్నారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ ఉత్పత్తి పెంపునకు గల మార్గాలను అన్వేషిస్తున్నామని చెప్పారు. అందుకే తమ సర్కారు 'నూతన విద్యుత్ విధానం-2025' తెచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో విఁగులు విద్యుత్ ఉత్పత్తి దిశగా అడుగులేస్తున్నామన్నారు. ప్రపంచవ్యాప్తంగా వస్తు ఉత్పత్తితోపాటు దాని సరఫరాకు పుష్కలంగా విద్యుత్తు ఉండాలని భట్టి విక్రమార్క చెప్పారు. వస్తు ఉత్పత్తితోపాటు ఉపాధి, రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) పెరుగుతాయన్నారు. కేవలం బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి వ్యయంతోపాటు కాలుష్యం పెరిగిపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ప్రపంచవ్యాప్తంగా గ్రీన్ పవర్ ఉత్పత్తికి పెరిగిన ప్రాధాన్యానికి అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తికి.. ముఖ్యంగా సౌర విద్యుత్ ఉత్పత్తికి గల అన్ని అవకాశాలనూ ఉపయోగించుకుంటామని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ పర్యటనలో గ్రీన్‌కో ఎండీ చలమలశెట్టి అనిల్‌కుమార్, తెలంగాణ ఎమ్మెల్యేలు మధుసూదన్ రెడ్డి, మేఘారెడ్డి, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, జెన్‌కో సీఎండీ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.